www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 20-3-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 351 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి రా. 2.24 తదుపరి ద్వాదశి; నక్షత్రం: పుష్యమి రా. 10.39 తదుపరి ఆశ్లేష వర్జ్యం: శేషం ఉ. 6.46 వరకు; దుర్ముహూర్తం: ఉ. 11.59-12.47; అమృతఘడియలు: మ. 3.35-5.21; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 6.23 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఫిరాయింపుదార్లదే నిజమైన పార్టీయా?

చట్టసభలోని బలాన్నే పరిగణనలోకి తీసుకుంటారా?

ఓటర్లను అపహాస్యం చేయడం కాదా?

ఎన్‌సీపీ వివాదంలో సుప్రీం వ్యాఖ్యలు

'అలారం క్లాక్' గుర్తు కోర్టు పరిధిలో ఉందని అన్ని ప్రకనటల్లో పేర్కొనండి

అజిత్ పవార్ వర్గానికి ఆదేశం

న్యూఢిల్లీ, మార్చి 19: ఫిరాయింపుదార్లనే నిజమైన పార్టీగా గుర్తిస్తున్న ప్రస్తుత విధానం ఓటర్ల తీర్పును అపహాస్యం చేయడం కిందకే వస్తుందని మంగళవారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. పార్టీ ఫిరాయింపులను నిషేధించడానికి ఉద్దేశించిన రాజ్యాంగంలోని పదో షెడ్యూలును పక్కనపెట్టి ఎన్నికల కమిషన్ నిర్ణయాలు తీసుకుంటుండడాన్ని ప్రశ్నించింది. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సీపీ)లోని అజిత్ పవార్, శరద్ పవార్ వర్గాలు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌ల ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. "సంస్థాగతంగా ఉన్న బలాన్ని చూడకుండా చట్టసభల్లో ఉన్న

మిగతా 2వ పేజీలో...



గవర్నర్‌గా రాధాకృష్ణన్

ఝార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతల అప్పగింత

వరుసగా మూడోసారీ తమిళనాడుకు చెందిన వ్యక్తే

తమిళనాట బీజేపీ మాజీ అధ్యక్షుడు.. రెండుసార్లు ఎంపీ

ఎన్డీయేలోకి అన్నాడీఎంకేను రప్పించడంలో కీలక పాత్ర

తమిళిసై రాజీనామాకు ఆమోదం.. రాష్ట్రపతి ఉత్తర్వులు

న్యూఢిల్లీ, హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌గా సీపీ రాధాకృష్ణన్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ గవర్నర్ పదవికి, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి డాక్టర్ తమిళిసై సౌందర్‌రాజన్ చేసిన రాజీనామాను ఆమోదించారు. ఆమె స్థానంలో మరొకరిని నియమించే వరకూ తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఝార్ఖండ్ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌ను కోరారు. ఈ మేరకు ఆయనకు బాధ్యతలు అప్పగిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజ్‌భవన్ దర్బార్ హాల్‌లో బుధవారం ఉదయం 11.30 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో రాధాకృష్ణన్ తెలంగాణ గవర్నర్‌గా బాధ్యతలు చేపడతారు. వెరసి, తెలంగాణకు వరుసగా మూడోసారి కూడా తమిళనాడుకు చెందిన వ్యక్తే గవర్నర్‌గా రావడం విశేషం. తెలంగాణ తొలి గవర్నర్‌గా నరసింహన్ కొనసాగగా.. ఆ తర్వాత అదే రాష్ట్రానికి చెందిన తమిళిసై వ్యవహరించిన విషయం తెలిసిందే. నిజానికి,

మిగతా 13వ పేజీలో...

పేద మహిళకు ఏడాదికి లక్ష

యువతకు ఏడాదిపాటు రూ.లక్ష అప్రెంటిస్‌షిప్





- రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ తొలగింపు
- కనీస వేతనం రోజుకు రూ.400కు పెంపు
- పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత
- పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా చెల్లింపు
- కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
- కార్మికులకు ఆరోగ్య హక్కు చట్టం అమలు
- పేపర్ లీకేజీలు అరికట్టేందుకు కఠిన చట్టం
- ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు డబుల్ శాలరీ కాంట్రిబ్యూషన్
- ఇంటింటికీ గ్యారెంటీ పేరిట కాంగ్రెస్ మ్యానిఫెస్టో
- ఐదు న్యాయాల్లో 25 గ్యారెంటీలకు చోటు
- అదనంగా, దేశవ్యాప్తంగా పాత పింఛను పథకం
- రాజ్యాంగ సంస్థల రక్షణకు చట్టం తెస్తామని హామీ

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రతి పేద కుటుంబంలోని ఓ మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు! విద్యావంతులైన యువతకు ఒక ఏడాదిపాటు ఒక్కొక్కరికి లక్ష రూపాయల అప్రెంటిస్‌షిప్! రిజర్వేషన్లపై 50 శాతం సీలింగ్ తొలగింపు! ఉపాధి హామీ సహా దేశవ్యాప్తంగా కనీస వేతనం రోజుకు రూ.400! శాశ్వత రుణ మాఫీ కమిషన్ ఏర్పాటు! శ్రామికులకు ఆరోగ్య హక్కు చట్టం! తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్న హామీల్లో ఇవి కొన్ని మాత్రమే! మోదీ గ్యారెంటీలకు దీటుగా అన్ని వర్గాలకు లబ్ధి



చేకూర్చేలా లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి తమ మ్యానిఫెస్టోను కాంగ్రెస్ సిద్ధం చేసింది. రైతులు, యువత, మహిళలు, కార్మికులు, అణగారిన వర్గాలను దృష్టిలో పెట్టుకుని 'ఐదు న్యాయాల'కు తుది రూపు ఇచ్చింది. 'ఇంటింటికీ గ్యారెంటీ' పేరిట రూపొందించిన ఐదు న్యాయాల్లో 25 హామీలను గుదిగుచ్చింది. పి.చిదంబరం నేతృత్వంలోని మ్యానిఫెస్టో కమిటీ రూపొందించిన ఐదు హామీలకు అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) ఆమోదం తెలిపింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆధ్వర్యంలో మంగళవారం కాంగ్రెస్ కేంద్ర కార్యాలయంలో సీడబ్ల్యూసీ సమావేశం జరిగింది. పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితోపాటు తెలుగు రాష్ట్రాలకు చెందిన సీడబ్ల్యూసీ సభ్యులు పల్లంరాజు, టి.సుబ్బిరామిరెడ్డి, గిడుగు రుద్రరాజు,

మిగతా 2వ పేజీలో...



దానం నాగేందర్ | సునీత | మల్లు రవి

మల్కాజిగిరి నుంచి సునీత

చేవెళ్ల సీటు రంజిత్ రెడ్డికి.. సికింద్రాబాద్ నుంచి దానం

మరో ఏడు టికెట్లు ఖరారు చేసిన కాంగ్రెస్

నాగర్‌కర్నూలులో మల్లు రవి.. పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ

మెదక్ నుంచి నీలం మధు, నిజామాబాద్ జీవన్ రెడ్డి

ఇంకా ఆరు సీట్లు పెండింగ్‌లోనే.. రేపు ఖరారుకు చాన్స్



గడ్డం వంశీ



జీవన్‌రెడ్డి



నీలం మధు

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా సునీతా మహేందర్ రెడ్డి పేరు ఖరారు చేశారు. చేవెళ్ల అభ్యర్థిగా ఇటీవల పార్టీలో చేరిన రంజిత్ రెడ్డిని, సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా దానం నాగేందర్‌ను ఎంపిక చేశారు. ఇక, నాగర్‌కర్నూల్ అభ్యర్థిగా మల్లు రవి, పెద్దపల్లి నుంచి గడ్డం వంశీ, మెదక్ నుంచి నీలం మధు, నిజామాబాద్ నుంచి జీవన్ రెడ్డి పేర్లు ఖరారయ్యాయి. వెరసి, తెలంగాణలో మరో ఏడు స్థానాలకు లోక్‌సభ అభ్యర్థులను కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఖరారు చేసింది. ఇప్పటికే నలుగురు అభ్యర్థుల (మహబూబ్‌నగర్-వంశీచంద్ రెడ్డి; మహబూబాబాద్- బలరాం నాయక్); జహీరాబాద్ - సురేశ్ షెట్కార్; నల్లగొండ - కుందూరు రఘువీర్ రెడ్డి)ను ఖరారు చేసిన కాంగ్రెస్.. మరో ఆరు స్థానాలను పెండింగ్ లో ఉంచింది. కాంగ్రెస్ ఎన్నికల కమిటీ సమావేశం మంగళవారం దాదాపు మూడు

మిగతా 13వ పేజీలో...



అత్యంత కాలుష్య దేశాల్లో భారత్ @ 3

మొదటి రెండు స్థానాల్లో బంగ్లా, పాక్

అత్యంత కాలుష్య రాజధాని ఢిల్లీ

కాలుష్య నగరాల జాబితాలో మొదటి నాలుగు భారత్‌లోనే

మొదటి 50 నగరాల్లో 42 మనవే

2



'పతంజలి'పై సుప్రీంకోర్టు ఆగ్రహం

ప్రకటనలు ఇవ్వకూడదన్న ఉత్తర్వులు ఎందుకు అమలు చేయలేదు?

ఆ ఆర్డర్ల ఉల్లంఘనపై సమాధానమేది?

బాబా రాందేవ్, ఆచార్య బాలకృష్ణ కోర్టుకు హాజరు కావాల్సిందే

సుప్రీం ధర్మాసనం ఆదేశం

సీఏఏ అమలుపై స్టే ఇవ్వలేం: సుప్రీం

2

ఫోన్ వాడుతూ రైలు ఎక్కితే జైలుకే

14

పట్టాల పరిసరాల్లో సెల్ఫీ దిగినా అంతే

ట్రాక్ పక్కన నడుస్తూ ఫోన్ మాట్లాడొద్దు

భద్రత దృష్ట్యా అధికారుల నిషేధాజ్ఞలు

ఏ సాఫ్ట్‌వేర్ వాడారు?



ఎక్కడి నుంచి కొనుగోలు చేశారు??

మూడోరోజు విచారణలో ప్రణీత్‌రావుపై దర్యాప్తు అధికారుల ప్రశ్నలు

రిట్రీవ్ అయిన మొబైల్ డేటా

సహకరించిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లకు బేడీలు

అనంతగిరిలో హార్డ్‌డిస్క్‌ల శకలాలు

వాటి రిట్రీవ్ కష్టమేనంటున్న నిపుణులు!

నిబంధనలకు విరుద్ధంగా కస్టడీకి ఇచ్చారు

ఫోన్ ట్యాపింగ్ కేసులో పోలీసులు మీడియాకు లీకులు ఇస్తున్నారు

హైకోర్టును ఆశ్రయించిన ప్రణీత్‌రావు

హైదరాబాద్ సిటీ, వికారాబాద్, హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఎస్ఐబీలో ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేస్తున్నారు. ఈ కేసులో అరెస్టయిన మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు పోలీసు కస్టడీ మరో నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో.. కోర్టులో నేరాన్ని రుజువుచేసేందుకు కావాల్సిన ఆధారాలను సేకరిస్తున్నారు. ఈ క్రమంలో మూడోరోజు కస్టడీలో భాగంగా మంగళవారం ఫోన్‌ట్యాపింగ్‌కు ప్రణీత్‌రావు ఉపయోగించిన సాఫ్ట్‌వేర్‌పై ప్రశ్నలు సంధించినట్లు తెలిసింది. "టార్గెట్‌గా చేసుకున్న వ్యక్తుల ఫోన్లలోకి రిమోట్ యాక్సెస్ టూల్/ట్రోజన్(ర్యాట్)ను ఎలా చొప్పించారు? అసలు ఆ మాల్‌వేర్‌ను

మిగతా 12వ పేజీలో...

ఫోన్ ట్యాపింగ్‌లో ఇరికించే కుట్ర

బీఆర్ఎస్ పార్టీని వీడే ప్రసక్తే లేదు

12

అవినీతిపరులే పోతున్నారు: ఎర్రబెల్లి



అరెస్టు అక్రమం

సుప్రీంలో విచారణ పెండింగులో ఉండగానే అరెస్టు చట్టవిరుద్ధం

కోర్టుకు ఇచ్చిన హామీని ఈడీ ఉల్లంఘించింది

ఆ సంస్థపై చర్యలు చేపట్టాలి

అరెస్టు ఉత్తర్వుల్లో చెప్పినవన్నీ అబద్ధాలే

మద్యం కేసులో ఒక్క ఆధారమూ వారి వద్ద లేదు

నా విడుదలకు ఆదేశాలు ఇవ్వండి

సుప్రీంకోర్టులో 537 పేజీలతో కవిత రిట్ పిటిషన్

గత ఏడాది వేసిన పిటిషన్ ఉపసంహరణ

తల్లిని, కుమారులను కలుసుకునేందుకు కవితకు ఢిల్లీ స్థానిక కోర్టు అనుమతి

మద్యం కేసు న్యాయమూర్తి నాగ్‌పాల్ బదిలీ

ఆయన స్థానంలో కావేరీ బవేజా నియామకం

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి తన అరెస్టు విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఏకపక్షంగా, నియంతృత్వంతో వ్యవహరించిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఆరోపించారు. సుప్రీంకోర్టులో తాను గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పెండింగ్‌లో ఉన్నప్పటికీ ఈడీ అధికారులు నిబంధలను ఉల్లంఘిస్తూ తనను అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఇలాంటి అనాగరిక, నిస్సహాయ పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఈ మేరకు కవిత మంగళవారం సుప్రీంకోర్టులో 537 పేజీలతో కూడిన రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఢిల్లీ మద్యం కేసులో వందలకోట్ల మేర అక్రమాలు జరిగాయని ఆరోపిస్తున్న ఈడీ.. ఇప్పటి వరకు ఒక్క ఆధారాన్ని కూడా చూపలేకపోయిందని పిటిషన్‌లో కవిత గుర్తు చేశారు. తన అరెస్టు ఉత్తర్వుల్లో పేర్కొన్న కారణాలన్నీ పూర్తి అసత్యాలేనన్నారు. ట్రయల్ కోర్టుకు సమర్పించిన రిమాండ్ అప్లికేషన్ కూడా తప్పుదోవ పట్టించేలా ఉందన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ప్రకారం సుప్రీంకోర్టు జారీ చేసే ఉత్తర్వులను అధికారులంతా పాటించాల్సి ఉంటుందని, కానీ తన విషయంలో ఈడీ అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించారని ఆరోపించారు. మనీలాండరింగ్ చట్టం-2002లోని సెక్షన్ 19(1) ప్రకారం ఈడీ అధికారులు ఒక వ్యక్తిని

మిగతా 13వ పేజీలో...

శ్రీనివాస్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు!



13

అధికారులను ఆదేశించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

టీజీవో పేరిట లీజుకు తీసుకున్న భవనం దుర్వినియోగం!

శ్రీనివాస్‌గౌడ్ స్వప్రయోజనాలకు వాడుకున్నట్లు ఆరోపణలు

ఎడ్యుకేషనల్ ట్రస్టు ముసుగులో ప్రైవేటు చానల్ నిర్వహణ

లీజు ఒప్పందం రద్దు చేస్తామంటూ హౌసింగ్ బోర్డు నోటీసులు

రద్దు కుదరదంటూ హౌసింగ్ బోర్డుకు మాజీ మంత్రి నోటీసులు

చక్రం తిప్పేది వీరే..!

- వచ్చే ఎన్నికల్లో దృష్టంతా 8మంది పైనే
- నిండైన ఆత్మవిశ్వాసంతో ప్రధాని మోదీ
- జోడో యాత్రల ఇమేజ్‌తో రాహుల్‌గాంధీ
- బీజేపీని గట్టిగా ఢీ కొడుతూ మమత..!
- ప్రతీకారం, పట్టుదలతో శరద్ పవార్
- తమిళనాడులో తగ్గేదే లేదంటూ స్టాలిన్
- బిహార్ బరిలో సత్తా చాటాలని తేజస్వీ
- పరిస్థితులకు ఎదురీదుతూ కేజ్రీవాల్
- యూపీలో పునర్ వైభవానికి అఖిలేశ్



2

కొందరేమో ప్రజలను కట్టిపడేసేలా అనర్గళంగా మాట్లాడే వక్తలు..! మరికొందరేమో తెరవెనుక కీలక వ్యూహకర్తలు..! ఇంకొందరేమో పట్టువదలని విక్రమార్కులు..! దేశం ఎదుర్కోనున్న అత్యంత కీలకమైన సార్వత్రిక ఎన్నికల్లో అందరి దృష్టి వీరిపైనే..! కొందరికి ఇవి చావోరేవో.. మరికొందరికి పరువు ప్రతిష్ఠ.. ఇంకొందరికి భవిష్యత్‌ను నిర్దేశించే పరీక్ష..! మిగతావారి మాట ఎలా ఉన్నా వచ్చే ఎన్నికలు ఓ ఎనిమిది మంది నేతల చుట్టూనే తిరుగుతాయనడంలో సందేహం లేదు. హ్యాట్రిక్ అంటూ ఉవ్విళ్లూరుతున్న ప్రధాని మోదీ.. జోడో యాత్రల జోష్ మీదున్న రాహుల్.. కమలానికి కంట్లో నలుసుగా మారిన కేజ్రీ.. బీజేపీకి అడ్డుగోడల్లా మారిన స్టాలిన్, మమత.. బిహారీ బాబు తేజస్వీయాదవ్ ముందున్న సవాళ్లు, అవకాశాలపై కథనం.



భిక్కనూరు రహదారిపై రైతుల రాస్తారోకో

వడగళ్ల నష్టం.. రోడ్డెక్కిన రైతన్న

12

కామారెడ్డి జిల్లా భిక్కనూరులో రాస్తారోకో

నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్

వర్షం ధాటికి పలుచోట్ల పంటనష్టం

రైతులు అప్రమత్తంగా ఉండాలి: తుమ్మల

ఎకరాకు 10వేలు పరిహారమివ్వాలి: హరీశ్

రాష్ట్రంలో 3 రోజులు తేలికపాటి వర్షాలు

మూడో అత్యంత కాలుష్య దేశంగా భారత్

రాజధానుల్లో ఢిల్లీకి మొదటి స్థానం

» దేశాల జాబితాలో మొదటి రెండు స్థానాల్లో బంగ్లాదేశ్, పాకిస్థాన్

న్యూఢిల్లీ, మార్చి 19: అత్యంత కాలుష్య పూరిత దేశాల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 134 దేశాల్లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 30 వేలకు పైగా గాలి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల నుంచి సేకరించిన గణాంకాల ఆధారంగా 2023 సంవత్సరానికి ప్రపంచ గాలి నాణ్యత నివేదికను మంగళవారం విడుదల చేశారు. స్విట్జర్లాండ్‌కు చెందిన ఐక్యూ ఎయిర్ సంస్థ ఈ నివేదికను రూపొందించింది. వార్షిక పీఎం 2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 79.9 మైక్రోగ్రాములతో బంగ్లాదేశ్ అత్యంత కాలుష్య భరిత దేశంగా మొదటి స్థానంలో నిలిచింది. 73.7 మైక్రోగ్రాములతో పాకిస్థాన్ రెండో స్థానంలో, 54.4 మైక్రోగ్రాములతో భారత్ మూడో స్థానంలో నిలిచాయి. 2022 సంవత్సరంలో వార్షిక పీఎం 2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 53.3 మైక్రోగ్రాములతో భారత్ అత్యంత కాలుష్య భరిత దేశాల జాబితాలో ఎనిమిదో స్థానంలో ఉంది. తాజా జాబితాలో ప్రపంచంలోనే అత్యంత కాలుష్య భరిత 50 నగరాలలో 42 భారతదేశంలోనే ఉండటం గమనార్హం. పీఎం2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 92.7 మైక్రోగ్రాములతో న్యూఢిల్లీ ప్రపంచంలోనే కాలుష్యపూరిత రాజధానుల్లో మొదటిస్థానంలో నిలిచింది. బిహార్‌లోని పారిశ్రామిక నగరం బెగుసరాయ్ పీఎం2.5 కాలుష్య గాఢత క్యూబిక్ మీటరుకు 118.9 మైక్రోగ్రాములతో ప్రపంచంలోనే అత్యంత కాలుష్యపూరిత నగరంగా మొదటి స్థానంలో నిలిచింది. 105.4 మైక్రోగ్రాములతో గువాహటీ రెండో స్థానం, 102.1 మైక్రోగ్రాములతో ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతం మూడో స్థానం, 100.4 మైక్రోగ్రాములతో పంజాబ్‌లోని




ముల్లాన్‌పూర్ నాలుగోస్థానం, 99.5 మైక్రోగ్రాములతో పాకిస్థాన్‌లోని లాహోర్ నగరం ఐదో స్థానం, 92.7 మైక్రోగ్రాములతో న్యూఢిల్లీ 6వ స్థానంలో నిలిచాయి. అలాగే, 88.6 మైక్రోగ్రాములతో గ్రేటర్ నోడియా 11వ స్థానం, 84 మైక్రోగ్రాములతో గురుగ్రామ్ 17వ స్థానంలో నిలిచాయి.

డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు.. 7 దేశాల్లోనే

ఆస్ట్రేలియా, ఫిన్లాండ్, ఐస్‌లాండ్, న్యూజిలాండ్, మారిషస్, ఎస్టోనియా, గ్రెనెడా దేశాలు వార్షిక పీఎం2.5 కాలుష్య గాఢత సగటు క్యూబిక్ మీటరుకు 5 మైక్రోగ్రాములు లేదా అంతకంటే తక్కువతో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని నివేదిక తెలిపింది. గాలి కాలుష్య సంక్షోభ తీవ్రతను ఈ నివేదిక తెలియజేస్తోందని గ్రీన్‌పీస్ ఇంటర్నేషనల్ సీనియర్ గాలి నాణ్యత శాస్త్రవేత్త ఐదాన్ ఫర్రో వ్యాఖ్యానించారు. భారతదేశంలో పట్టణీకరణ గాలి నాణ్యతకు ఎలా సవాలుగా మారాయో నివేదిక తేటతెల్లం చేస్తోందని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరోన్మెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనుమిత రాయ్ పేర్కొన్నారు.

లోకం తీరు



ఉష్ణోగ్రతలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.3	22.7
నిజామాబాద్	35.4	23.4
హైదరాబాద్	35.0	25.7
రామగుండం	34.4	23.4
సంగారెడ్డి	34.0	23.0

'శక్తి' నాశనం కోరేవారి వినాశనం తప్పదు

» వారి నాశనం తమిళనాడు నుంచే మొదలవ్వాలి: మోదీ



చెన్నై, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఇండియా కూటమి నేతలు హిందూ ధర్మాన్ని అదేపనిగా అగౌరవపరచడమే లక్ష్యంగా పెట్టుకున్నారని, హిందూమతానికి, ప్రత్యేకించి స్త్రీశక్తికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న ఆ కూటమికి నాశనం తప్పదని ప్రధాని మోదీ అన్నారు. సేలంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఎన్డీయే కూటమి ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. హిందూధర్మాన్ని అవమానిస్తున్న ఇండియా కూటమి నేతలను భారతీయులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించరన్నారు. తమిళ శైవమఠాధిపతుల ఆశీస్సులతో తమిళ సంస్కృతిని చాటే సెంగోల్‌ను కొత్త పార్లమెంట్‌లో ప్రతిష్ఠించడాన్ని వ్యతిరేకించారని, సెంగోల్‌ను ఇండియా కూటమి నేతలంతా అవమానించారని, ఈ దుష్టశక్తులను ఏప్రిల్ 19న జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లు ఓడిస్తారని హెచ్చరించారు. వారి నాశనం తమిళనాడు నుంచే ప్రారంభమవుతుందని చెప్పారు. హిందూ ధర్మంలో, హిందూ మతంలో శక్తి అనే పదానికి ఉన్నతమైన అర్థాలు ఉన్నాయని, అలాంటి శక్తి స్వరూపాన్నీ, సనాతన ధర్మాన్నీ నాశనం చేస్తామని ఇండియా కూటమి నేతలు చెబుతుండటం గర్హనీయమన్నారు. మంగళవారం కేరళలోని పాలక్కడ్‌లో బీజేపీ నిర్వహించిన భారీ రోడ్‌షోలోనూ మోదీ పాల్గొన్నారు.

ఎన్నికల వేళ విదేశీయులకు మోదీ వాట్సాప్ లేఖలు

డాటా బ్రీచ్ అన్న విదేశీయులు.. కోడ్ ఉల్లంఘన అన్న విపక్షాలు

న్యూఢిల్లీ, మార్చి 19: "ప్రియమైన నా కుటుంబ సభ్యులారా.." అంటూ ప్రధాని మోదీ పేరుతో యూఏఈలో నివసిస్తున్న పలువురు ప్రవాస భారతీయులతోపాటు.. పాకిస్థానీలు, బ్రిటన్ జాతీయులు, ఎమిరేట్స్ పౌరులకు వాట్సాప్ సందేశాలు అందాయి. భారతీయ మొబైల్ నంబర్ నుంచి 'వికసిత్ భారత్ సంపర్క్' పేరుతో వారికి ఆ సందేశాలు వెళ్లడం గమనార్హం. దీనిపై విదేశీయులు స్పందిస్తూ.. తమ డాటాను ఎవరో దొంగిలించారని, తమ మొబైల్ నంబర్లు బీజేపీకి ఎలా వెళ్లాయని ఆందోళన వ్యక్తం చేసినట్లు ఖలీజ్ టైమ్స్ వార్తా సంస్థ తెలిపింది. మోదీ ప్రభుత్వం.. పార్టీ ప్రచారం కోసం వ్యవస్థలను వాడుకుంటున్నారనడానికి ఈ ఘటన నిదర్శనమని కేరళ కాంగ్రెస్ ఆరోపించింది. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘననేనంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ప్రధాని మోదీ పేరుతో వారికి అందిన లేఖల్లో.. బీజేపీ సర్కారు పదేళ్ల పాలనలో 140 కోట్ల మంది భారతీయులకు కలిగిన లబ్ధిని గురించి వివరించినట్లు తెలిసింది. ఆ లేఖతో పాటు.. 'వికసిత్ భారత్ సంపర్క్'లో భాగంగా "మీ అమూల్యమైన సలహాలు, సూచనలు ఇవ్వగలరు" అని అభ్యర్థించినట్లు సమాచారం.

ఈడీ సమన్లపై హైకోర్టుకు కేజ్రీవాల్..

న్యూఢిల్లీ, మార్చి 19: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తనకు ఇస్తున్న సమన్లను సవాలు చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. ఎక్సయిజ్ విధానం కుంభకోణంలో మనీ లాండరింగ్ జరిగినందున ఈ నెల 21న విచారణ నిమిత్తం హాజరు కావాలంటూ ఈడీ ఆయనకు తొమ్మిదో సారి సమన్లు పంపించింది. ఈ సమన్లు రాజ్యాంగ వ్యతిరేకం, ఏకపక్షం అని పేర్కొంటూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఇది బుధవారం విచారణకు రానుంది.

24 గంటల్లోనే మళ్లీ బెంగాల్ డీజీపీ మార్పు

న్యూఢిల్లీ, మార్చి 19: పశ్చిమ బెంగాల్ డీజీపీని భారత ఎన్నికల సంఘం(ఈసీఐ) మరోమారు మార్చింది. మమతకు కుడిభుజంలా పనిచేస్తున్నారనే కారణంతో డీజీపీ రాజీవ్‌కుమార్‌పై సోమవారం ఈసీ వేటు వేసింది. రాష్ట్ర సీఎస్ ఇచ్చిన ముగ్గురు సీనియర్ అధికారుల జాబితా నుంచి వివేక్ సహాయ్‌ని ఎంపిక చేసి వెంటనే డీజీపీగా నియమించింది. అయితే.. మే నెలాఖరులో సహాయ్ రిటైర్ కానున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తికాకుండానే డీజీపీ రిటైర్ అవ్వడం ఇబ్బందికరంగా ఉంటుందని భావించిన ఈసీ.. సీనియర్ల జాబితాలో రెండో స్థానంలో ఉన్న సంజయ్‌ముఖర్జీని డీజీపీగా నియమించాలని మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

16 గంటల విరామంతో గుండెకు ముప్పు..!


» ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌తో గుండె జబ్బుల ప్రమాదం

న్యూఢిల్లీ, మార్చి 19: ఉపవాసం ఆరోగ్యానికి మంచిది. ఇటీవలి కాలంలో బరువు తగ్గడానికి చాలామంది ఉపవాసాన్ని ఎంచుకుంటున్నారు. ముఖ్యంగా ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్ పేరిట.. రాత్రి 8 గంటల నుంచి మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంటల వరకూ అంటే సుమారు 16 గంటల వరకూ ఎలాంటి ఆహారం తీసుకోవడం లేదు. మధ్యాహ్నం ఆహారం తీసుకున్న తర్వాత మళ్లీ 8 గంటల గ్యాప్‌తో రాత్రి 8 గంటలకు ఆహారం తీసుకుంటున్నారు. అయితే ఇలా ఇంటర్‌మిటెంట్ ఉపవాసం వలన గుండె జబ్బుల బారినపడి మరణించే ప్రమాదం 91 శాతం పెరుగుతుందని తాజా అధ్యయనంలో గుర్తించారు. చికాగోలో జరిగిన కార్యక్రమంలో అమెరికన్ హార్ట్ అసోసియేషన్ (ఏహెచ్‌ఏ) ఈ వివరాలను వెల్లడించింది. కాగా, ఈ అధ్యయన ఫలితాలను కొందరు వైద్యులు ప్రశ్నించారు. కేలరీల వినియోగాన్ని తగ్గించుకునే క్రమంలో నిర్దేశిత సమయాల్లోనే ఆహారం తీసుకోవడం ఇప్పుడు బాగా ప్రసిద్ధి చెందిందని ఆక్స్‌ఫోర్డ్ యూనివర్సిటీలోని హ్యూమన్ మెటబాలిజం ఎమెరిటస్ ప్రొఫెసర్ కీత్ ఫ్రాయిస్ తెలిపారు. ఈ అధ్యయన ఫలితాలు చాలా ప్రశ్నలకు సమాధానమివ్వలేదని, దీని ప్రభావంపై దీర్ఘకాలిక అధ్యయనాలు అవసరమని పేర్కొన్నారు.

పేద మహిళకు ఏడాదికి లక్ష

(మొదటి పేజీ తరువాయి)

రఘువీరా రెడ్డి, వంశీచంద్ రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. మ్యానిఫెస్టోపై సీడబ్ల్యూసీ కూలంకషంగా మూడు గంటలపాటు చర్చించింది. భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టిన రాహుల్‌ను అభినందిస్తూ తీర్మానం ఆమోదించింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. దేశం మార్పును కోరుకుంటోందని, 2004లో బీజేపీ ఇచ్చిన 'ఇండియా షైనింగ్' నినాదానికి పట్టిన గతే మోదీ గ్యారెంటీలకూ ఎదురవుతుందని విమర్శించారు. మ్యానిఫెస్టోకు వివిధ రాష్ట్రాల్లో విస్తృత ప్రచారం లభించేలా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, నిబద్ధతతో ప్రతి ఇంటికీ తీసుకువెళ్లాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో.. కాంగ్రెస్ హామీలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడానికి ప్రణాళిక సిద్ధం చేశామని జైరాం రమేశ్ అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ సర్వసన్నద్ధంగా ఉందని కేసీ వేణుగోపాల్ అన్నారు. ఇది మ్యానిఫెస్టో మాత్రమే కాదని, ప్రజలకు మంచి భవిష్యత్తును కల్పించేలా రూపొందించిన 'న్యాయ పత్రమ'ని అభివర్ణించారు. ఐదు న్యాయాలు, పాతిక గ్యారెంటీలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని చెప్పారు. 'ఘర్ ఘర్ గ్యారెంటీ' పేరిట ఇంటింటికీ హామీలను తీసుకెళ్లాలని సంకల్పించామని చెప్పారు. మ్యానిఫెస్టోకు తుది ఆమోదం ఇవ్వడమే కాకుండా దాని విడుదలకు తేదీని నిర్ణయించే అధికారాన్ని అధ్యక్షుడు ఖర్గేకు సీడబ్ల్యూసీ కట్టబెట్టింది. అంతేనా.. దేశవ్యాప్తంగా పాత పింఛను పథకం అమలుకు మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారని, రాజ్యాంగ సంస్థల స్వేచ్ఛను కాపాడడంతో పాటు వాటి దుర్వినియోగాన్ని అరికట్టడానికి చట్టాన్ని తీసుకు రావాలని కూడా మ్యానిఫెస్టోలో పేర్కొన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.



సీడబ్ల్యూసీ సమావేశంలో సోనియా, ఖర్గే, రాహుల్

హిస్సేదారి (సమానత్వ) న్యాయం

1. సామాజిక, ఆర్థిక కుల గణన.
1. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లపై ఉన్న 50% సీలింగ్ తొలగింపు.
1. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కోసం స్పెషల్ బడ్జెట్.
1. జల్ జంగల్ జమీన్‌పై చట్టబద్ధ హక్కులు.
1. గిరిజనులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను షెడ్యూల్డ్ ఏరియాగా గుర్తింపు.

నారీ (మహిళా) న్యాయం

1. 'మహాలక్ష్మి' పథకం కింద ప్రతి పేద కుటుంబంలోని ఒక మహిళకు ఏడాదికి లక్ష రూపాయలు.
1. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు.
1. ఆశ, అంగన్వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులకు డబుల్ శాలరీ కాంట్రిబ్యూషన్.
1. మహిళల హక్కుల రక్షణ కోసం ప్రతి గ్రామంలో 'అధికార మైత్రి' ఏర్పాటు.
1. వర్కింగ్ విమెన్ కోసం సావిత్రిబాయి పూలే పేరుతో హాస్టళ్ల సంఖ్య రెట్టింపు.

కిసాన్ (రైతు) న్యాయం



1. స్వామినాథన్ ఫార్ములా ప్రకారం పంటల మద్దతు ధరలకు చట్టబద్ధత.
1. శాశ్వత రుణమాఫీ కమిషన్ ఏర్పాటు.
1. పంట నష్టపోయిన 30 రోజుల్లో బీమా పరిహారం చెల్లింపు గ్యారెంటీ.
1. రైతులు లబ్ధి పొందేలా ఎగుమతి, దిగుమతి విధానం.
1. వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ మినహాయింపు.

శ్రామిక్ (కార్మికుల) న్యాయం



1. ఆరోగ్య హక్కు చట్టం అమలు. ఇందులో భాగంగా పరీక్షలు, మందులు, చికిత్సలు, శస్త్ర చికిత్సలు తదితరాలను పేర్కొంది.
1. రోజుకు 400 రూపాయల కనీస వేతనం- ఉపాధి హామీ పథకంలో సైతం.
1. పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకం అమలు
1. అసంఘటిత కార్మికులకు జీవిత, ప్రమాద బీమా
1. ప్రభుత్వంలో కాంట్రాక్టు ఉద్యోగాల నియామకాల నిలుపుదల.

యువ న్యాయం



1. 'భర్తీ భరోసా' పథకం కింద కేంద్ర ప్రభుత్వంలో 30 లక్షల ఉద్యోగాల భర్తీ
1. యువతకు ఏడాదిపాటు అప్రెంటిస్‌షిప్ పథకం. ఏడాదిపాటు నెలకు రూ.8,500 చొప్పున లక్ష రూపాయల చెల్లింపు.
1. పేపర్ లీకేజీలు అరికట్టేందుకు కఠినమైన చట్టం.
1. గిగ్ వర్కర్ల సామాజిక భద్రతకు చర్యలు.
1. స్టార్టప్‌ల ఏర్పాటుకు రూ.5000 కోట్ల నిధి కేటాయింపు.

ఎల్లుండి ముగియనున్న హెచ్-1బీ వీసాల రిజిస్ట్రేషన్ గడువు



వాషింగ్టన్, మార్చి 19: భారత ఐటీ నిపుణులు ఆసక్తిగా ఎదురు చూసే హెచ్-1బీ వీసాలపై అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్ (యూఎస్‌సీఐఎస్) కీలక ప్రకటన చేసింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన హెచ్-1బీ వీసాల కోసం ఇనిషియల్ రిజిస్ట్రేషన్ గడువు ఈ నెల 22తో ముగుస్తుందని సోమవారం ప్రకటించింది. ఆ రోజు ఈస్టర్న్ టైం ప్రకారం మధ్యాహ్నం 12 గంటల (భారత కాలమానం ప్రకారం రాత్రి 9.30 గంటలు)కు ముగుస్తుందని తెలిపింది. ఆలోగా ఆసక్తికలవారు తగిన ఫీజు చెల్లించి ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరింది. ఇందుకు సంబంధించిన ఫారం ఐ-129, ఫారం ఐ-907 కోసం కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. హెచ్-1బీ క్యాప్ పిటిషన్లపై ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. హెచ్-1బీ నాన్ క్యాప్ దరఖాస్తుల విషయమై తరువాత ప్రకటన వెలువరించనుంది.

ఫిరాయింపుదార్లదే నిజమైన పార్టీయా?

(మొదటి పేజీ తరువాయి)

పరిస్థితిని చూసి ఎన్నికల సంఘం పార్టీలోని వర్గాలకు గుర్తింపు ఇస్తోందంటే అది పదో షెడ్యూలు ప్రకారం పార్టీలో చీలికను గుర్తిస్తున్నట్టు కాదు. దీని ప్రకారమైతే ఫిరాయింపులను ప్రోత్సహించి పార్టీ గుర్తును సొంతం చేసుకోవచ్చు. అది ఓటర్లను అపహాస్యం చేసినట్టు కాదా?" అని జస్టిస్ విశ్వనాథన్ ప్రశ్నించారు. అజిత్ పవార్ ఆధ్వర్యంలోని వర్గాన్నే నిజమైన ఎన్‌సీపీగా ఎన్నికల కమిషన్ గుర్తించడాన్ని సవాలు చేస్తూ ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఎన్‌సీపీ ఎన్నికల గుర్తు అయిన 'అలారం క్లాక్'ను అజిత్ వర్గానికి కేటాయించడాన్ని కూడా ప్రశ్నించారు. ఆ గుర్తును స్తంభింపచేయాలని కోరారు. ఈ విషయంలో శరద్ పవార్ వర్గానికి కాస్త ఊరట ధర్మాసనం కలిగించింది. ప్రస్తుత పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ వర్గం నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ-శరద్‌చంద్ర పవార్ అన్న పేరు పెట్టుకోవచ్చంటూ అనుమతి ఇచ్చింది. 'బాకా ఊదుతున్న వ్యక్తి' అన్న చిహ్నాన్ని ఎన్నికల గుర్తుగా వాడుకోవచ్చని తెలిపింది. ఎన్నికల గుర్తు అయిన 'అలారం క్లాక్'ను అజిత్ పవార్ వర్గానికి కేటాయించినా కొన్ని షరతులు విధించింది. ఆ గుర్తు న్యాయస్థానం విచారణ పరిధిలో ఉందంటూ ఇంగ్లీషు, హిందీ, మరాఠీ పత్రికల్లో ప్రకటనలు ఇవ్వాలని అజిత్ పవార్ వర్గాన్ని ఆదేశించింది. ఎన్నికలకు సంబంధించిన అన్ని ఆడియో విజువల్ ప్రకటనలు, బ్యానర్లు, పోస్టర్లు, అన్నింటిలోనూ ఈ విషయాన్ని పేర్కొనాలని స్పష్టం చేసింది. శరద్ పవార్ వర్గం చేసిన అభ్యంతరాలపై 4 వారాల్లో సమాధానం ఇవ్వాలని సూచించింది.

సీఏఏ అమలుపై స్టే నిరాకరణ

237 పిటిషన్లపై సమాధానాలకు కేంద్రానికి 3 వారాల గడువు

» సుప్రీంకోర్టు నిర్ణయం

న్యూఢిల్లీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): పౌరసత్వ సవరణ చట్టా(సీఏఏ)న్ని అమలు చేయకుండా స్టే విధించాలన్న వినతిని మంగళవారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. సీఏఏను సవాలు చేస్తూ దాఖలైన 237 పిటిషన్లపై సమాధానాలు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి మూడు వారాల సమయం ఇచ్చింది. వీటన్నింటిపై ఏప్రిల్ 8వ తేదీలోగా అఫిడవిట్లను సమర్పించాలని ఆదేశించింది. ఆ తేదీలోగా ఎవరికీ పౌరసత్వం ఇవ్వకూడదని అభిప్రాయపడుతూ ఒకవేళ ఇస్తే తమను ఆశ్రయించవచ్చని పిటిషనర్లకు భరోసా ఇచ్చింది. తదుపరి విచారణను ఏప్రిల్ తొమ్మిదో తేదీకి వాయిదా వేసింది. సీఏఏను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారణ చేపట్టింది. కేరళకు చెందిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్(ఐయూఎంఎల్), స్వచ్ఛంద సంస్థ రిహాయ్ మంచ్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ, కాంగ్రెస్ నాయకుడు జైరాం రమేష్, తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మొహువా మొయిత్రా తదితరులు ఈ పిటిషన్లు దాఖలు చేశారు. సీఏఏ ముస్లింల పట్ల వివక్ష చూపిస్తోందంటూ వీరంతా దావాలు వేశారు. తొలుత కేంద్రప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ మొత్తం 237 పిటిషన్లకుగానూ ఇప్పటికే 20 మధ్యంతర అఫిడవిట్లు సమర్పించామని చెప్పారు. సవివరంగా అఫిడవిట్ ఇచ్చేందుకు నాలుగు వారాల సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు పిటిషనర్ల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, ఇందిరా జైసింగ్‌లు అభ్యంతరం చెప్పలేదు. కానీ సీఏఏ నిబంధనలు ముస్లింలకు వ్యతిరేకంగా ఉన్నందున వాటిని అమలు చేయకుండా స్టే ఇవ్వాలని కోరారు. సిబల్ వాదనలు వినిపిస్తూ సాధారణంగా చట్టాన్ని ఆమోదించిన తరువాత ఆరు నెలల్లోగా నిబంధనలను నోటిఫై చేయాల్సి ఉన్నా, సీఏఏ విషయంలో మాత్రం నాలుగేళ్ల తరువాత నోటిఫై చేశారని చెప్పారు. ఈ నిబంధనల మేరకు ఎవరికైనా పౌరసత్వం ఇస్తే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం కష్టమవుతుందని అన్నారు. అందువల్ల ఈ చట్టంపై తీర్పు వెలువడే వరకు నిబంధనలను అమలు చేయకూడదని కోరారు. 2019లోనే సీఏఏపై స్టే ఇవ్వాలని కోరగా, నిబంధనలు నోటిఫై చేయనందున ఆ అవసరం లేదని ధర్మాసనం చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. కేంద్రానికి 3వారాల గడువు ఇచ్చింది.



సుప్రీంకోర్టు ఆవరణలో ఐయూఎంఎల్ నేతలు

'పతంజలి'పై ఆగ్రహం

న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయనందుకు యోగా గురు బాబా రాందేవ్, పతంజలి ఆయుర్వేద సంస్థ ఎండీ ఆచార్య బాలకృష్ణలపై మంగళవారం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తదుపరి విచారణ జరిగే రోజున వారిరువురు వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కావాలని ఆదేశించింది. పతంజలి సంస్థ ఉత్పత్తులు, మందుల సామర్థ్యంపై ప్రకటనలు జారీ చేయకూడదంటూ ఇచ్చిన ఆదేశాలను అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది. దీన్ని కోర్టు ధిక్కరణ చర్యగా ఎందుకు పరిగణించకూడదో వివరణ ఇవ్వాలంటూ పంపిన షోకాజ్ నోటీసుకు కూడా స్పందించకపోవడాన్ని తప్పుపట్టింది. దీనిపై బుధవారమే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఈ కేసులో కేంద్రం వైఖరిని కూడా ధర్మాసనం తప్పుపట్టింది. తమ ఆదేశాలు అమలు కాకపోవడంపై 2 వారాల్లోగా అన్ని వివరాలతో అఫిడవిట్‌ను సమర్పించాలని ఆదేశించింది. ఇదే చివరి అవకాశమని హెచ్చరించింది.

చక్రం తిప్పేది వీరే!

లోక్‌సభ ఎన్నికల్లో చూపంతా వీరి వైపే



తనదైన ముద్ర వేయాలని: మద్దతుదారులకు ఓ అసాధారణ శక్తి అయితే.. వ్యతిరేకులకు కరుడుగట్టిన వర్గ విభజనవాది ప్రధాని మోదీ (74). హ్యాట్రిక్ కొట్టడమే కాదు.. సొంతంగానే 370 సీట్లు గెలుస్తాం.. మా కూటమికి 400 స్థానాలు ఖాయం అంటూ.. మూడో టర్మ్ తొలి వంద రోజు పాలనకు రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని చెబుతూ గెలుపుపై గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈసారి వెయ్యేళ్లు గుర్తుండేలా పాలన అందిస్తామని చెబుతున్నారు. మోదీ గ్యారెంటీలపై ప్రచారం జరిగేలా చూస్తూ, జాతీయవాదానికి ఆయనను బ్రాండ్ అంబాసిడర్‌లా చూపుతూ వికసిత్ భారత్ లక్ష్యాలను బీజేపీ ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అవకాశం ఉంది. బీజేపీనే కాదు.. యావత్ విపక్ష ప్రచారమూ మోదీ చుట్టూనే తిరుగుతుందనడంలో సందేహం లేదు.



గత ఓటమికి బదులు..: జాతీయ స్థాయిలో బీజేపీకి సవాల్ విసురుతున్న ఏకైక నాయకుడు రాహుల్ గాంధీ (53). కాంగ్రెస్ అగ్రనేత.. ఈసారి అత్యంత కఠినమైన పరీక్షను ఎదుర్కోనున్నారు. పార్టీ అధ్యక్షుడిగా ఉంటూ 2019 ఎన్నికల్లో మోదీ చేతిలో దారుణ ఓటమి గురయ్యారు. లోక్‌సభ సభ్యత్వంపై వేటు, మోదీ పేరును కించపరిచినందుకు కేసులు, బంగ్లాను ఖాళీ చేయాల్సి రావడం వ్యక్తిగతంగానూ రాహుల్‌ను ఇబ్బందిపెట్టాయి. వీటికి గట్టిగా బదులు తీర్చుకునే అవకాశం ఇప్పుడు దక్కింది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి, మణిపూర్ నుంచి ముంబైకి చేపట్టిన భారత్ జోడో యాత్రలతో ప్రజల్లోకి వెళ్లిన రాహుల్.. కాంగ్రెస్ విధానాలు, సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయడంలో సఫలీకృతమయ్యారు. న్యాయ్ గ్యారెంటీలకు తోడు రైతులు, మహిళలకు లబ్ధి చేకూర్చే హామీలతో ప్రజలను ఆకట్టుకున్నారు.



రగులుతున్న అగ్గి బరాటా: రాష్ట్రంలో నేరుగా, ఇండియా కూటమితో జాతీయంగా బీజేపీతో తలపడుతున్నారు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ (69). ఇండియా కూటమిలో కీలక పాత్ర పోషిస్తూనే.. కాంగ్రెస్‌కు సీట్లు ఇవ్వం పొమ్మని తేల్చిచెప్పారు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి. 42 ఎంపీ సీట్లకూ పోటీ చేస్తామని ప్రకటించారు. దీనివెనుక బీజేపీని ఓడించాలన్న ఆమె కసి స్పష్టంగా కనిపిస్తోంది. 2019లో బీజేపీ బెంగాల్‌లో 18 సీట్లు నెగ్గి మమతను కలవరపెట్టింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం ఈ ఫైర్‌బ్రాండ్ ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. ఇటీవల సందేశ్‌ఖాళీ ఉదంతంతో బీజేపీ మమత సర్కారును టార్గెట్ చేసింది. ఢీ అంటే ఢీ అని తలపడుతున్న ఈ రెండు పార్టీల మధ్య బెంగాల్ ఎన్నికలు హోరాహోరీగా సాగడం ఖాయం.



కేజ్రీ కథ ఎంతవరకో?: మద్యం విధానం కుంభకోణంలో ఈడీ వేటాడుతున్నా.. బీజేపీ, మోదీకి తలొంచడం లేదు ఆప్ అధినేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ (55). వచ్చే ఎన్నికల్లో ఈయన ప్రభావం స్పష్టంగా కనిపించనుంది. 2019లో ఒక్క సీటుకే పరిమితమైన ఆప్.. ఆ స్కోరును పంజాబ్ అండతో ఈసారి డబుల్ డిజిట్ దాటించే అవకాశం ఉంది. బోనస్‌గా ఢిల్లీలో కొన్ని స్థానాలు నెగ్గొచ్చు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్ ప్రభావం చూపినా.. ఎంపీ సీట్లు గెలుస్తుందో, లేదో చూడాలి. మద్యం స్కాంలో కేజ్రీని దిగ్బంధం చేస్తోంది కేంద్ర ప్రభుత్వం. ఎన్నికల నాటికి ఏం జరుగుతుందనేది ఆసక్తికరం.



బిహార్ తేజం: జేడీయూ నీతీశ్ చేతిలో మోసపోయిన బిహార్ యువ నేత, ఆర్జేడీ అధినేత తేజస్వీ యాదవ్ (34).. దానికి ప్రతీకారాన్ని తీర్చుకునే చాన్సు వచ్చింది. ప్రభావవంతమైన ముస్లిం-యాదవ్ (ఎంవై) సమీకరణంతో కాంగ్రెస్‌ను కలుపుకొని వెళ్తూ బీజేపీ-జేడీయూను తేజస్వీ ఢీకొట్టనున్నారు. 40 సీట్లున్న రాష్ట్రంలో ఇతర వర్గాలను ఆకట్టుకోలేకపోవడం ఆయన బలహీనత. అయోధ్య రామ మందిర నిర్మాణం బిహార్‌లోనూ ప్రభావం చూపుతున్న వేళ.. ఇండియా కూటమి కీలక నేతగా ఉన్న లాలూ కుమారుడికి సవాల్ ఎదురవనుంది.



అఖిలేశ్ ఏం చేస్తారో?: దిగ్గజ నాయకుడైన తండ్రి ములాయం సింగ్ లేకుండా తొలిసారి ఎన్నికలను ఎదుర్కొంటున్నారు యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ (50). లోక్‌సభ సీట్ల (80) పరంగా అతిపెద్ద రాష్ట్రమైన యూపీపై బీజేపీ చాలా పట్టుదలగా ఉంటుందనడంలో సందేహం లేదు. దీనికితోడు అయోధ్య రామ మందిర నిర్మాణం ఘనత ఉండనే ఉంది. అలాంటిచోట కాంగ్రెస్‌కు 17 సీట్లు ఇచ్చి, 63 సీట్లలో బరిలో దిగుతోంది సమాజ్‌వాదీ పార్టీ. తొలుత కాస్త బెట్టు చేసినా.. అఖిలేశ్ పరిస్థితులకు తగ్గట్లు సర్దుకుపోయారు. యూపీలోనూ ముస్లిం-యాదవ్ సమ్మేళనం కీలకం. అయితే, బిహార్‌లో తేజస్వీలాగే ఇతర వర్గాలను ఆకట్టుకోలేకపోవడం అఖిలేశ్‌కు ఇబ్బందికరం కానుంది. ఇప్పటికే రెండుసార్లు యోగి చేతిలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన జూనియర్ ములాయంకు మరోసారి పరాజయం ఎదురైతే ఇబ్బందులు తప్పవు.

పోయిన పవర్‌ను వెదుక్కొంటూ



మరాఠా యోధుడు శరద్ పవార్ 83 ఏళ్ల వయసులో ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఆయన స్థాపించిన ఎన్సీపీని అన్న కొడుకు అజిత్ పవార్ సొంతం చేసుకున్నారు. పెద్ద పవార్ ఎన్సీపీ (శరత్‌చంద్ర పవార్)లో కొద్దిమంది నేతలే మిగిలారు. అయినా, వెన్నుచూపకుండా పోరాడుతున్నారు. తనలాగే బీజేపీ కారణంగా పార్టీని కోల్పోయిన శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రేతో కలిసి మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడీ(ఎంవీఏ)ని నిలిపేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇండియా కూటమిలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. 48 సీట్లున్న మహారాష్ట్రలో ఎంవీఏ గెలుపు అసెంబ్లీ ఎన్నికలకు మలుపు.

తమిళనాడు అడ్డుగోడ డీఎంకే



దేశంలో అత్యంత ఆత్మవిశ్వాసంతో లోక్‌సభ ఎన్నికలకు వెళ్తున్న ఏకైక నాయకుడు డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్ (71) అని చెప్పొచ్చు. వీరి ప్రధాన విపక్షం ఏఐఏడీఎంకే చూపంతా వచ్చే అసెంబ్లీ ఎన్నికలపైనే ఉంది. బీజేపీ తమిళనాట తీవ్రంగా ప్రయత్నిస్తున్నా.. మోదీ, షా పలుసార్లు పర్యటించినా కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ప్రభావం ఉందని తెలుస్తోంది. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీతో బంధాన్ని కొనసాగిస్తూ తమిళనాడులో బీజేపీని నిరోధిస్తున్నారు స్టాలిన్. 39 సీట్లున్న రాష్ట్రంలో గత ఎన్నికల్లో డీఎంకే కూటమి 38 గెలుచుకుంది. 'ఇండియా'కు ఓ విధంగా స్టాలిన్ పెద్ద అండ.

ప్రధాన జవాబుపత్రం, ఓఎంఆర్ షీట్ ఇవ్వకుండానే పరీక్ష

» పదో తరగతి తెలుగు పరీక్షలో ఓ ఇన్విజిలేటర్ నిర్లక్ష్యం

» ఆందోళనలో 22మంది విద్యార్థులు

కొత్తగూడెం కలెక్టరేట్ మార్చి 19: తొలిరోజు పదో తరగతి తెలుగు పరీక్షకు హాజరైన విద్యార్థులకు ఓ ఇన్విజిలేటర్ ప్రధాన జవాబుపత్రం, ఓఎంఆర్ షీట్ ఇవ్వకుండా కేవలం అదనపు జవాబు పత్రాలు ఇచ్చి పరీక్ష రాయించాడు. విషయం తెలిసిన బాధిత విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కేటీపీఎస్ జడ్పీఎస్ఎస్(కోడ్‌నెం 9021)లో సోమవారం ఈ ఘటన జరగగా మంగళవారం హిందీ పరీక్ష సందర్భంగా ఈ విషయం బయటపడింది. పరీక్ష కేంద్రంలోని 9వ నెంబర్ గదిలో మొదటి పరీక్ష(తెలుగు)కు 22 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిసారి వార్షిక పరీక్షలు రాస్తుండడంతో సరైన అవగాహన లేక విద్యార్థులు ఇన్విజిలేటర్ ఇచ్చిన జవాబు పత్రాలను తీసుకుని పరీక్ష రాశారు. అయితే మంగళవారం హిందీ పరీక్షకు వెళ్లిన ఆ రూంలోని విద్యార్థులకు ఇన్విజిలేటర్ ప్రధాన జవాబుపత్రం, ఓఎంఆర్ షీటు ఇచ్చారు. దీంతో విస్మయం చెందిన విద్యార్థులు తమకు తొలి పరీక్ష రోజు ఇలాంటి జవాబుపత్రాలు ఇవ్వలేదని చెప్పడంతో అసలు విషయం బయటపడింది. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ నిర్లక్ష్యం, ఇన్విజిలేటర్ అవగాహనరాహిత్యంతో ఈ ఘటన జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కాగా, విషయం తమ దృష్టికి వచ్చిందని, విద్యార్థులకు ఎలాంటి నష్టం జరగద ని, భద్రాద్రి కొత్తగూడెం డీఈవో వెంకటేశ్వరచారి తెలిపారు. విధి నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం, అవగాహనరాహిత్యంపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు.

పరీక్షా కేంద్రంలో కూలిన పైకప్పు

» విద్యార్థిని, ఇన్విజిలేటర్‌కు స్వల్ప గాయాలు

జైనథ్, మార్చి 19: పదో తరగతి పరీక్షా కేంద్రంలో పైకప్పు కూలి విద్యార్థినితో పాటు ఇన్విజిలేటర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గిమ్మా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగింది. స్థానికులు, గ్రామస్థుల కథనం ప్రకారం... గిమ్మా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం హిందీ పరీక్ష జరిగింది. విద్యార్థులు పరీక్ష రాస్తున్న క్రమంలో మధ్యాహ్నం 12.20 గంటలకు పైకప్పు కూలి పెంకులు కిందపడ్డాయి. పరీక్ష రాస్తున్న విద్యార్థిని అక్షయ, విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్ కె.పురుషోత్తం తలపై పెంకులు పడడంతో స్వల్పంగా గాయాలయ్యాయి. వారిని వెంటనే గిమ్మా పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. ఇద్దరు కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్

నలుగురు మావోయిస్టుల మృతి.. వారిలో ఇద్దరు ఏరియా కార్యదర్శులు, ఇద్దరు ప్లాటూన్ సభ్యులు

» నక్సల్స్‌పై రూ.36 లక్షల రివార్డు

» ఛత్తీస్‌గఢ్‌లో మరో ఎన్‌కౌంటర్

» ఇద్దరు నక్సల్స్ మృతి

ఆసిఫాబాద్, మంచిర్యాల, మహదేవపూర్ (జయశంకర్ భూపాలపల్లి జిల్లా), దుమ్ముగూడెం, మార్చి 19: మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో ఆరుగురు మావోయిస్టులు మరణించారు. వీరిలో ఆ పార్టీకి చెందిన కీలక నేతలతోపాటు ఒక మహిళా నక్సల్ కూడా ఉన్నారు. మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా అటవీప్రాంతంలో మావోయిస్టులు సమావేశమయ్యారన్న సమాచారంతో ఆ రాష్ట్రానికి చెందిన పోలీసులు గ్రేహౌండ్స్ బలగాలతో కలిసి కూంబింగ్ నిర్వహించారు. రేపనపల్లి సమీపంలోని కొలమార్క గుట్టల్లో మంగళవారం తెల్లవారుజామున వారికి మావోయిస్టు లు తారసపడ్డారు. ఇరుపక్షాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. మృతులను మావోయిస్టు పార్టీ మంగి-ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శి, కుమురం భీం మంచిర్యాల డివిజనల్ కమిటీ సభ్యుడు వర్గీస్ (28), సిర్పూర్-చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి, ఛత్తీస్‌గఢ్‌లోని బైరాన్‌గఢ్ జిల్లా కొత్రాంకు చెందిన జిల్లా కమిటీ సభ్యుడు పాండు అలియాస్ మంగ్తు (32), ప్లాటూన్ మెంబర్లు కురుసంగి రాజు, కుడిమేత వెంకటేష్‌లుగా పోలీసులు గుర్తించారు. ఈ నలుగురిపై మహారాష్ట్రలో రూ.36 లక్షల రివార్డు ఉంది. వర్గీస్ ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన వ్యక్తి. ఎన్‌కౌంటర్ జరిగిన స్థలం నుంచి ఒక ఏకే 47, రెండు కార్బైన్స్, రెండు దేశీయ పిస్టల్స్, విప్లవ సాహిత్యం, వంట సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురు మావోయిస్టుల మృతదేహాలను పోలీసులు మహారాష్ట్రలోని గడ్చిరోలి ఆసుపత్రికి తరలించారు. కాగా, ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి కొందరు మావోయిస్టులు తప్పించుకు వెళ్లి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. దీంతో సరిహద్దుల్లో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లుచేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ వెల్లడించిన వివరాల ప్రకారం.. కిరండుల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంపూర్ అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసు బలగాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో జరిగిన కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. వారిలో ఒకరు మహిళ. ఘటన స్థలం నుంచి ఒక తుపాకీ, మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నక్సల్స్ మృతదేహాలను దంతెవాడకు తరలించారు. మృతిచెందిన మావోయిస్టుల వివరాలు తెలియాల్సి ఉందని ఎస్పీ తెలిపారు.

లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించండి: మావోయిస్టు జగన్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం పార్టీ తెలంగాణ కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరుతో మీడియాకు ఒక ప్రకటన విడుదలయింది. సార్వత్రిక ఎన్నికల్లో తమ గెలుపుకోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మోసగించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాయని జగన్ ఆరోపించారు. 2019 సార్వత్రిక ఎన్నికల ముందు పుల్వామా ఘటన సృష్టించిన బీజేపీ, ఈ ఎన్నికల ముందు రామమందిర నిర్మాణం, సీఏఏను అమల్లోకి తెచ్చిందని ఆరోపించారు. దేశంలో మొదటగా ప్రపంచీకరణకు పునాదులు వేసింది కాంగ్రెస్ పార్టీయేనని, మరోసారి ప్రజలను దగా చేయడానికి అధికారంకోసం ఆరాటపడుతోందని జగన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

పాఠశాల విద్యపై పట్టింపేదీ?

» ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకే ఎంఈవోలుగానూ బాధ్యతలు

» రాష్ట్రంలో 615 మండలాలకు 17 మందే రెగ్యులర్ ఎంఈవోలు

» భద్రాద్రి జిల్లాలో 5 మండలాలకు ఒక్కరే ఎంఈవో

కొత్తగూడెం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల పర్యవేక్షణకు రెగ్యులర్ ఎంఈవోలు లేకపోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. విద్యా ప్రమాణాలు దిగజారిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 615 మండలాలుండగా అంతే సంఖ్యలో ఎంఈవోలు పనిచేయాల్సి ఉంది. కానీ మంజూరైన పోస్టులు 488 మాత్రమే. వారిలో ప్రస్తుతం కేవలం 17 మంది మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు పనిచేస్తున్నారు. మిగిలిన 471 మంది అదనపు బాధ్యతలతో విధులు నిర్వహిస్తున్నారు. పరిపాలన సౌలభ్యం కోసం గత పాలకులు ఒక్కో మండలాన్ని విడదీసి నాలుగు మండలాలుగా చేశారు. కానీ మండలానికో విద్యాధికారి నియామకాన్ని విస్మరించారు. ఒక్కో ఎంఈవోకు 4 నుంచి 8 మండలాల బాధ్యతలు అప్పగించారు. వారు కూడా పూర్తిస్థాయి ఎంఈవోలు కాదు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకే ఆ బాధ్యతలు అప్పగించారు. దీంతో వారు అటు పాఠశాలల పర్యవేక్షణ చేయలేక, ఇటు విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందించలేక పనిభారంతో సతమతమవుతున్నారు. ఫలితంగా పాఠశాలలపై పూర్తిస్థాయి అజమాయిషీ లేక మండల విద్యాశాఖ కార్యాలయాల్లో షాడో ఎంఈవోలు ప్రత్యక్షమై అవినీతి జరుగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

23 మండలాలకు 10 మంది ఎంఈవోలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 23 మండలాలు ఉన్నాయి. 23 మంది ఎంఈవోలు పనిచేయాల్సి ఉంది. కేవలం 10 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నవారే. ఇదే పరిస్థితి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో నెలకొంది. మండలాల విభజనలో భాగంగా కొత్తగూడెం మండలాన్ని విడదీసి 4 మండలాలుగా విభజించారు. వీటికి తోడు చర్ల మండలాన్ని కలిపి బి.జుంక్కీలాల్‌కి ఎంఈవోగా బాధ్యతలు ఇచ్చారు. ఆయన ఆ మండలాలకు ఎంఈవోగా విధులు నిర్వహిస్తూ తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు న్యాయం చేయలేకపోతున్నారు. అశ్వాపురం, కరకగూడెం, మణుగూరు, పినపాక మండలాలకు ఒకరు, భద్రాచలం, బూర్గంపాడు, దుమ్ముగూడెం మండలాలకు ఒకరే ఎంఈవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలపై పర్యవేక్షణ నేతి బీరకాయ చందంగా మారింది.

ప్రేమలో ఉందని కూతురుకు ఉరేసి చంపిన తల్లి

» రంగారెడ్డి జిల్లా దండుమైలారంలో ఘటన



భార్గవి(ఫైల్)

ఇబ్రహీంపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కూతురు ఓ అబ్బాయిని ప్రేమించి, అతనితోనే పెళ్లికి సిద్ధపడిందని కన్న తల్లే చీరతో ఉరేసి చంపేసింది. రంగారెడ్డి జిల్లాలోని దండుమైలారంలో సోమవారం ఈ ఘటన జరిగింది. దండుమైలారం గ్రామానికి చెందిన మోటె జంగమ్మ, అయిలయ్యల కూతురు భార్గవి(19) అదే గ్రామానికి చెందిన శేషు ప్రేమలో ఉన్నారు. ఇది నచ్చని భార్గవి తల్లిదండ్రులు ఆమెకు మరో పెళ్లి సంబంధం చూస్తున్నారు. సోమవారం ఉదయం జంగమ్మ పొలం పనికి వెళ్లగా.. అయిలయ్య కర్మన్‌ఘాట్‌లో తాను పనిచేసే రైస్ మిల్లుకు వెళ్లాడు. ఈ సమయంలో భార్గవి వాళ్ల ఇంటికి శేషు వచ్చాడు. అప్పుడే పొలం నుంచి వచ్చిన జంగమ్మ ఇద్దరిని మందలించింది. శేషు అక్కడ నుంచి వెళ్లిపోయాక జంగమ్మ భార్గవిపై ఆగ్రహంతో ఊగిపోయింది. కోపంలో భార్గవి మెడకు చీర చుట్టి ఉరేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భార్గవి సోదరుడు చరణ్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రాణాంతక రసాయనాలతో సాస్ తయారీ

» ఇద్దరి అరెస్ట్.. 773 లీటర్ల బాటిళ్లు స్వాధీనం

శంషాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ప్రాణాంతక రసాయనాలతో నకిలీ సాస్ తయారు చేస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 773 లీటర్ల సాస్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మునిసిపల్ కేంద్రంలోని సింప్లెక్స్ చౌరస్తా సమీపంలో నకిలీ సాస్ తయారు చేస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం పోలీసులు ఓ గోదాంపై దాడి చేశారు. సాస్ బకెట్లను సీజ్ చేసి విచారణ నిమిత్తం ఆర్జీఐఏ పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

బాండ్ బకాయి నిధులు విడుదల చేయాలి

» ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డిమాండ్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): టీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు 2013 పీఆర్‌సీకి సంబంధించి 50 శాతం బాండ్‌ల డబ్బులు తక్షణం చెల్లించాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు బకాయి పడిన 50 శాతం బాండ్‌ల డబ్బు చెల్లించేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.281 కోట్లు విడుదల చేసినట్టు ప్రకటించిందని ఆయన పేర్కొన్నారు. మార్చి 11 నుంచి బాండ్ బకాయిల చెల్లింపులు చేపడతామని ఆర్టీసీ యాజమాన్యం సైతం స్పష్టం చేసినట్టు రాజిరెడ్డి వివరించారు. 2013 పీఆర్‌సీకి సంబంధించి 50 శాతం బాండ్‌లకు 5 ఏళ్లలో 8.75 శాతం వడ్డీతో చెల్లిస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించినట్టు పేర్కొన్నారు. బాండ్‌ల చెల్లింపులకు 2020 సెప్టెంబరునాటికి గడువు ముగిసినట్టు తెలిపారు. గడువు ముగిసిన బాండ్‌లపై ఎలాంటి వడ్డీ లేకపోవడంతో ఉద్యోగులు రూ.88 కోట్ల మేరకు నష్టపోతున్నట్టు ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వర్‌రావు మరో ప్రకటనలో పేర్కొన్నారు. బాండ్ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేసినా అందుకు అనుగుణంగా చర్యలు ప్రారంభించకపోవడంపై ఉద్యోగుల్లో అయోమయం నెలకొందన్నారు. రెండు రోజుల్లోగా బాండ్‌ల డబ్బులు చెల్లించని పక్షంలో ఆర్టీసీ కార్మికులంతా ఉద్యమానికి సిద్ధంగా ఉండాలని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి పిలుపునిచ్చారు.

బాబు బెయిల్ రద్దు పిటిషన్‌పై సుప్రీం విచారణ ఏప్రిల్ 16కి వాయిదా

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంజూరుచేసిన బెయిల్‌ను రద్దు చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ వాయిదా పడింది. ఈ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. హోలీ సెలవుల తర్వాత దీనిపై విచారణ జరుపుతామని తెలిపింది. తదుపరి విచారణను ఏప్రిల్ 16కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

క్షమాభిక్ష ఓకే... విమాన టికెట్ ఎలా?

» కువైత్‌లోని రాయలసీమ వాసులకు కొత్త కష్టాలు

» సాయం కోసం 20 వేల మంది ఎదురుచూపులు

» రాజకీయ పార్టీలు సహకారం అందిస్తాయన్న ఆశ

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి: కువైత్‌లో వీసా నిబంధనలు ఉల్లంఘించి ఉంటున్న విదేశీయులకు ఆ దేశం క్షమాభిక్ష ప్రసాదించినా స్వదేశానికి వచ్చేందుకు అవసరమైన సహకారం అందని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కువైత్ ప్రభుత్వం కల్పించిన మినహాయింపుతో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతానికి చెందిన దాదాపు 20 వేల మంది వరకూ స్వదేశం చేరే మార్గం కోసం అన్వేషిస్తున్నారు. తమకు ఎవరైనా ఆపన్న హస్తం అందిస్తారా.. అని ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే అన్నమయ్య జిల్లా సుండుపల్లి మండలానికి చెందిన కురపల్లి అంజలీ అనే మహిళ గత మూడు రోజులుగా కువైత్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరుగుతుంది. తనకు సాయం చేయాలని ఆమె కోరుతోంది. స్వదేశం వెళ్లేందుకు ఆమె చేస్తున్న ప్రయత్నాలకు సహకరించేవారే కరవయ్యారు. ఉద్యోగం క్రమబద్ధీకరణ చేసుకోవడానికి అవసరమైన ప్రభుత్వ ఫీజు చెల్లించడానికి అనేక మంది తెలుగు ప్రవాసీయులు అనాసక్తి ప్రదర్శిస్తున్నారు. ఈ తరుణంలో వారంతా స్వదేశానికి వచ్చేందుకు యత్నాలు సాగిస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నికల సమయం కావడంతో ప్రధాన రాజకీయ పార్టీలు తమపట్ల సానుభూతితో వ్యవహరించి విమాన టిక్కెట్లకు అవసరమైన ఆర్థిక సాయం చేస్తాయేమోనని వారంతా ఎదురుచూస్తున్నారు. ఆర్టికల్ 20 వీసా కలిగిన పేదలకు ప్రభుత్వమే ఉచిత విమానయానం కల్పించి వారిని ఇళ్లకు చేర్చాలని టీడీపీ నాయకుడు కోడూరి వెంకట్ విజ్ఞప్తి చేస్తున్నారు. 2018లో క్షమాభిక్ష ప్రకటించినప్పుడు కూడా రాయలసీమకు చెందిన అనేక మంది దరఖాస్తులు చేసుకున్నా పాస్ పోర్టులు పొందిన తర్వాత స్వదేశానికి తిరిగి వెళ్ళడంలో విఫలమయ్యారని అధికారులు పేర్కొంటున్నారు.



మౌనికకు ఆర్థిక సాయం అందిస్తున్న కాంగ్రెస్ నేతలు

మంత్రిని కదిలించిన కన్నీటి 'పరీక్ష'

» పదో తరగతి విద్యార్థిని కుటుంబానికి.. రూ.లక్ష సాయం అందించిన కోమటిరెడ్డి

తిరుమలగిరి రూరల్, మార్చి 19: తండ్రిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా.. పదో తరగతి పరీక్షలు రాస్తున్న నిరుపేద విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అండగా నిలిచారు. తన వంతు సాయంగా రూ.లక్ష అందజేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం గుండెపురి గ్రామానికి చెందిన పాలకుర్తి వెంకన్నగౌడ్(41) ఆదివారం తాటిచెట్టు పై నుంచి పడి మృతి చెందాడు. అదే రోజు అంత్యక్రియలు పూర్తయ్యాయి. పదో తరగతి చదువుతున్న అతడి కూతురు మౌనిక తండ్రి చనిపోయిన బాధను దిగమింగుకుని సోమవారం పరీక్ష రాసింది. దీనిపై 'కన్నీటి పరీక్ష' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం కథనం వచ్చింది. మౌనికది నిరుపేద కుటుంబం కావడంతో స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన వెంటనే రూ.లక్ష ఆర్థిక సహాయం పంపారు. మంత్రి అందజేసిన చెక్కును కాంగ్రెస్ నాయకులు వెంకన్నగౌడ్ ఇంటికి వెళ్లి అందజేశారు.




పరీక్షకు హాజరైన రాము, లక్ష్మణ్, జ్యోతి, ధనుశ్ రెడ్డి

కన్నవారి మరణ బాధను దిగమింగి టెన్త్ పరీక్షకు

మహబూబ్‌నగర్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో ఘటనలు

పెగడపల్లి/ దేవరకద్ర/ డిచ్‌పల్లి, మార్చి 19: విధి పెట్టిన పరీక్షను ధైర్యంగా ఎదుర్కొన్నారు ఆ విద్యార్థులు. తమ కన్నవారు మృతి చెందినా ఆ బాధను దిగమింగి పదో తరగతి పరీక్షకు హాజరయ్యారు. అనంతరం తమ వారి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్, జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో మంగళవారం జరిగిన ఈ ఘటనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని బతికెపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కవల పిల్లలైన గాజె రాము, లక్ష్మణ్ పదో తరగతి చదువుతున్నారు. వీరి తండ్రి చంద్రయ్య (50) ఈ నెల 15న పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. తండ్రి మరణ బాధను దిగమింగిన ఆ అన్నదమ్ములు మంగళవారం జరిగిన పరీక్షకు హాజరయ్యారు. అనంతరం తండ్రి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్రలో నివాసం ఉండే కుర్వ అంజమ్మ సోమవారం సాయంత్రం గుండెపోటుతో మరణించింది. దీంతో పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న ఆమె కూతురు జ్యోతి ఆ దుఃఖంలోనే మంగళవారం పది పరీక్షకు హాజరైంది. మధ్యాహ్నం ఇంటికి వచ్చి తల్లి అంత్యక్రియల్లో పాల్గొంది. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం కేశాపూర్‌కు చెందిన గడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి (49)సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. తండ్రి మరణ బాధను దిగమింగి అతని కుమారుడు ధనుశ్‌రెడ్డి మంగళవారం పరీక్ష రాశాడు.

అప్పుల బాధతో ఇద్దరు రైతుల ఆత్మహత్య



సుధాకర్(ఫైల్)

వేలేరు(ధర్మసాగర్), తలమడుగు, మార్చి 19 : అప్పుల బాధతో ఆదిలాబాద్, హనుమకొండ జిల్లాల్లో ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామానికి చెందిన పిట్ల సుధాకర్(43) వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రూ. 10 లక్షల అప్పులు చేసి బావిలో సైడ్ బోర్లు వేయించడంతో పాటు కుమార్తె వివాహం చేశాడు. వ్యవసాయంతో చేసిన అప్పులు తీర్చాలనుకున్నా పంటకు సాగునీరు లేక దిగుబడి రాలేదు. దీంతో మనస్తాపం చెంది సోమవారం రాత్రి వెళ్లిన సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం బరంపూర్ గ్రామానికి చెందిన కాకెర్ల ఆశన్న(43) అనే రైతు ఏడాది కాలంగా ఏ పంట వేసినా దిగుబడి రాక పంట నష్టం వాటిల్లింది. దీంతో వ్యవసాయానికి చేసిన అప్పులు అధికం కావడంతో మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

నేడు హైదరాబాద్‌కు ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

3రోజుల పాటు వివిధ విభాగాల అధికారులతో భేటీ

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల వైఫల్యాల పరిశీలనకు ఏర్పాటైన జె. చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యులతో కూడిన ఎన్‌డీఎస్‌ఏ కమిటీ బుధవారం హైదరాబాద్ రానుంది. కమిటీ మూడురోజుల పాటు ఇక్కడే ఉండి వివిధ విభాగాల అధికారులతో భేటీ కానుంది. 20, 21 తేదీల్లో జలసౌధలో అధికారులతో సమావేశం కానుంది. 22న రాజేంద్రనగర్‌లోని తెలంగాణ ఇంజనీరింగ్ రిసెర్చ్ ల్యాబొరేటరీ (టీఎస్‌ఈఆర్‌ఎల్)ను సందర్శించి బ్యారేజీల నమూనాలను పరిశీలించి అదే రోజు రాత్రి ఢిల్లీ బయలుదేరి వెళ్లనుంది. బ్యారేజీ నిర్మాణంలో పాల్గొన్న అధికారులతో పాటు నిర్మాణ సంస్థల ప్రతినిధులతో కమిటీ సమావేశం కానుంది. ప్లానింగ్ నుంచి డీపీఆర్‌ల తయారీ, హైడ్రాలజీ, ఇన్వెస్టిగేషన్స్‌తో పాటు డిజైన్లను ఆమోదించిన సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీఓ) అధికారులను కలవనుంది. అలాగే నిర్మాణంలో పాల్గొన్న అధికారులు, క్వాలిటీ కంట్రోల్‌తో పాటు ఇన్‌స్పెక్షన్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ అధికారులతో కమిటీ భేటీ కానుంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికల వేసవి!

సార్వత్రిక ఎన్నికలకూ, నాలుగురాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడంతో రాబోయే వేసవికి ఎన్నికలవేడి కూడా తోడవుతోంది. అత్యాధునిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లు, ఆధునిక సౌకర్యాలు అందివచ్చినప్పటికీ, దేశ తొలిసార్వత్రిక ఎన్నికల తరువాత మళ్ళీ అంతటి సుదీర్ఘ ఎన్నికల ప్రక్రియలో దాదాపు 97కోట్ల మంది ఓటర్లు పాల్గొనబోతున్నారు. ఈ ప్రక్రియ నలభైనాలుగురోజులకు విస్తరించడం వెనుక పాలకపక్షం ప్రయోజనాల పరిరక్షణ ఉన్నదన్న విమర్శలూ వింటున్నాం. ఇక, ఎన్నికలతో ముడిపడిన మరో రెండు కీలక పరిణామాలు చోటుచేసుకున్నప్పుడే ఈ షెడ్యూల్ కూడా విడుదలైంది. ఒకపక్క, ఎన్నికల బాండ్లలో రహస్యాన్ని విప్పే లక్ష్యంతో సుప్రీంకోర్టు అదేపనిగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంటపడుతోంది. మరోవైపు, మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని కమిటీ 2029నుంచి జమిలికి పోవాల్సిందేనంటూ వందలపేజీల నివేదికను రాష్ట్రపతికి సమర్పించింది.

ఎన్నికల కమిషన్ నిష్పాక్షికతను, నిబద్ధతను అంచనావేసే, అనుమానించే కాలం ఇది. సుప్రీంకోర్టు స్ఫూర్తికి పూర్తిభిన్నం గా ఎన్నికల కమిషనర్లను ఎంపికచేసే కమిటీనుంచి ప్రధాన న్యాయమూర్తిని తొలగించి, కేంద్రప్రభుత్వం ఆ స్థానంలో హోంమంత్రిని చేర్చుకొని, ప్రతిపక్షనాయకుడి మాట చెల్లుబాటు కాకుండా జాగ్రత్తపడింది. ఇక, పాలకులు గతంలో ఏరికోరి నియమించుకున్న అరుణ్‌గోయల్ ఇప్పుడు హఠాత్తుగా ఎందుకు రాజీనామా చేశారన్నది ఓ బ్రహ్మరహస్యం. ప్రధాన ఎన్నికల కమిషనర్ తప్ప మిగతా రెండుస్థానాలు ఖాళీ కావడంతో, ఆ పోస్టుల భర్తీ జరిగిపోయింది, తన మార్గదర్శకాలకు భిన్నంగా జరిగిన ఆ నియామకాలను నిలువరించడానికి సర్వోన్నత న్యాయస్థానం కూడా ఉత్సాహపడలేదు. ఆ ఇద్దరు కమిషనర్ల నియామకం తీరును ప్రతిపక్ష నాయకుడు అధిర్ రంజన్ 'రిగ్గింగ్'తో పోల్చిన విషయం తెలిసిందే. ఎన్నికల షెడ్యూల్‌ను నెలలతరబడి సాగదీయడం వెనుక బీజేపీకి ప్రయోజనం కలిగించే ఉద్దేశం ఈసీకి ఉన్నదన్న విమర్శలు కొత్తవేమీ కావు. పశ్చిమబెంగాల్‌లో ఏడు దశల్లో ఎన్నికలు ఉండేలా షెడ్యూల్ రూపొందడం వెనుక ఏ అంశాలు పనిచేశాయో తెలియదు. ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా వ్యవహరించడంతో పాటు, ప్రజలకు ఆ మేరకు నమ్మకాన్ని కలిగించాలి. హద్దులుదాటినవారు ఎంతటివారైనా విడిచిపెట్టకుండా, ఎన్నికలు సజావుగా జరిగేట్టు చూడాలి.

అంత తొందర ఎందుకో తెలియదు కానీ, ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు కొద్దిరోజుల ముందు మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్ నేతృత్వంలోని కమిటీ జమిలి ఎన్నికలను బలంగా సమర్థిస్తూ నివేదికను సమర్పించింది. పదేళ్ళుగా పాలకులు కలగంటున్న 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'ను ఆచరణ సాధ్యం చేయడానికి వీలుగా నివేదిక రూపొందింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను ఒకేమారు నిర్వహించడం, మరో వందరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తిచేయడం, ఒకే ఓటర్లజాబితా, ఒకే ఐడెంటిటీ కార్డు ఇత్యాదివి అనేకం అందులో ఉన్నాయి. జమిలి ఎన్నికలతో కాలమూ ఖర్చూ కలిసొస్తాయని బీజేపీ ఎప్పటినుంచో అంటోంది. గత ఎన్నికల మానిఫెస్టోలో దానిని తన ఎజెండాగా ప్రకటించింది. 47 రాజకీయపక్షాలు తమ అభిప్రాయాన్ని తెలియచేశాయని, వాటిలో 32 పార్టీలు జమిలికి అనుకూలంగా ఉన్నాయని కోవింద్ అంటున్నారు. ఏకాభిప్రాయంతోనే జమిలిని సుసాధ్యం చేస్తానని బీజేపీ హామీ ఇస్తున్నది కానీ, ఈ మారు అధికారంలోకి వస్తే ఏ విధంగానైనా దానిని ఆచరణలోకి తెస్తుందన్నది నిర్వివాదాంశం. ఏ ఎన్నికల విధానం ద్వారా ప్రజల ఆకాంక్షలకు, మనోభావాలకు ప్రాధాన్యం దక్కుతుందో దానిని ఆచరించడం ముఖ్యం కానీ, ఆర్థికమో, సౌలభ్యమో ప్రాతిపదికలు కాకూడదు. పార్లమెంటు ఎన్నికల్లోనూ, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రజలు వేర్వేరు అంశాల ఆధారంగా ఓటుచేస్తారు. జమిలి వల్ల రాష్ట్ర స్థానిక అంశాలు వెనక్కుపోయి జాతీయ ప్రాధాన్యాల ఆధారంగా ఓటింగ్ జరుగుతుందన్నది వాస్తవం. గత రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఢిల్లీలోని అన్ని స్థానాలనూ బీజేపీ గెలుచుకుంటే, ఆ మరుసటి ఏడాదిలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీపార్టీ అద్భుతమైన విజయాలు సాధించిన విషయం తెలిసిందే. జమిలిలో జాతీయ అంశాలు కీలకమై, ప్రాంతీయపార్టీలకు నష్టం జరుగుతుంది కనుక, బీజేపీ ఈ విధానాన్ని రుద్దుతున్నదని విపక్షాలు అంటున్నాయి. మందబలంతో రాజ్యాంగసవరణలు చేసి, జమిలిని బలవంతంగా తేవడం కాక, సమాఖ్యస్ఫూర్తికి భిన్నమైన ఈ విధానంపై ముందుగా లోతైన చర్చలు జరగాలి.

ధార్మిక అంశాలను అధ్యాత్మిక దృక్పథంతో మాత్రమే చూడాలి కానీ అందులో రాజకీయ దృష్టి ఉండకూడదు. దేవుడి పేరిట ఓట్లు అడిగే రాజకీయం ఆ వైఖరితోనే ఆరంభమవుతుంది. కాషాయం లేదా ఖర్జూరం అందుకు మినహాయింపు కాదు.

రాజకీయ ఇఫ్తార్ విందులు

గల్ఫ్ లేఖ

ధార్మిక సంప్రదాయాలను భక్తి శ్రద్ధలతో పాటించడం ఏ మతానికి సంబంధించిన వారికైనా ఒక వ్యక్తిగత వ్యవహారం. ఆ ఆచారాలను నిష్ఠగా, వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా ఆచరించాలి. అయితే అందుకు భిన్నంగా మత విశ్వాసాల పేర రాజకీయ కోణంతో ఏ రకమైన సందడి చేసినా ఆ ధార్మిక కార్యం అపవిత్రమవుతుంది.

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష ఇస్లాంలోని ఐదు మౌలిక సూత్రాలలో ఒకటి. ఉపవాస దీక్ష (రోజా లేదా సోం) విరమించే సూర్యాస్తమయ సందర్భం అత్యంత కీలకమైంది. రంజాన్ మాసంలో ఇస్లాం మత విశ్వాసులు ప్రతి రోజూ సూర్యోదయం కంటే ముందు నుంచి ఆహారం, నీళ్ళు లేకుండా దినమంతా పాటించిన దీక్షను సూర్యాస్తమయ సమయంలో ముగిస్తూ తాను చేసిన పాపాలకు ప్రాయశ్చితంగా అల్లాహ్‌ను క్షమాపణ కోరుకోవడం (దీనినే మఘ్ఫిరత్ అని అంటారు) ఇఫ్తార్‌లోని కీలక ఘట్టం. ఇది పూర్తిగా వ్యక్తిగత, ధార్మిక వ్యవహారం. ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజాలు రంజాన్ పర్వదినాలను రంగరంగ వైభవంగా జరుపుకోవడం పరిపాటి. అయితే ఇఫ్తార్ సందర్భాన్ని మాత్రం పూర్తిగా అధ్యాత్మిక చింతనతో కుటుంబ సభ్యుల మధ్య భక్తితత్పరతతో జరుపుకోవడం ఆనవాయితీ. దురదృష్టవశాత్తు భారతావనిలో ఇఫ్తార్ అనేది రాజకీయ ప్రయోజనాలకు ఒక వేడుకగా మారిపోయింది. ఇస్లాం పేర రాజకీయ పబ్బం గడుపుకొనే అన్ని స్థాయిల ముస్లింల నాయకులకు తోడుగా రాజకీయ పక్షాలు కూడ ఇందులో పాలు పంచుకోవడం వల్ల ఇఫ్తార్ ఉద్దేశ్యం దారి తప్పుతోంది.

ఢిల్లీలో రంజాన్ మాసంలో ఇఫ్తార్ అనేది రాజకీయవేత్తలు తప్పకుండా పాల్గొనే ఒక విందు భేటీ. ఈ విందుకు తేదిలను ఎంపిక చేసుకోవడం ప్రముఖ నాయకులకు చాలా కష్టంగా ఉండేది. పార్లమెంటులో అనుసరించవల్సిన వ్యూహాలను కూడ ఒకప్పుడు రాజకీయ పార్టీల ప్రముఖులు ఇఫ్తార్ విందుల సందర్భంగా కలుసుకుని, నిర్ణయించుకునేవారు. ఆ విందులు సాధారణంగా రాజకీయ సయోధ్యకు దోహదం చేసేవి. తెలుగు రాష్ట్రాలలో అటు కర్ణాటక సరిహద్దులో ఆంధ్రప్రదేశ్‌లోని పుంగనూరు మొదలు ఇటు తెలంగాణలో మహారాష్ట్ర సరిహద్దులో సిర్పూర్ వరకు ఇప్పటికీ ఇఫ్తార్ విందు ఏర్పాటు ఒక రాజకీయ అనివార్యతగా ఉన్నది. హైదరాబాద్‌లో ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా, జూబ్లీ హాల్ లేదా యల్.బి. స్టేడియంలో ప్రభుత్వమే ఇఫ్తార్ విందులు ఇవ్వడం ఒక ఆనవాయితీగా వస్తోంది. అధికారంలో ఉన్న నాయకులు రావడం, నెత్తిన టోపీ ధరించి, ఖర్జూరపు పళ్ళు తినడం లేదా భాయి సాబ్ నాయకులకు తినిపించడం ఒక సంస్కృతిగా మారిపోయింది. ఈ రకమైన ప్రచార ఆర్భాటాలకు ముస్లిం ధార్మికవేత్తలు అయిన హాఫెజ్, ఆలీం, ఇమాంలు గతంలో దూరంగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఈ మతాచార్యులు కూడా ఈ ఇఫ్తార్ విందులలో పాల్గొంటున్నారు.



ఇఫ్తార్ విందులో అధికార పక్షానికి చెందిన ఒక రాజకీయ నాయకుడు వచ్చి టోపీ ధరిస్తే ముస్లిం వర్గాలు సంతోషిస్తున్నాయి. అయితే ఒక ముస్లిం నాయకుడు ఎవరైనా దేవాలయానికి వెళ్ళి వేదపండితుల దీవెనలు తీసుకోవడాన్ని ముస్లిం వర్గాలు, ముఖ్యంగా రాజకీయ శ్రేణులు హర్షించలేకపోతున్నాయి. తెలంగాణలో హైదరాబాద్ నగరం బయట ముస్లిం ఓటర్లు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం నిజామాబాద్ అర్బన్. ఇటీవలి శాసనసభ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మొహమ్మద్ అలీ షబ్బీర్, సామాజిక వర్గాల గణంకాల ప్రకారం సునాయాసంగా గెలిచి తీరాలి. అయితే ఆయన 14 వేల ఓట్ల తేడాతో బిజెపి అభ్యర్థి చేతిలో ఓడిపోయారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఒక ఆలయాన్ని సందర్శించిన షబ్బీర్ అలీ వేద పండితుల నుండి ఆశీర్వాదాలు తీసుకోవడాన్ని చూపిస్తున్న ఒక ఫోటోను ఆయన రాజకీయ ప్రత్యర్థులు విస్తృతంగా ప్రచారం చేసారు. షబ్బీర్ అలీ ఓటమికి ప్రధాన కారణాలలో ఆ ఫోటో ప్రచారం ఒకటి. ఇఫ్తార్ పార్టీ విందుకు టోపీ ధరించి వచ్చే హిందూ రాజకీయ నాయకులను చూసి అమితంగా సంతోషించేవారు, షబ్బీర్ అలీ ఒక హిందూ దేవాలయాన్ని సందర్శించడాన్ని సంకుచిత ధోరణితో చూడడం ఎంత వరకు సమంజసం?

రంజాన్ మాసం పూర్తయిన కొద్ది కాలానికి వచ్చేది హజ్ మాసం. నాంపల్లిలోని హజ్ హౌస్ నుండి సౌదీ అరేబియాలోని మక్కాకు వచ్చే యాత్రికుల సేవల నెపంతో నాయకుల ఫోటోల సందడి జుగుప్సాకరంగా ఉంటుంది. మోతాదుకు మించి ప్రభుత్వ జోక్యం, నాయకుల ప్రచారం మంచిది కాదు. ధార్మిక అంశాలను అధ్యాత్మిక దృక్పథంతో మాత్రమే చూడాలి కానీ అందులో రాజకీయ దృష్టి ఉండకూడదు. దేవుడి పేరిట ఓట్లు అడిగే రాజకీయం ఆ వైఖరితోనే ఆరంభమవుతుంది. కాషాయం లేదా ఖర్జూరం అందుకు మినహాయింపు కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్
(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఈసీ మాటలు నీటిపై రాతలేనా?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్


'మేము ఎన్నికల్లో ధన ప్రవాహాన్ని అనుమతించం..' అని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ గత వారం విజ్ఞాన్ భవన్‌లో ఎన్నికల షెడ్యూలును ప్రకటిస్తూ అన్నారు. కండబలం, ధన బలం, తప్పుడు సమాచారం, ఎన్నికల కోడ్ ఉల్లంఘన.. ఈ నాలు గింటినీ సహించే ప్రసక్తి లేదు అని ఆయన చెప్పారు. ఈ ప్రకటన విన్నవారికి సీఈసీ ఎంతో నిజాయితీగా మాట్లాడుతున్నట్లు అనిపిస్తుంది. కాని గత ఎన్నికల షెడ్యూలు ప్రకటించినప్పుడు కూడా ఎన్నికల కమిషనర్లు ఇదే విధమైన ప్రకటనలు చేశారు. ఈ దేశంలో అధికారులు కూడా బూటకపు ప్రకటనలు చేసే విషయంలో రాజకీయ నాయకులకు ఏ మాత్రం తీసిపోరని గత కొన్ని సంవత్సరాలుగా దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను బట్టి అర్థమవుతోంది. దాదాపు ఏడు దశలుగా షెడ్యూలు ప్రకటించిన నాటి నుంచి దాదాపు 75 రోజుల్లో ఏఏ చీకటి గుహల్లోంచి డబ్బులు బయటకు వస్తాయో ఎవరు కనిపెట్టగలరు? ఇక షెడ్యూలు ప్రకటించకముందు నిర్వహించిన భారీ బహిరంగ సభలు, ర్యాలీలు, రోడ్ షోలకు ఎక్కడి నుంచి డబ్బు ప్రవహిస్తోందో ఎవరైనా లెక్కవేసేవారున్నారా?

తెలంగాణలో గత ఎన్నికల్లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ చాలా మంది అభ్యర్థులకు చివరి దశలో నిధులు పంపించలేదని, అందుకే వారు ఓడిపోయారని భారత రాష్ట్ర సమితి నేతలే పలువురు చెప్పారు. బహుశా అప్పటికే తాము ఎంత ఖర్చు పెట్టినా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటు వేయాలని నిర్ణయించుకుని ఉంటారని కేసీఆర్‌కు సమాచారం అందడంతో ఆయన ఎందుకైనా మంచిదని డబ్బులు పంపించకూడదని నిర్ణయించుకుని ఉంటారని వారు చెబుతున్నారు. ఇదే కేసీఆర్ అంతకుముందు మునుగోడులో జరిగిన ఉప ఎన్నికల్లో భారీ ఎత్తున డబ్బులు ఖర్చు పెట్టారని, తమ పార్టీ నేతలే అన్నమాట ప్రకారం డబ్బు ఖర్చు పెట్టలేదని బీజేపీ నేతలు వాపోయారు. ఈ డబ్బుల ఖర్చు విషయంపై ఇద్దరు మాజీ ఎంపీల మధ్య వచ్చిన తగాదా చివరకు ఎలా చల్లారిందో కాని వారిద్దరూ ఇప్పుడు మరో అధికార పార్టీలో చేరారు. నిజానికి 2022 ఎన్నికల్లో ఢిల్లీ మద్యం కుంభకోణం డబ్బును ఆమ్ ఆద్మీ పార్టీ హవాలా మార్గం ద్వారా గోవాకు మళ్లించినట్లు ఆధారాలు దొరికినందువల్లే తీగలాగితే డొంకకదిలినట్లు మొత్తం వ్యవహారం బయటపడిందని ఈడీ తన ఛార్జిషీటులో పేర్కొంది.

ఈ దేశంలో రాజకీయ పార్టీలు ఒకదానికొకటి సహాయపడేందుకు ఎన్నికల నిధులు మళ్లిస్తే గతంలో ఎవరూ పట్టించుకునేవారు కాదు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ నిధుల మళ్లింపుపై నిఘా పెట్టింది. సమాజ్‌వాది పార్టీ, జనతాదళ్ (యు), జనతాదళ్ (ఎస్), తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల నేతలకు ఎవరెవరు నిధులు పంపారో బీజేపీకి తెలిసినందువల్లనే పంపిన వారిని తమ చెప్పుచేతల్లో ఉంచుకోవడం బీజేపీకి సాధ్యపడిందని చెప్పక తప్పదు. దీని వల్ల భవిష్యత్ రాజకీయ సమీకరణల్ని కూడా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభావితం చేయగలిగారు. తమ పార్టీకోసమే కాకుండా ఇతర రాష్ట్రాల్లో రాజకీయ పార్టీల కోసం కూడా డబ్బులు విచ్చలవిడిగా ఖర్చు పెట్టాలని నేతలు భావిస్తున్నారంటే ఈ దేశంలో రాజకీయాల్లో ఎంత డబ్బు సమకూరుతుందో అర్థమవుతుంది. కేసీఆర్ తన పార్టీ పేరునే మార్చుకుని ఇతర రాష్ట్రాలకు విస్తరించేందుకు ప్రయత్నించడం, భారీ ఎత్తున దేశంలో వందలాది పత్రికలకు సైతం ప్రకటనలు గుప్పించడం, జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌కు సైతం నిధులు ఇవ్వచూపినట్లు ప్రచారం జరగడం, ఉప ఎన్నికల్లో సైతం కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో ఈ దేశంలో ఒక ప్రాంతీయ పార్టీ ధన బలం జాతీయ స్థాయిలో చర్చనీయాంశమయింది. 2014 ఎన్నికలకు ముందు అవినీతికి వ్యతిరేకంగా వేదికను ఏర్పాటు చేసి, అన్నా హజారేతో కలిసి యూపీఏకు వ్యతిరేకంగా ధర్నాలు చేసి ప్రాచుర్యంలోకి వచ్చిన ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఎన్నికల కోసం భారీ ఎత్తున నిధులు సేకరించకపోతే ఇవాళ ఆత్మరక్షణలో పడి ఉండేది కాదు. ఈ పార్టీలే కాదు, దేశంలో ఉన్న మెజారిటీ ప్రాంతీయ పార్టీల అధినేతలు అవినీతి ఆరోపణలు, ఆదాయానికి మించి ఆస్తుల కేసుల్ని ఎదుర్కొన్నవారే. భారతీయ జనతా పార్టీ ఈ బలహీనతల ఆధారంగా తన సామ్రాజ్యాన్ని నిర్మించుకుంది. పోనీ అలా అని ఆ పార్టీ ఎన్నికల వ్యవస్థను ఏమైనా ప్రక్షాళనం చేయగలిగిందా అంటే అదీ లేదు. అన్ని సామ, దాన, భేద, దండోపాయాలను ఉపయోగించుకుని రాజకీయ నిధుల సమీకరణలో బీజేపీ అన్ని పార్టీలను తలదన్నిందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెల్లడించిన ఎన్నికల బాండ్ల వివరాలను బట్టి తెలుస్తోంది. అయితే ఎన్నికల బాండ్ల ద్వారా సమీకరించిన మొత్తం ఎన్నో రెట్లు ఎక్కువ మొత్తంలో ధన ప్రవాహం జరుగుతోందని అన్ని రాజకీయ పార్టీలకు తెలుసు. 'When Crime Pays: Money and Muscle in Indian Politics' అని వాషింగ్టన్‌లో కార్నెగీ ఎండోవ్‌మెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్‌లో సీనియర్ ఫెలోగా ఉన్న మిలన్ వైష్ణవ్ రాసిన పుస్తకంలో రాజకీయాల్లోకి రాకముందే జగన్మోహన్ రెడ్డి ఆస్తులు ఎలా పెరిగాయో వివరించారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పుడు కేవలం రూ. 9లక్షల మేరకే ఆస్తులు ఉన్న జగన్ నికర ఆస్తుల విలువ 2014 నాటికి రూ. 400 కోట్లకు పైగా దాటిందని ఆయన తెలిపారు. భారీ ఎత్తున సంపాదించి ఉండకపోతే కాంగ్రెస్ పార్టీనే ఎదిరించి ఒక రాజకీయ పార్టీ పెట్టగల ధైర్యం ఆయనకుండేది కాదేమో. ఇక అధికారంలోకి వచ్చిన తర్వాత గత అయిదు సంవత్సరాల్లో జగన్ ఎంత మేరకు సమీకరించారో, ఈ ఎన్నికల్లో ఎంత ధనం ప్రవహిస్తుందో ఊహించాల్సిందే.

జగన్‌కు, కానీ, కేసీఆర్‌కు కానీ, బీజేపీ, కాంగ్రెస్ వంటి ఇతర పార్టీల నేతలకు కానీ నిధులు సమకూర్చేందుకు కార్పొరేట్ సంస్థలు ఎన్నికల బాండ్ల రూపంలోనే కాకుండా దొడ్డిదారిన కూడా ముట్టజెబుతున్నాయి మైనింగ్, ఇరిగేషన్ ప్రాజెక్టులు, రియల్ ఎస్టేట్, మద్యం, ఇసుక, గేమింగ్, ఫార్మా, టెలికమ్యూనికేషన్, కాంట్రాక్ట్, ప్రైవేట్ విద్యాసంస్థలు, మాదక ద్రవ్యాలు మొదలైన అనేక రంగాల నుంచి రాజకీయ పార్టీలకు డబ్బులు చేరుతున్నాయి.

2016 నవంబర్ 8న ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ దేశంలో నల్లధనాన్ని రూపుమాపేందుకు పెద్ద నోట్ల రద్దును ప్రకటించిన తర్వాత ఎన్నికల రాజకీయాల్లో నల్లధనం పాత్ర పెరిగిందే కాని తగ్గిన దాఖలాలు లేవు. అసలు ఎన్నికల్లో ఎన్ని వేల కోట్ల ఖర్చవుతున్నదో చెప్పేందుకు కొలమానాలు లేవు. ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ప్రకారం 2019 ఎన్నికల్లో తమిళనాడులో రూ. 900 కోట్లు పట్టుబడగా, ఆ తర్వాత గుజరాత్‌లో రూ. 552 కోట్లకు పైగా స్వాధీనపరుచుకున్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు రూ. 3500 కోట్ల మేరకు దొరికాయి. ఈ లెక్కల్ని చూపి తాము ధన బలాన్ని అరికట్టామని ఎన్నికల కమిషన్ చెప్పుకోవడం హాస్యాస్పదమే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో దాదాపు రూ. 60వేల కోట్లు ఖర్చు చేశారని సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ జరిపిన ఒక అధ్యయనంలో తేలింది. ఇందులో 45 శాతం బీజేపీయే ఖర్చు పెట్టిందని ఈ సంస్థ తెలిపింది. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి రూ. 100 కోట్లు ఖర్చు పెట్టారని, ప్రతి ఓటరుకు ఓటుకు కనీసం రూ. 700 చెల్లించారని ఈ సంస్థ అంచనా వేసింది. కాని నిజానికి ఈ అంచనా కూడా తక్కువే. కొన్ని నియోజకవర్గాల్లో ఓటర్‌కు కనీసం రూ.5వేలు చెల్లించిన సందర్భాలు కూడా ప్రజల అనుభవంలో ఉన్నాయి ఈ నేపథ్యంలో ప్రతి లోక్‌సభా నియోజకవర్గానికీ అభ్యర్థికి రూ. 95 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలన్న పరిమితి విధించామని సీఈసీ రాజీవ్ కుమార్ చెబుతుంటే ఎవరికైనా నవ్వు రాకమానదు. కార్పొరేటర్ ఎన్నికకు కూడా ఇంతకంటే ఎక్కువే ఖర్చవుతుందని చాలా మందికి తెలుసు.



ప్రతి లోక్‌సభా నియోజకవర్గానికీ అభ్యర్థికి రూ. 95 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టాలన్న పరిమితి విధించామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ చెబుతుంటే ఎవరికైనా నవ్వు రాకమానదు. ఒక కార్పొరేటర్ ఎన్నికకు కూడా ఇంతకంటే ఎక్కువే ఖర్చవుతుందని చాలా మందికి తెలుసు. ధనబలం సంగతి పక్కనపెడితే కండబలం, తప్పుడు సమాచారం,ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై ఎన్నికల కమిషన్ తాను ప్రకటించినట్లుగా చర్యలు చేపడుతుందా?

ధనబలం సంగతి పక్కనపెడితే కండబలం, తప్పుడు సమాచారం, ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై కూడా ఎన్నికల కమిషన్ తాను ప్రకటించినట్లుగా చర్యలు తీసుకుంటుందని కూడా నమ్మడానికి వీలు లేదు. ఈ దేశంలో నేతలపై ఉన్న కేసులను చూస్తుంటే నేర చరితులకూ, రాజకీయ నాయకులకూ మధ్య విభజన రేఖ చెరిగిపోతోందని మిలన్ వైష్ణవ్ అన్నారు. కేవలం డబ్బు మాత్రమే కాదు, 2014 ఎన్నికల్లో 5వేల కిలోల మాదక ద్రవ్యాలను ఎన్నికల కమిషన్ అధికారులే స్వాధీనపరుచుకున్నారు. కనీసం ఏడు భారీ స్విమ్మింగ్ పూల్స్‌లో నింపగల మద్యం పట్టుబడిందని అధికారులు తెలిపారు. దాదాపు 40శాతం మంది నేరచరితులు రాజకీయాల్లో ప్రవేశిస్తున్నారు.

ఇక ఎన్నికల ప్రచారంలో నేతలు అత్యధికంగా తప్పుడు ప్రచారం చేయడంతోనే కాలక్షేపం చేస్తారని, ఊకదంపుడు ఉపన్యాసాలతో మభ్యపెడతారని ఎవరి ప్రసంగాలు విన్నా అర్థమవుతోంది. ఇక సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ న్యూస్ గురించి చెప్పనక్కర్లేదు. వాటన్నింటినీ పరిశీలించి వెనువెంటనే చర్య తీసుకోగల సామర్థ్యం కమిషన్‌కు లేదు. విద్వేష ప్రసంగాల విషయంలో కూడా ఎన్నికల కమిషన్ చేయగలిగింది ఏమీ లేదు. పార్లమెంట్‌లో విద్వేష ప్రసంగాలు చేసిన వారికే తిరిగి టిక్కెట్లు ఇస్తున్నారు. మత, కుల ప్రాతిపదికగా ప్రచారాన్ని పూర్తిగా అరికట్టడం, ముఖ్యంగా అధికార పార్టీ నేతల నోళ్లకు తాళం వేయడం కూడా ఎన్నికల కమిషన్‌కు సాధ్యం కాదని ఎన్నో ఉదంతాలను ఉదహరించవచ్చు.

నిజానికి ఎన్నికలు స్వేచ్ఛగా సజావుగా, జరగాలంటే ప్రభుత్వానికి ఎన్నికల సంస్కరణలను చిత్తశుద్ధితో అమలు చేయగల నిజాయితీ ఉండాలి. లా కమిషన్‌తో పాటు ఎన్నో కమిటీలు సూచించిన సంస్కరణలను బుట్టదాఖలు చేశారు. జమిలి ఎన్నికలు అమలు చేసే ముందు ఎన్నికల సంస్కరణలను అమలు చేసినప్పుడే ఈ దేశంలో నిజమైన మార్పును ప్రభుత్వం కోరుతున్నట్లు భావించగలం.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

రాజకీయ సీతాకోక చిలకలున్నాయి జాగ్రత్త!

ఎన్నికల వేళ, ఒక పార్టీనించీ ఇంకో పార్టీకి మారడాలు (ఫిరాయింపులు) మొదలవుతాయి. నిన్నటిదాకా, ఒకర్ని ఒకరు చాలా సున్నిత పదాలతో (లుచ్చా, లఫంగ్, సన్నాసీ, బట్టేబాజ్ వగైరా) విమర్శించుకున్నవారే, స్నేహాలింగనాలు చేసుకుంటారు. ఇలాంటి వాటిని చూసి ఎవరైనా ఆశ్చర్యపోతే, మన రాజకీయ నాయకులు చెప్పే మాటలు: 'రాజకీయాల్లో శాశ్వత మిత్రులూ, శాశ్వత శత్రువులూ అంటూ వుండరు! 'రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చు!' అని. ఆ మాట నిజమే. కాకపోతే, 'బూర్జువా రాజకీయాలలో...' అనే మాట చేర్చితే కరెక్టుగా వుంటుంది. 'బూర్జువా రాజకీయ పార్టీలకేనా ఈ లక్షణాలున్నాయి? కమ్యూనిస్టు పార్టీలు పెట్టుకునే పొత్తుల సంగతేమిటి?' – అనే ప్రశ్న ఎవరికైనా వస్తే, అది సిద్ధాంత అమాయకత్వం అవుతుంది. శ్రామిక జనాలకు వర్గ చైతన్యం నేర్పవలిసిన వారు, ఆ పనికి తిలోదకాలిచ్చి, ఎప్పుడైతే ఓట్ల రాజకీయాల్లోకి దిగారో, అప్పట్నించీ కమ్యూనిస్టుపార్టీలు కూడా, అటు కేంద్రంలోగానీ, ఇటు రాష్ట్రాల్లోగానీ, ఏదో ఒక బూర్జువా పార్టీతో పొత్తులు పెట్టుకుంటున్నారు.

పార్టీ ఫిరాయింపులకు పాల్పడే వారు చెప్పే కారణాలు రకరకాలు: 'నా నియోజకవర్గ ప్రజల కోసం', 'రాష్ట్ర ప్రయోజనాల కోసం', 'దేశ శ్రేయస్సు కోసం', 'నాకు అక్కడ తగిన గుర్తింపు లేదు, గౌరవం లేదు', 'ఈ పార్టీ వారి భావజాలం నచ్చింది', 'ఆ పార్టీకి భవిష్యత్తు లేదు, మునిగిపోయే నావ అది', '...గారి నాయకత్వం దేశానికి అవసరం' – ఇలా చాలా కారణాలు చెపుతారు.

ఎన్నికల సమయానికి ఎక్కువ బలం వున్న పార్టీలోకి గెంతేవారిని రాజకీయ సీతాకోక చిలకలు అంటారు. ప్రకృతిలోని కీటకాలైన సీతాకోక చిలకలు ఎక్కడ, ఏ పువ్వులో తేనె దొరికితే అక్కడ వాలి, ఆ తేనెని జుర్రుకుంటాయో, అలాగే సమాజంలోని రాజకీయ నాయకులు కూడా ఆ సమయానికి ఏ పార్టీకి ఎక్కువ అధికార బలం వుంటే అక్కడకి ఫిరాయించుతారు– అని అర్థం.



ఇలా ఫిరాయించిన వారిని, పరమ అవినీతిపరులని నిన్నటిదాకా అన్న వాళ్ళే, తమ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తారు. అవినీతి ఆరోపణలూ, కేసులూ అన్నీ క్షణాల్లో మటుమాయం! అందుకే, 'ఆ పార్టీ వాషింగ్ మెషీన్ వంటిది' అనీ, 'ఆ పార్టీ పవిత్ర గంగానది వంటిది' అనీ పోలికలు వచ్చాయి. ఎన్నికల సమయానికి ఎక్కువ బలం వున్న పార్టీలోకి గెంతేవారిని రాజకీయ సీతాకోక చిలకలు అంటారు. 'రాజకీయ సీతాకోక చిలకలు' ('పొలిటికల్ బటర్‌ఫ్లైస్') అనే మాట రాజకీయ రంగంలో ఫిలిప్పైన్స్ దేశంలో వాడతారు. ప్రకృతిలోని కీటకాలైన సీతాకోక చిలకలు ఎక్కడ, ఏ పువ్వులో తేనె దొరికితే అక్కడ వాలి, ఆ తేనెని జుర్రుకుంటాయో, అలాగే సమాజంలోని రాజకీయ నాయకులు కూడా ఆ సమయానికి ఏ పార్టీకి ఎక్కువ అధికార బలం వుంటే అక్కడకి ఫిరాయించుతారు– అని అర్థం.

పార్టీ ఫిరాయింపుల గురించి ఎన్నికల వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రయత్నించే ఒక సంస్థ, 2014 నించీ, 2021 వరకూ, ఏడేళ్ళ కాలంలో జరిగిన ఎన్నికల్లో, ఏ పార్టీనించీ ఏ పార్టీకి ఫిరాయింపులు జరిగాయో, లెక్కలతో సహా అన్ని పార్టీల వివరాలూ ఇచ్చింది. ఉదాహరణకి, కాంగ్రెస్ నించీ బీజేపీ వైపు 399 మంది ఫిరాయించారు. వాళ్ళలో ఎమ్మెల్యేలూ, ఎంపీలూ 177 మంది వున్నారు. బీజేపీ నించీ కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన వారు 115 మంది. వాళ్ళలో 61 మంది ఎంపీలూ, ఎమ్మెల్యేలూనూ. ప్రాంతీయ పార్టీల నించీ ఫిరాయించిన వాళ్ళ లెక్కలూ; ప్రాంతీయ పార్టీలలోకి ఇతర పార్టీలనించీ వచ్చిన వాళ్ళ లెక్కలూ కూడా ఉన్నాయి. ఇటీవలి కాలంలో, గతంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రులుగా వున్న వారు 13 మంది బీజేపీలో చేరారని రాజ్‌దీప్ సర్దేశాయి ఇచ్చిన లెక్క. (ఆంధ్రజ్యోతి, ఫిబ్రవరి 23). బీజేపీ ముఖ్యమంత్రులుగా పనిచేసిన ఎనిమిది మంది గతంలో, కాంగ్రెస్‌లోకి ఫిరాయించారట!

ఇలా పార్టీలు మారడం ఎలా చెయ్యగలుగుతున్నారు– అనే ప్రశ్నకి జవాబు, ఆ పార్టీల మధ్య నిజమైన తేడా అంటూ ఏమీ లేకపోవడమే! శ్రమ దోపిడీ ద్వారా వచ్చే కౌళ్ళూ, వడ్డీలూ, లాభాలూ, వర్తక కమిషన్లూ– వంటి ఆదాయ మార్గాలను అనుమతించే పవిత్ర రాజ్యాంగం మీద ప్రమాణం చేసి, అన్ని రాజకీయాల పార్టీల వారూ ఎన్నికల్లో పాల్గొంటారు. అధికారంలోకి వచ్చాక అన్ని పార్టీల ప్రభుత్వాలూ అమలు చేసే విధానాలు ఒకటే. తమకు దగ్గిరగా వుండే పెట్టుబడిదారులకు (అంటే బాగా చందాలిచ్చే వాళ్ళకు) పందారాలు పెడతారు, భూముల కేటాయింపూ, ఇతర రాయితీలూ వగైరా. శ్రామిక జనాలకు ద్రోహం చేసే ప్రైవేటీకరణా, సరళీకరణా, ప్రపంచీకరణా అనే విధానాల్ని పకడ్బందీగా అమలు చేస్తారు. వాటిని ప్రవేశపెట్టిన నాయకుణ్ణి, 'సంస్కరణల పితామహుడు' అని అన్ని పార్టీలవారూ కీర్తిస్తారు. (అదే ఒక నాయకురాలైతే, ఆమెని 'ఐరన్ లేడీ' అంటారు.) అడవుల్ని ధ్వంసం చేసి, గనులు తొలిచి, గిరిజనుల బ్రతుకు తెరువుని ధ్వంసం చేయడానికి పెట్టుబడిదారులకు ఎడా పెడా అనుమతులిస్తారు. దానికి వ్యతిరేకంగా, గిరిజనుల్ని సంఘటితం చేసే ఉద్యమకారుల్ని, 'ఆపరేషన్ గ్రీన్ హంట్' పేరుతోనో, 'ఆపరేషన్ సమాధాన్' పేరుతోనో అణచివేయడానికి ప్రయత్నిస్తారు. ఆ అణచివేతని ఆ ప్రాంతాల్లో వుండే అధికార పార్టీలూ, ప్రతిపక్ష పార్టీలూ, రెండూ ఏకకంఠంతో సమర్థిస్తాయి. ప్రజల్లో రకరకాల సెక్షన్ల వారు (ఉదా: అంగన్‌వాడీ కార్మిక స్త్రీలు) జీతాలు పెంచమని అడిగితే లాఠీ చార్జీలూ, భాష్పవాయువులూ, వాటర్ కేనన్లూ ప్రయోగిస్తారు. కొన్ని సార్లు, కొన్ని చోట్ల గుర్రాలతో తొక్కించడాలు కూడా చేస్తారు. రైతులు ఉద్యమిస్తే, వాళ్ళకి టెర్రరిస్టుల ముద్ర వేస్తారు. ఉన్న రాజ్యాంగం పరిమితుల్లోనే అయినా, ప్రజల పక్షాన ప్రశ్నలు లేవనెత్తే మేధావుల్ని అర్బన్–నక్సలైట్లు అనో, జాతివ్యతిరేకులు అనో ముద్రవేసి, తప్పుడు కేసులు పెడతారు. విచారణ లేకుండా ఏళ్ళ తరబడి జైళ్ళలో ఉంచుతారు. ఈ విధానాలను అన్ని పార్టీలూ– బీజేపీ, కాంగ్రెస్సూ లాంటి జాతీయ పార్టీలే కాదు, ప్రాంతీయ పార్టీలు కూడా– అమలు చేస్తాయి, చేశాయి. కాకపోతే, సాధించిన సీట్లని బట్టి, అంటే మెజారిటీని బట్టి, ఆ విధానాల వేగమూ, తీవ్రతా వుంటాయి. ఎవరికి ఎక్కువ సీట్లు వస్తే, వాళ్ళకి చట్టబద్ధ ప్రజామోదం ('జనాదేశ్', 'లెజిటిమసీ') ఉన్నట్టు లెక్క. ఆ ప్రజామోదం పేరుతో, ఏదైనా చెయ్యొచ్చు. అందుకే ఓట్ల కోసం నానా వేషాలూ వేస్తారు. తీరా ఓటు వేశాక జనాల్ని పట్టించుకోరు. కాబట్టి ఓటర్లు చెయ్యవలిసింది ఏమిటి– అనే ప్రశ్న వస్తుంది.

ఓటర్లు (ప్రజలు) పని స్థలాలలోనూ, నివాస స్థలాలలోనూ సంఘాలుగా ఏర్పడి, ఆర్థిక, రాజకీయ, సాంఘిక సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రయత్నాలు చేస్తూ పోవాలి. బాతాఖానీ క్లబ్బులుగా, కాలహరణ కేంద్రాలుగా పేరు గడించిన చట్టసభలకి వెళ్ళి వెలగపెట్టేదేమీ లేదని తేలిపోయింది కాబట్టి, చట్టసభల బయట జరిగే పోరాటాలకే పూర్తి సమయాన్ని ఉపయోగించాలి. ఇప్పటికే ఎన్నో సంఘాలున్నా, చాలా వరకూ ఏదో ఒక ఓట్ల రాజకీయ పార్టీ నాయకత్వాన వున్నాయి. కొత్తగా ఏర్పడే సంఘాలు గానీ, పాత సంఘాలే గానీ, సమస్యల పరిష్కారం గురించే ఆలోచించాలి. ఎవరు అధికారంలో వున్నా ప్రశ్నించేలా తయారు కావాలి. కొన్ని గ్రామాల ప్రజలు, తమ గ్రామ సమస్యల్ని పరిష్కరించనందుకు నిరసనగా, ఎన్నికల్ని బహిష్కరించిన సందర్భాలు చూశాం.

ఇప్పుడున్న పరిస్థితుల్లో, ఓటు హక్కువల్ల ఏమీ ఉపయోగం లేదని భావించే వారు, ఓట్లు వెయ్యడానికి ఆసక్తి చూపడం లేదు. (ఈ అనాసక్తి, ఎప్పుడో 70 ఏళ్ళనాడే వున్నట్టు, సాహిత్యంలో ఒకటి రెండు ఉదాహరణలు కనిపిస్తాయి. చలం గారు 1937కీ–1955కీ మధ్య రాసిన మ్యూజింగ్స్‌లో ఒక దానిలో, ఇలా వుంది: 'ఈ వోటులో చాలా మోసం వుంది. నువ్వేకదా ఎన్నుకున్నది ప్రభుత్వాన్ని – అంటారు. పైగా, వోట్లతో ఎన్నుకున్న మునిసిపలు వ్యవహారాలు ఇన్ని ఏళ్ళూ ఒకే రకంగా నడిచాయి. ఎవణ్ణి ఎన్నుకున్నా ఫలితం వొకటే కదా – అని వోటు మీది ఉత్సాహం తగ్గిపోతోంది ప్రజకి.') ఓటర్ల అనాసక్తి, పోలయ్యే ఓట్ల సంఖ్యని బట్టి కూడా తెలుస్తుంది. ఒక లెక్క ప్రకారం మొత్తం ఓటర్లలో, మూడో వంతు మంది, అంటే నూటికి 33 మంది ఓట్లు వెయ్యడం లేదు. తమ ఓటుని ఏ పార్టీ వాళ్ళో దొంగగా వేసేస్తారేమో అనే అనుమానం వుంటే, తమ ఓటు హక్కుని ఉపయోగించుకుందాం అని అనుకుంటే, 'నోటా' అనే దాని మీద మీట నొక్కాలి. ఆ రకంగా, 'ఇప్పుడున్న పార్టీలన్నీ ఒకే రకం అయినవి. ఏవీ కూడా ప్రజల సమస్యల్ని పట్టించుకోవు' అని నిరసనను తెలియపరచవచ్చును.

ఇంతకీ తక్షణంగా జరగవలిసింది ఏమిటంటే: కారణాలు చెప్పి ఓట్లు వేయడం మానెయ్యడం, ఒక వేళ వేసినా, అన్ని పార్టీలకూ నిరసనగా 'నోటా' మీట నొక్కడం! తర్వాత కొన్నాళ్ళకు అసలు చెయ్యవలిసిందేమిటో, అనుభవంలో తెలుస్తుంది.

● ఈడ్పుగంటి నౌరోజీ

నేరస్థులను సంస్కరించేలా జైలుశిక్ష

రిమాండ్‌కు పంపబడిన ఖైదీలు సుదీర్ఘకాలపు జైలుశిక్షతో మానసికంగా కుంగిపోయి అనారోగ్యంపాలై జీవితం మీద విరక్తి చెందుతున్నారు. నలభై, యాభై సంవత్సరాల క్రితం సామాన్య ప్రజలలో నేరచరితులు తక్కువ. ఆంగ్లేయుల పాలనలో స్వాతంత్ర్య పోరాటం చేసిన భారతీయ నాయకులెందరినో అకారణంగానే జైళ్ళలో బంధించారు. వారంతా పోరాటాలు తప్ప, నేరాలు చేయలేదు. జైలుశిక్ష అనుభవిస్తున్న కాలంలో గాంధీ, నెహ్రూ, వాజ్‌పాయ్, లాంటి చాలామంది నాయకులు మానవాళి సంస్కరణకు అనేక విశిష్ట రచనలు చేశారు.



కాలక్రమేణా వచ్చిన మార్పులతో ఇప్పుడిప్పుడే విదేశాల్లోను, మనదేశంలో కూడా చాలాచోట్ల శిక్షాకాలంలో ఖైదీలతో పనిచేయిస్తూ, ఉపాధి కల్పిస్తూ సరైన మార్గంలో నడిచే విధంగా కొత్త ఆలోచన చేస్తుండడం ఆహ్వానించదగ్గ పరిణామం.


కొన్నిచోట్ల చిన్న చిన్న కుటుంబ తగాదాలు, ఆర్థిక నేరాలకు పాల్పడ్డవారిని కూడా కరుడుగట్టిన నేరస్థుల మధ్య ఉంచి అగౌరవంగా చూడడం, కొన్ని సందర్భాల్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించడం, జైల్లో మరుగుదొడ్లు కడిగించడం లాంటి పనులు చేయిస్తూ వారు మానసికంగా కృంగిపోయేలా చేస్తున్నారు. క్షణికావేశంలో నేరం చేసి, పశ్చాత్తాపానికి కూడా అవకాశం లేక జైలుశిక్ష అనుభవిస్తున్న వారి మానసిక వేదన వర్ణనాతీతం. నేర స్వభావంతోనే నేరం చేసినా శిక్షాకాలంలో వారు మానసిక పరివర్తన చెంది మంచిగా మారాలనేది భారతీయ శిక్షాస్మృతిలో అంతర్లీనంగా ఉన్న సందేశం.

తమకు నచ్చని వ్యక్తులమీద కేసులు బనాయించి, జైలుశిక్ష వేయించాలనే అక్కసుతో అనేకమంది జైలుపాలవుతున్నారు. ఇతరులపై కావాలని కేసులు పెట్టడం కూడా ప్రత్యక్షంగా కనపడని నేర ప్రవృత్తే. కానీ దానికి శిక్ష లేదు. సామాన్యులకు సౌకర్యాల లేమితో జైల్లో నరకం చూపిస్తారు. న్యాయవాదుల ఖర్చు భరించలేక, బెయిలు రాక సుదీర్ఘకాలం జైల్లోనే మగ్గుతున్న వారు కొందరైతే జడ్జీల కొరతతో పని వత్తిడితో, విచారణలో ఋజువులు దొరకక న్యాయస్థానాల్లో వాయిదాలు పడుతూ జైల్లోనే గడుపుతున్నవారు కొందరు. సత్వర న్యాయం లేదా సత్వర శిక్ష అమలైతే జైళ్ళపై వత్తిడి తగ్గుతుంది. నాసిరకపు తిండి, అపరిశుభ్ర పరిసరాలతో మూకుమ్మడిగా రోగాలబారిన పడుతున్నారు.

హత్యలు, మానభంగాలు, ఉగ్రవాద చర్యలకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా సత్వర శిక్షలు అమలు జరగాలి. కేంద్ర న్యాయ శాఖ, కోర్టులు, మేధావులు ఈ దిశగా ఆలోచించి కేసును బట్టి విచారణకు గరిష్ఠ కాలపరిమితి నిర్ణయించాలి. సుదీర్ఘకాలపు శిక్షలు మనిషి జీవితకాలాన్ని హరించివేసినట్లే. కాలయాపన, నేర తీవ్రత కూడా హెచ్చుతగ్గులకు కారణమవుతుంది. ఖైదీలు విచారణ పేరుతో సంవత్సరాల తరబడి జైళ్ళలో మగ్గడం సరైన సంకేతం కాదు. జైళ్ళలో సౌకర్యాల లేమిపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి. స్టేషన్‌లోనే పరిష్కారమయ్యే కేసులు రిమాండు దాకా రాకుంటే జైళ్ళకు కొంత వెసులుబాటు కలుగుతుంది. ఖైదీలకు ఊరికే వెట్టిచాకిరీ కాకుండా ఉపాధి కల్పన చూపించి, నేరచరితులను సంస్కరించే సంస్కరణాలయాలుగా జైళ్ళు మారాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– జోస్యుల వేణుగోపాల్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్,
హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్,
హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com





చిన్నారుల ఎత్తు కొలుస్తున్న అంగన్‌వాడీ టీచర్



చిన్నారులకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం



'ఎదుగుదల'పై నిర్లక్ష్యమేల?

- వయసుకు తగ్గ బరువులేక చిన్నారుల ఇబ్బందులు
- పౌష్టికాహార లోపంతో అనారోగ్య సమస్యలు
- జిల్లాలో 775 మంది చిన్నారుల అవస్థలు
- ఆరోగ్యంపై దృష్టి పెట్టాలని అధికారుల సూచన

జూలైవాడ, మార్చి 19: అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ఈ పౌష్టికాహారం ఇచ్చేందుకు కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నప్పటికీ కుటుంబ పరిస్థితులు, పిల్లల ఆరోగ్య పరిస్థితుల దృష్ట్యా ఇప్పటికీ చాలామంది పిల్లల్లో ఎదుగుదల కనిపించడం లేదు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాయి. స్త్రీ, శిశు సంక్షేమశాఖ 15 రోజులకోసారి చిన్నారుల ఎత్తు, బరువులను కొలిచి ఎదుగుదల లోపించిన పిల్లలను గుర్తిస్తారు. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో పౌష్టికాహార లోపంతో 775 మంది చిన్నారులు బాధపడుతున్నట్లు గుర్తించారు. వీరికి సూపర్‌వైజరీ ఫీడింగ్ ద్వారా సాధారణ స్థితికి తీసుకురావడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పిల్లలకు డబ్బా పాలు పట్టడం ద్వారా పిల్లలో ఎదుగుదల లోపించి ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రభావం పడుతోంది. ఈ సమస్యలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో యేటా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడమే కాకుండా అవగాహన కల్పిస్తే మంచి ఫలితాలు ఉంటాయని అధికారులు భావిస్తున్నారు.

మూడు ప్రాజెక్టుల పరిధిలో..

హనుమకొండ జిల్లాలో పరకాల, భీమదేవరపల్లి, హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 788 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఇందులో పెద్ద అంగన్‌వాడీ కేంద్రాలు 757, మినీ అంగన్‌వాడీ కేంద్రాలు 31 ఉన్నాయి. వీటి పరిధిలో ఐదేళ్లలోపు చిన్నారులు 8,639 మంది ఉండగా, ఏడాది నుంచి మూడేళ్ల లోపు చిన్నారులు 17,162, 3 ఏళ్ల నుంచి 6 ఏళ్ల వయస్సు పిల్లలు 19,539 మంది ఉన్నారు. గర్భిణులు 4,125 మంది, బాలింతలు 4,300 మంది ఉండగా అంగన్‌వాడీ సెంటర్లలో మొత్తంగా 53,765 మంది లబ్ధిదారులు ఉన్నారు. 3 నుంచి 6 యేళ్ల పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ పథకం కింద ఒకపూట భోజనం, 7 నెలల నుంచి 3 యేళ్ల లోపు చిన్నారులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోంది. అయితే కుటుంబ పరిస్థితులు, చిన్నారుల ఆరోగ్య కారణాలరీత్యా జిల్లాలో ప్రస్తుతం 775 మంది చిన్నారులు వారి వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేకుండా పోషణలోపంతో బాధపడుతున్నట్లు ఐసీడీఎస్ సిబ్బంది గుర్తించింది.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి

ప్రస్తుతం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా 7 నెలల నుంచి 3ఏళ్ల లోపు పిల్లలకు నెలకు 16 కోడిగుడ్లు, రోజుకు 100 గ్రాముల చొప్పున నెలకు సరిపడా బాలామృతం, రోజుకు 20 మురుకులను ఇంటికే పంపిస్తున్నారు. 3 ఏళ్ల నుంచి 6ఏళ్ల పిల్లలకు రోజుకు గుడ్డు చొప్పున నెలకు 30 ఉడకబెట్టిన కోడిగుడ్లతోపాటు అంగన్‌వాడీ పనిదినాల్లో 75 గ్రాముల బియ్యం, 15 గ్రాముల కందిపప్పు, 5 గ్రాముల నూనె, ఒక పూట సంపూర్ణ భోజనాన్ని అందిస్తున్నారు. వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేకుండా ఉన్న పిల్లలకు అందించే పౌష్టిక ఆహారానికి అదనంగా ప్రత్యేక ఆహారాన్ని అందించనున్నారు.

ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం..

- కె.మధురిమ, జిల్లా సంక్షేమ అధికారి



ఎదుగుదల లోపించిన చిన్నారులు సాధారణ స్థితికి వచ్చే వరకు వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. నెలకోసారి డాక్టర్ల చేత పరీక్షలు చేయిస్తాం. వయస్సుకు తగ్గ బరువు వచ్చే వరకు ప్రస్తుతం ఇస్తున్న పౌష్టికాహారానికి అదనంగా పోషకాలను అందిస్తాం. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.



పౌష్టికాహారం అందజేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి మధురిమ

విద్య, ఆరోగ్యమే లక్ష్యంగా..
- అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమం
- వెయ్యి దినాల ప్రాముఖ్యతపై కేంద్రాల్లో అవగాహన
- గర్భిణులు, బాలింతలకే కాక.. కుటుంబ సభ్యులకు సైతం..

8



ఫోన్‌ట్యాపింగ్ ప్రకంపనలు

- ప్రణీత్‌రావు సొంత జిల్లా వరంగల్‌పై దృష్టిసారించిన ప్రత్యేక దర్యాప్తు బృందం
- వార్‌రూం ఏర్పాటు చేసిందని పర్వతగిరిలోనేని ప్రచారం
- కమిషనరేట్ పరిధిలోని ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకున్నట్టు చర్చ
- వ్యవహారంలో జిల్లా నేతలున్నారంటూ అభియోగాలు

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్రంలోనే సంచలనం రేపిన ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారం జిల్లాలో ప్రకంపనలు సృష్టిస్తోంది. కీలకమలుపులు తిరుగుతున్న ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ వైపు దృష్టి మళ్లించారు. వరంగల్ జిల్లా పర్వతగిరిలోని ఓ వ్యక్తి ఇంట్లో వార్‌రూమ్ ఏర్పాటు చేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనే ప్రచారం నేపథ్యంలో మంగళవారం తెల్లవారు జామునే వరంగల్‌లో పని చేస్తున్న ఇద్దరు సీఐల ను అదుపులోకి తీసుకున్నట్టు తెలుస్తోంది. అయితే స్పెషల్ ఇంటిలిజెన్సీ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం మేరకే ఇద్దరు సీఐలను అదుపులో తీసుకున్నట్టు తెలిసింది. అయితే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పాత్రధారి అయిన ప్రణీత్‌రావు సొంత ఊరు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మేడిపల్లి కావటం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రణీత్‌రావు స్వగ్రామం మేడిపల్లి అయితే తన అమ్మమ్మ, అత్తగారి ఊరు పర్వతగిరి మండలం కేంద్రం. బాల్యం మొత్తం మేడిపల్లిలోనే గడిచినా ఆయనకు పర్వతగిరితోనే ఎక్కువ సత్సంబంధాలున్నాయని స్థానికులు పేర్కొంటునానరు. ఎస్ఐగా పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన ప్రణీత్‌కు సాంకేతిక విద్యపై పూర్తిస్థాయిలో ఉన్న పట్టుతో స్పెషల్‌బ్రాంచ్‌లో పనిచేసి త్వరితగతిన పదోన్నతులు పొందినట్లుగా సమాచారం. అయితే ప్రణీత్‌రావు అత్తింటివారు, సంబంధీకులు మొత్తం చాలాఏళ్ల క్రితమే హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.

పర్వతగిరిలో వార్‌రూమ్?

గత ప్రభుత్వం హయంలో నాటి పీసీసీ నేత రేవంత్‌రెడ్డితో పాటు పలువురు కీలక నేతల ఫోన్లు ట్యాప్ చేసినట్లుగా ఆరోపణలున్న కేసులో స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ) మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావును ఇటీవల హైదరాబాద్ పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో ఆయన్ను విచారించిన పోలీసులు ఏఏ జిల్లాల్లో.. ఎక్కడెక్కడ వార్ రూమ్‌లు ఏర్పాటు చేశారని, సహకరించిన ఇన్‌స్పెక్టర్ల జాబితా, ధ్వంసం చేసిన కంప్యూటర్ హార్డ్‌డిస్కుల వివరాలను రాబట్టినట్టు సమాచారం. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా పర్వతగిరిలో కూడా వార్‌రూమ్ ఏర్పాటు చేసినట్టు ప్రణీత్‌రావు చెప్పినట్టు సోషల్ మీడియాలో వార్త చక్కర్లు కొట్టింది. ఈ క్రమంలో ఆయనిచ్చిన సమాచారంతో ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు సీఐలను అదుపులోకి తీసుకుని హైదరాబాద్ తరలించి విచారిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. పర్వతగిరిలో వార్ రూమ్ ఏర్పాటు చేసి, అక్కడి నుంచి ఓ సీఐ నేతృత్వంలో ఫోన్ ట్యాపింగ్ జరిగిందని తెలియరాగా.. ఈ వ్యవహారమంతా ఎలా జరిగిందనే కోణంలో విచారణ నిర్వహిస్తున్నట్టు సమాచారం. కాంగ్రెస్ నేతలతో పాటు కొందరు బీఆర్ఎస్ నేతలు, కీలక అధికారుల ఫోన్‌లు ట్యాప్ చేశారని, ఈ మొత్తం వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ ముఖ్య నేత కూడా ఉన్నారని ప్రచారం జరగడం, దర్యాప్తు బృందాలు వరంగల్‌పై నిఘా పెట్టడం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

ప్రణీత్‌రావు ఎవరో తెలియదని ఎర్రబెల్లి స్పష్టీకరణ

ఫోన్‌ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రమేయం ఉందని ప్రచారం జరుగుతుండటం, సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతుండటంపై ఆయన స్పందించారు. తనకు ప్రణీత్‌రావు ఎవరో తనకు తెలియదని మంగళవారం వరంగల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్పష్టం చేశారు. పర్వతగిరిలో ప్రణీత్‌రావుకు బంధువులు ఉండటం మూలంగా వచ్చి పోయేవాడని, తనను కొందరు కావాలనే ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారని పేర్కొన్నారు. తానెవరికీ భయపడేది లేదని, తన పేరు చెప్పాలని ప్రణీత్‌రావుపై ఒత్తిడి తెస్తున్నారని ఎర్రబెల్లి పేర్కొనటంతో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం ముందుముందు ఎలాంటి మలుపులు తిరుగుతుం దోనన్న చర్చ జరుగుతోంది.

మంగళవారం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0°C కనిష్ఠం : 22.0°C

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : బుధవారం సా : 6.33 గం..
సహర్ : గురువారం ఉ : 4.58 గం..



మర్కజీ పాఠశాలలోని పరీక్షా కేంద్రంలో సీపీ

రెండోరోజూ 'పది' పరీక్షలు ప్రశాంతం

- హనుమకొండ జిల్లాలో 99.88 శాతం, వరంగల్ జిల్లాలో 99.8శాతం హాజరు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి రెండో రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం హిందీ పరీక్షకు వరంగల్ జిల్లా లో 99.8శాతం మంది విద్యార్థులు హాజరు కాగా, హనుమకొండ జిల్లాలో 99.88 శాతం మంది హాజరయ్యారు. వరంగల్ జిల్లా పరిధిలో

మిగతా 8వ పేజీలో..

పార్టీ మారే ప్రసక్తే లేదు..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో నన్ను ఇరికించే కుట్ర
- అవినీతిపరులే బీఆర్ఎస్‌ను వీడుతున్నారు..
- ఆందోళన వద్దు.. శ్రేణులకు అండగా ఉంటాం..
- ప్రెస్‌మీట్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న ఎర్రబెల్లి, వినయభాస్కర్

రాంనగర్, మార్చి19: తాను పార్టీ మారే ప్రసక్తే లేదని, గిట్టని వారు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. అవినీతిప రులు ఆస్తులు కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌ను వీడి అధికార పార్టీ కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. అవకాశవాదులు పోయినంతమాత్రాన ఆందోళ చెందాల్సిన అవసరం లేదని, తాము కేడర్‌కు అండగా నిలుస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కలిసి పనిచేసి పార్టీని బలోపేతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి ఓ మోసకారి అని, ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చాడని ఆయన ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక చేతులెత్తేశాడని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అవగాహన రాహిత్యంతో రైతుల పంటలు ఎండుతున్నాయని ఆయన అన్నారు. కాళేశ్వరం పిల్లర్లు కుంగాయని సాకు చూపి నీళ్లు ఆపారని ఆయన ఆరోపించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, పార్టీలోనే ఉంటానని, బీఆర్ఎస్ మరోసారి అధికారంలోకి వచ్చేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని ఎర్రబెల్లి పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని, వార్‌రూమ్ అనే విషయం తనకు తెలియదన్నారు. ప్రణీత్‌రావు అమ్మమ్మ ఊరు పర్వతగిరి అని, ఆయనకు తనతో ఎలాంటి పరిచయం లేదన్నారు. ఫోన్ ట్యాపింగ్‌లో తనను ఇరికించే కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న కావ్యను గెలిపించుకుందామని దయాకర్‌రావు శ్రేణులకు పిలుపునిచ్చారు.

హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ఫొటో పెట్టుకుని విజయం సాధించి, అధికారాన్ని అనుభవించి స్వలాభం కోసం పార్టీని వీడటం సిగ్గుచేటన్నారు. చెట్టుకు ఎండిన ఆకులు రాలిపోతున్నాయని, చెట్టు, వేర్లు బలంగా ఉన్నాయని ఆయన తెలిపారు. మళ్లీ చెట్టు చిగురిస్తుందని, కాయలు కాస్తాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చోటా భాయ్, కేంద్రంలోని బడా భాయ్ కలిసి కేసీఆర్‌పై కుట్ర చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తాను ఫుల్‌టైమ్ పొలిటీషియన్‌నని ఆయన తెలిపారు. పార్ట్‌టైమ్ పొలిటీషియన్‌లు పార్టీ మారినంతమాత్రాన జరిగే నష్టం లేదని వినయభాస్కర్ పేర్కొన్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. తనకు అవకాశం ఇచ్చిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 100 రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందన్నారు. వరంగల్ నుంచి ఎంపీగా తాను విజయం సాధిస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్సీ పోచం పల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నేతలు కె.వాసుదేవరెడ్డి, సుందర్‌రాజ్, లలితాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చేసిన తప్పును ప్రజలు గుర్తించారు..

- దొంగ హామీలను నమ్మి బీఆర్ఎస్‌ను ఓడించారు
- ఆస్తులు కాపాడుకునేందుకు నేతలు పార్టీని వీడుతున్నారు
- ఆందోళన వద్దు.. కార్యకర్తలను కాపాడుకుంటాం..
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం

7



శానిటేషన్ సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టండి


- నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- పలు ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: గ్రేటర్ వరంగల్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ, నీటి సరఫరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని పలు ప్రాంతాలను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ పోతన ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌తోపాటు పలు కాలనీలలో పర్యటించారు. ఇంకా వరంగల్ బ్యాంకు కాలనీ, దేశాయిపేట, ఎల్బీనగర్, గొల్లవాడ, పద్మనగర్‌లోని పలు ప్రాంతాల్లో పర్యటించి అక్కడి నీటి సరఫరాపై స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ రోజు ఎంత సమయం నీరు సరఫరా అవుతోంది? అధికారులు పర్యవేక్షిస్తున్నారా? నీటి పన్నులు చెల్లిస్తున్నారా? అని ప్రత్యక్షంగా ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా శానిటేషన్ పర్యవేక్షణలో భాగంగా ఇదే ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుధ్య కార్మికులతో మాట్లాడారు. ఉదయం ఎన్ని గంటలకు విధులకు హాజరువుతున్నారు? సకాలంలో జీతాలు వస్తున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నీరును అవసరానికి మించి వాడకూడదని, ఎండాకాలంలో అందరికీ నీరు చాలా అవసరం అన్నారు. నీటి వృథాను అధికారులు అరికట్టి లీకేజీలను మూసివేయాలని సూచించారు. నల్లాలకు ఆన్, ఆఫ్ వ్యవస్థ తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లైన్‌మెన్‌లు ఎప్పటికప్పుడు లీకేజీలను గుర్తించి అధికారులకు తెలియచేయాలని అన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో మల్లం రాజేశ్, ఈఈ శ్రీనివాస్, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, డీఈలు సిరిమల్లె సారంగం, రంగారావు, కృష్ణమూర్తి, రవీందర్, ఏఈలు సౌజన్య, సతీష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఎల్లస్వామి, శ్యాంరాజ్, ధరంసింగ్‌లు ఉన్నారు.

రుణసాయానికి దూరం..

- వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ పథకానికి నోచుకోని రైతులు
- అవగాహన లేకపోవడమే కారణం
- గోదాముల్లో పంటను నిల్వ చేసుకుంటే 'రైతుబంధు'
- రీజియన్ పరిధిలో రూ.28కోట్లు కేటాయింపు
- రుణం తీసుకుంది మాత్రం నలుగురే..




వరంగల్ వ్యవసాయం, మార్చి 19 : వ్యవసాయ మార్కెట్లలో పంటలకు గిట్టుబాటు ధర లభించనప్పుడు ఆ పంటను గోదాముల్లో నిల్వ చేసుకుని, దానిపై సదరు రైతులు రుణం పొందేందుకు వీలుగా వ్యవసాయ మార్కెటింగ్ శాఖ రైతుబంధు (రుణసాయం) పథకాన్ని 20ఏళ్ల క్రితమే అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయ మార్కెట్లలో రైతుల నుంచి పన్ను వసూలు చేయడమే కాదు.. రైతులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి ప్రభుత్వం రైతుబంధు పేరుతో రైతులకు రుణం ఇచ్చి ఆసరాగా నిలిచే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేపెట్టిది. పంటను అమ్మకానికి తీసుకువచ్చినప్పుడు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించకపోతే.. ఆ సమయంలో ఆ రైతు సరుకును మార్కెట్ కమిటీ గోదాముల్లో లేదంటే కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసుకుని ఆ రశీదును మార్కెట్ కమిటీలో అందజేసే, అధికారులు సదరు రైతు పంట సరుకు విలువలో 75శాతం, లేదా రూ.2లక్షలకు మించకుండా ఆరు నెలల వరకు వడ్డీలేని రుణాన్ని రైతుకు అందజేస్తారు. ఆ తరువాత రైతు పంటను మార్కెట్లో మంచి ధర వచ్చినప్పుడు విక్రయించి తీసుకున్న రుణాన్ని మినహాయించుకుని మిగతా డబ్బులు రైతుకు అందేలా అధికారులు చర్యలు తీసుకుంటారు.

కేటాయించింది రూ.28కోట్లు, ఇచ్చింది రూ.7.71లక్షలే..

మార్కెట్ రీజినల్ పరిధిలో 19 జిల్లాలు, 110 మార్కెట్ కమిటీలకు 2023-24 సంవత్సరానికి గాను రైతుబంధు పథకం కింద మార్కె టింగ్ శాఖ రూ.28కోట్లు కేటాయించింది. అయితే ఇప్పటి వరకు వరం గల్ జిల్లాలో ఒక రైతుకు రూ.2లక్షలు, మహబూబాబాద్ జిల్లాలో ఒక రైతుకు రూ. 1.75లక్షలు, ఖమ్మం జిల్లాలో ఇద్దరు రైతులకు రూ.4లక్షలు కలిపి రైతుబంధు పథకం నలుగురు రైతులకు రూ.7.71లక్షలు మాత్రమే ఇచ్చారు. అయితే ఈ రైతుబంధు పథకంపై రైతులకు సరైన అవగాహన లేకపోవడంతో పథకం నిర్వీర్యమవుతోంది. అధికారులు సైతం కల్పించడానికి ఆసక్తి చూపడం లేదు. రైతులకు అవగాహన కల్పిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. మంచి ధర వచ్చే వరకు సరుకునే దాచుకునే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అసలే ఉద్యోగుల కొరతతో ఉన్న అధికారులకు ఇప్పటికే పని ఒత్తిడికి లోనవుతున్న క్రమంలో రైతుకు మంచి అవకాశాల గురించి చెప్పే ఓపిక లేకుండా పోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

రైతులకు సేవలందిస్తున్నాం..

- మల్లేశం, మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్



రైతుబంధు (రుణసాయం) పథకం కింద రైతులకు సేవలందిస్తున్నాం. ఈ సంవత్సరం ధాన్యం, మొక్కజొన్న, ఇతర ఉత్పత్తులకు ఎంఎస్‌పీ ధరల కంటే మార్కెట్లో ఎక్కువ ధరలు పలుకడంతో రైతులు రైతుబంధు పథకాన్ని వినియోగించుకో లేదు. సాధారణంగా రైతులు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో రైతుబంధు పథకం ద్వారా రుణం తీసుకుంటారు. ముఖ్యంగా మార్చిలో రైతులు రుణం తీసుకుంటుంటారు. రైతుబంధుపై మార్కెట్లో రైతులకు తెలిసేలా మైక్‌ల ద్వారా అనౌన్స్ చేయిస్తున్నాం.



పులిపిర్లకి అరుదైన చికిత్స

▸▸ ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు

వరంగల్ జిల్లా, మార్చి 19: పులిపిర్లకు వడియార మల్లికార్జున (విశిష్ట పురస్కారం మరియు జాతీయస్థాయిలో "వైద్యశ్రీ" అవార్డు గ్రహీత) అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు. వరంగల్ జిల్లా, హన్మకొండలోని నక్కలగుట్ట, హోటల్ హరిత కాకతీయ, హన్మకొండనందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 20, 21, 22, తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిర్లైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం అదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. బుధ, గురు, శుక్ర వారం మూడు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

పులిపిర్లపై చికిత్స చేస్తున్న దృశ్యం

న్యాక్ జాతీయ సదస్సులో వీసీ రమేశ్

కేయూ క్యాంపస్, మార్చి 19: విద్యాసంస్థల స్వయం సమృద్ధితో విద్యా విధానాల్లో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలపై మంగళవారం దేశ వ్యాప్తంగా బెంగళూరలోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడేషన్ కౌన్సిల్ (న్యాక్) జాతీయ స్థాయిలో ఆన్‌లైన్‌లో సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ కేయూ పరిపాలన భవనంలోని కమిటీ హాల్ నుంచి సదస్సులో పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానంలో భాగంగా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాల కోసం న్యాక్ అధికారులు దేశంలోని వివిధ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్లు, జాతీయ సంస్థల డైరెక్టర్లు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు. రాబోయే రోజుల్లో న్యాక్ అక్రిడేషన్ విధానం, ప్రస్తుతం ఉన్న విధానంలో చేపడుతున్న విధానపరమైన నిర్ణయాలు, అక్రిడేషన్ పొందిన విద్యాసంస్థలకు వచ్చే ప్రయోజనాలతోపాటు విద్యార్థులకు కల్పించాల్సిన, సమాజానికి అవసరమైన విద్యాసంస్థల స్వయం సంమృద్ధి కోసం చేయాల్సిన బాధ్యతలు చర్చించారు. డిజిటలీకరణ, అకడమిక్ క్రెడిట్స్, ఫిర్యాదుల పరిష్కారం యంత్రాంగం, అభిప్రాయ సేకరణ, విద్యాసంస్థల్లో ఉన్న ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ పనితీరుపై చర్చించారు. జాతీయ విద్యావిధానంలో పొందుపరిచిన లక్ష్యాలను అందుకునేందుకు దృష్టి పెట్టాల్సిన అంశాలనూ పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, కేయూ క్వాలిటీ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, ప్రొఫెసర్ ఎన్.గోపి, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ మంచాల సదానందం తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ జాతీయ సదస్సులో ఆన్‌లైన్‌లో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఇతర అధికారులు

రోడ్డు ప్రమాదంలో నిట్ విద్యార్థి దుర్మరణం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: అతి వేగం ఓ టెక్నోక్రాట్‌ను బలితీసుకుంది. కారును అతి వేగంగా నడపడం వల్ల సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని తార్నాక వైజంక్షన్‌లో డివైడర్‌ను ఢీకొట్టిన సంఘటనలో వరంగల్ నిట్ విద్యార్థి క్షితిజ్‌రాజ్(22) దుర్మరణం పాలయ్యాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్షితిజ్‌రాజ్ నిట్‌లో ఈఈఈ నాలుగో సంవత్సరం చదువుతు న్నాడు. ఈ ఘటనలో మరో నలుగురు నిట్ విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. వివరాల్లోకి వెళితే.. స్నేహితుడి ఇంటర్వ్యూ కోసం సోమవారం వరంగల్ నుంచి సెల్ఫ్ డ్రైవింగ్ కార్‌ను అద్దెకు తీసుకొని క్షితిజ్‌రాజ్, ఈసీఈ నాలుగో సంవత్సరం విద్యార్థి హర్షిత్ మహేశ్వరి, ఈఈఈ నాలుగో సంవత్సరం విద్యార్థి అర్జుతన్వర్, ఎంఎంఈ నాలుగో సంవత్సరం విద్యార్థి నవీన్ దవన్, ఎం ఎంఈ ద్వితీయ సంవత్సరం విద్యార్థి కపిల్ హైదరాబాద్ వెళ్లారు. తార్నాక సమీపంలోని పీఎస్ వై జంక్షన్ సమీపంలో రాత్రి సుమారు 11.30 గంటల సమయంలో అతివేగంగా నడుపుతున్న కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో క్షితిజ్‌రాజ్ అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ఉన్న మిగతా నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయట పడ్డారు. తార్నాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిట్ విద్యార్థి రోడ్డు ప్రమాదంతో దుర్మరణం పాలవడంతో నిట్‌లో ఒక్క సారిగా విషాదఛాయలు అలముకొన్నాయి.

క్షితిజ్ రాజ్ (ఫైల్)

సరిహద్దుల్లో అలజడి

మహారాష్ట్ర రేపనపల్లి అడవుల్లో ఎదురుకాల్పులు ● నలుగురు మావోయిస్టుల మృతి

మహదేవపూర్, మార్చి 19: పార్లమెంటు ఎన్నికల వేళ తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దుల్లో మంగళవారం తెల్లవారుజామున అలజడి రేగింది. సుమారు రెండున్నర గంటలపాటు పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన హోరాహోరీ ఎదురుకాల్పుల్లో తెలంగాణకు చెందిన నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. గడ్చిరోలి జిల్లా రేపనపల్లికి సౌత్ ఈస్ట్ ప్రాంతంలో 8 కిలోమీటర్ల దూరంలోని కొలమార్క గుట్టల్లో ఈ ఘటన జరిగింది. కొద్ది రోజులుగా ఈ ప్రాంతంలో మావోయిస్టుల కార్యక్రమాలు విస్తృతంగా జరుగుతుందన్న పక్కా సమాచారంతో అహెరీ అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో పెద్దఎత్తున పోలీసు బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. తెల్లవారుజామున ఒక డెన్‌లో ఉన్న మావోయిస్టులను చుట్టుముట్టిన పోలీసులు కాల్పులు ప్రారంభించగా మావోయిస్టులు ఎదురుకాల్పులకు దిగడంతో సుమారు రెండున్నర గంటల పాటు కొలమార్క గుట్టల ప్రాంతంలో తుపాకీ చప్పుళ్లతో పరిసర ప్రాంతాలు దద్దరిల్లాయి. కాల్పులు ముగిసిన తర్వాత పోలీసులు సెర్చ్ ఆపరేషన్ నిర్వహించగా ఈ ఘటనలో తెలంగాణలోని మంగీ- ఇంద్రవెల్లి ఏరియా కమిటీ సభ్యుడు, కొమురంభీం మంచిర్యాల డివిజన్ కమిటీ సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌కు చెందిన వర్గీస్(28), ఛత్తీస్‌గఢ్‌కు చెందిన భైరాన్‌ఘర్ జిల్లా కొత్రాంకు చెందిన జిల్లా కమిటీ సభ్యుడు, సిర్పూర్ - చెన్నూరు కార్యదర్శి పాండు అలియాస్ మంగులు (32), ప్లాటూన్ మెంబర్లు కురుసంగి రాజు , కుడిమేత వెంకటేశ్ మరణించినట్టు గుర్తించారు. సంఘటనా స్థలంలో ఏకే 47 రైఫిల్ ఒకటి, ఒక కార్బన్, మరొక కంట్రీమేడ్ పిస్టల్, మావోయిస్టుల సాహిత్యం, పేలుడు పదార్థాలు, వంట సామగ్రి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాల్పులు జరిగిన సంఘటనా స్థలం నుంచి మరికొంతమంది మావోయిస్టులు తప్పించుకొని వెళ్లారని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఈ నలుగురిపై మహారాష్ట్ర రాష్ట్ర ప్రభుత్వం రూ. 36లక్షల రివార్డును ప్రకటించడం విశేషం. ఇక తప్పించుకున్న మావోయిస్టులు ఏయే ప్రాంతాలవైపు వెళ్లే అవకాశం ఉందన్న పక్కా ప్రణాళికలతో పోలీసులు సరిహద్దు ప్రాంతాల్లో కూంబింగ్ చేపట్టారు. కొలమార్క గుట్టలతో పాటు సమీపంలోని అటవీ ప్రాంతంలో నిఘా వ్యవస్థను పటిష్టపరిచి తప్పించుకున్న మావోయిస్టులను మట్టుబెట్టడమే లక్ష్యంగా పోలీసులు కూంబింగ్ చేస్తున్నారు.

టెన్షన్.. టెన్షన్..

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన 72 గంటల్లోపే మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టుల కట్టడికి కూంబింగ్ చేపట్టారు. అలాగే రెండు రాష్ట్రాల పోలీసు అధికారులు సమన్వయంతో పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఎదురుకాల్పుల్లో గాయపడిన మావోయిస్టులు చికిత్స కోసం తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉండడంతో గోదావరి తీర ప్రాంతం వెంట పటిష్ఠ భద్రతను అప్రమత్తం చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఇక తాజా ఘటనలో కీలకంగా వ్యవహరించిన స్పెషల్ ఐజీ సందీప్ పాటిల్, గడ్చిరోలి జోన్ డీఐజీ అంకిత్ గోయల్, సీఆర్‌పీఎఫ్ డీఐజీ జగదీష్ మీనా, గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్‌లను ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న వారి ఉన్నతాధికారులు ప్రశంసించారు.



కొలమార్క గుట్టల నుంచి మావోయిస్టు మృతదేహాన్ని హెలీక్యాప్టర్‌లో గడ్చిరోలికి తీసుకొచ్చిన పోలీసులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

అంతర్రాష్ట్ర వంతెనపై పోలీసుల తనిఖీలు

మహారాష్ట్ర - తెలంగాణ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగిన నేపథ్యంలో అప్రమత్తమైన కాళేశ్వరం పోలీసులు అంతర్రాష్ట్ర వంతెన వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోకి వస్తున్న ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నారు. గోదావరి మీదుగా మావోయిస్టులు తెలంగాణలోకి వచ్చే అవకాశం ఉండడంతో గ్రామస్థులకు అవగాహన కల్పించి.. అనుమానిత వ్యక్తులు గ్రామాల్లోకి వస్తే సమాచారం అందించాలని సూచిస్తున్నారు. భద్రతా ఏర్పాట్లను మహదేవ పూర్ సిఐ రాజేశ్వర్‌రావు, కాళేశ్వరం ఎస్సై భవానీసేన్ పర్యవేక్షిస్తున్నారు.

ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతల చర్చలు

- కడియం కావ్యను మార్చాలని ఉద్యమకారుల డిమాండ్
- అదిష్ఠానం దృష్టికి తీసుకెళతామన్న నేతలు
- లేదంటే కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరిక

రాంనగర్, మార్చి19: వరంగల్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థిగా కడియం కావ్యను ప్రకటించడాన్ని వ్యతిరేకిస్తున్న ఉద్యమకారులతో బీఆర్ఎస్ నేతలు దాస్యం వినయ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కె.వాసుదేవరెడ్డి, సుందర్ రాజ్ భేటీ అయ్యారు. మంగళవారం నగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో భేటీ అయిన నేతలు.. నిరసన గళం వినిపిస్తున్న ఉద్యమకారులు బోడ డిన్నా, జోరిక రమేశ్, బండి రజనీకుమార్, వీరేందర్, చింతల యాదగిరితో చర్చలు జరిపారు. పార్టీలో సభ్యత్వంలేని, రాజకీయంగా ఎలాంటి అనుభవం లేని కడియం కావ్యను ఎలా అభ్యర్థిగా ప్రకటిస్తారని ఉద్యమకారులు ప్రశ్నించారు. తమలో ఒకరికి అవకా శం ఇవ్వాలని చేస్తున్న అభ్యర్థనను ఏ మాత్రం పట్టించుకోకపోవడం ఎంతవరకు సమం జసమని వారు నేతలను ప్రశ్నించారు. ఒకే ఇంట్లో నుంచి ఇద్దరికి పదవులు ఇవ్వాల్సిన అవసరం ఏంటని వారు నేతల దృష్టికి తీసుకువచ్చారు. వారంరోజుల్లో కడియం కావ్యను మార్చి తమలో ఎవరికైనా అవకాశం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. తమ అభ్యర్థనను పార్టీ అధిష్ఠానం పట్టించుకోకుంటే జయశంకర్ విగ్రహం వద్ద ప్రెస్‌మీట్ పెట్టి కార్యాచరణ ప్రకటిస్తామని నేతలకు తేల్చిచెప్పారు. కాగా, ఉద్యమకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో అధిష్ఠానం దృష్టికి తీసుకెళతామని నేతలు పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం జరిగేలా చూస్తామని వారు హామీ ఇచ్చారు. అధిష్ఠానం సూచించిన అభ్యర్థిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని నేతలు పేర్కొన్నారు.

క్రషర్స్ యజమానులకు సమస్యలు పరిష్కరించాలి



డీడీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి19: మైనింగ్ శాఖ ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వర్లును కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు హనుమకొండ హంటర్‌రోడ్‌లో ఉన్న డీడీ కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. స్టోన్ క్రషర్స్ యజమానులకు ఉన్న సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా వారు డీడీ వెంకటేశ్వర్లును కోరారు. అనంతరం మైనింగ్ శాఖ హనుమకొండ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ సాంబశివరావును కలిశారు. కాకతీయ స్టోన్ క్రషర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుల పేరాల మధుసూధన్ రావు, ప్రధాన కార్యదర్శి ఎస్.నరేష్, స్టోన్ క్రషర్స్ యజమానులు దేవేందర్ రెడ్డి, రాంరెడ్డి, సుజిత్‌రావు తదితరులు డీడీని కలిసిన వారిలో ఉన్నారు.

నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌నకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: విదేశాల్లో ఎంఎస్, పీహెచ్‌డీ కోర్సులు చదివేందుకు నేషనల్ ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత విభాగం ప్రకటన జారీ చేసింది. 2024-25 సంవత్సరానికి ఎంపిక కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. www.nosmsje.gov.in అనే వెబ్‌పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా వారు పేర్కొన్నారు.

చేసిన తప్పును ప్రజలు ప్రజలు గుర్తించారు..

● దొంగ హామీలను నమ్మి బీఆర్ఎస్‌ను ఓడించారు.. ● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాంనగర్, మార్చి 19: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని ఓడించి తప్పు చేశామని రాష్ట్ర ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. మంగళవారం హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వర్ధన్నపేట నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇచ్చిన హామీలు గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల్లో ఇప్పటి వరకు కేవలం రెండు హామీలు మాత్రమే అమలు చేశారని ఆయన చెప్పారు. రేవంత్‌రెడ్డికి మాయమాటలు చెప్పడం మొదటి నుంచి అలవాటేనన్నారు. అవినీతి చేసిన నేతలు ఆస్తులు కాపాడుకు నేందుకు పార్టీ మారుతున్నారని ఆయన ధ్వజ మెత్తారు. కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాని ఎర్రబెల్లి పేర్కొన్నారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ భాస్కర్ మాట్లాడుతూ.. స్వలాభం కోసం నేతలు పార్టీ మారుతున్నారని ఆరోపిం చారు. శ్రేణులు వారివెంట వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేదీ లేదని అన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌కు బలమైన కేడర్ ఉందన్నారు. ఎవరో కొందరు పార్టీ వీడినంత మాత్రాన జరిగే నష్టం లేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుదామన్నారు. కార్యకర్తలు ఆందోళనకు గురికావద్దని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ కుడా ఛైర్మన్ సుందర్‌రాజ్, వాసుదేవ రెడ్డి, లలితాయాదవ్, కడియం కావ్య, ఇండ్ల నాగేశ్వర్‌రావు, చింతల యాదగిరి వర్ధన్నపేట నియోజకవర్గ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కాగా, ఈ సందర్భంగా పలువురు వర్ధన్నపేట బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. పదేళ్ల పదవులు అనుభవించి, ఆస్తులు కాపాడుకోవడానికి పార్టీ వీడటం ఎంతవరకు సమంజసమని అరూరి రమేశ్‌ను ఉద్దేశించి అన్నారు. నమ్ముకున్న వారిని నట్టేట ముంచి తన స్వలాభం చూసుకున్నాడని విమర్శించారు. పార్టీ మారిన వారితో నష్టం లేదని, భవిష్యత్‌లో కలిసికట్టుగా పనిచేసి వర్ధన్నపేటలో బీఆర్ఎస్‌ను పటిష్ఠం చేస్తామని వారు పేర్కొన్నారు.

లాసెట్ ద్వారా ఎంజేపీ లా కళాశాలల్లో ప్రవేశాలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: మహాత్మాజ్యోతిరావు పూలే బీసీ గురుకులాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో నెలకొల్పిన రెండు లా కళాశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న లా సెట్ ర్యాంకు ద్వారానే సీట్లు కేటాయించనున్నట్లు ఎంజేపీ ఆర్సీవో మనోహర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ మహేశ్వరంలో బాలుర రెసిడెన్షియల్ లా కళాశాల, కాజీపేటలో నెలకొల్పిన బాలికల రెసిడెన్షియల్ లా కళాశాలలో ఈ ఏడాది నుంచి ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రెండు కళాశాలల్లో 5 ఏళ్ల లా కోర్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇంటర్ పాసై లా సెట్‌లో సాధించిన ర్యాంకు ఆధారంగా సీట్లు పొందవచ్చునని తెలిపారు. కాగా, లాసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 15 వరకు గడువు ఉందని తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వేలేరు(ధర్మసాగర్)మార్చి 19: వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీర్చ లేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హనుమకొండ జిల్లా వేలేరు మండలం పీచర గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ.హరిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పీచర గ్రామానికి చెందిన పిట్ల సుధాకర్(43) తనకున్న మూడెకరాల వ్యవసాయ భూమిలో కొన్నేళ్ల నుంచి మొక్కజొన్న, వరి పంటలను సాగు చేస్తున్నాడు. వ్యవసాయ బావిలో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రూ.10లక్షలు అప్పులు చేసి బావిలో సైడ్‌బోర్లను సైతం వేయించాడు. దీంతో పాటు అప్పులు చేసి తన కూతురు రవళి వివాహం చేశా డు. వ్యవసాయంతో చేసిన అప్పులు తీర్చాలనుకున్నప్పటికీ సాగు చేసిన పంటకు సాగు నీరు లేకపోవడంతో దిగుబడి రాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చడం ఎలా అని మనస్తాపం చెంది వ్యవసాయ బావి వద్దకు సోమవారం రాత్రి వెళ్లి సుధాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న సుధాకర్‌ను చుట్టు పక్కల రైతుల గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో పాటు కుటుంబ సభ్యులు అక్కడికి వచ్చే సరికే సుధాకర్ మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు విచ్చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య కూతురు, కుమారుడు ఉన్నాడు.



రైతు సుధాకర్ (ఫైల్)

పరీక్షా కేంద్రంలో సెల్‌ఫోన్లు కనిపిస్తే చర్యలు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 19: పదో తరగతి పరీక్షా కేంద్రాల్లో సెల్‌ఫోన్లు కనిపిస్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని డీఈవో డాక్టర్ అబ్దుల్ హై మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మంగళవారం ఉదయం పరీక్షకు ముందు నిర్వహించిన సెట్ కాన్ఫరెన్స్‌లో పరీక్షా కేంద్రాల నిర్వాహకులు సీఎస్, డీవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షా కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయులు ఇతరత్రా నిర్వాహ కులు సెల్‌ఫోన్లను పరీక్షాకేంద్రంలోకి తీసుకెళ్లరాదని ఆయన స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన వాహనాలు, హెడ్మాస్టర్ల గదులు, బాత్‌రూమ్‌లలో ఎక్కడా సెల్‌ఫోన్‌లు లేకుండా చూడాలని సెట్ కాన్ఫరెన్స్‌లో స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఆయన ప్రకటనలో హెచ్చరించారు. హనుమకొండ జిల్లాలోని పరీక్షా కేంద్రాల్లో ఎక్కడా సెల్‌ఫోన్లు వినియోగించినట్లు తన దృష్టికి రాలేదని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుడి మృతి

● మేడారం విధులు ముగించుకుని వస్తుండగా రోడ్డు ప్రమాదం ● 20రోజులుగా మృత్యువుతో పోరాటం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బొట్ల దేవానంద్ (40) అనే పారిశుధ్య కార్మికుడు మంగళవారం మృతిచెందాడు. 20 రోజులుగా హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కుటుంబ సభ్యులు, తోటి కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ ఎల్బీనగర్‌కు చెందిన బొట్ల దేవానంద్ 20 యేళ్లుగా నగర పాలక సంస్థలో శానిటేషన్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల సునిల్ పరిధిలో పని చేస్తున్నాడు. కాగా, మునిసిపల్ అధికారుల ఆదేశాల మేరకు ఫిబ్రవరి 15 నుంచి 29 వరకు మేడారం జాతరలో విధులు నిర్వర్తించాడు. జాతర విధులు ముగించుకుని 29న సాయంత్రంస్వచ్ఛభారత్ ఆటోను నడుపుకుంటూ నగరానికి వస్తున్నాడు. ఈ క్రమంలో ములుగు జిల్లా గట్టమ్మ వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన లారీ దేవానంద్ ఆటోను ఢీకొట్టి వెళ్లిపోయింది. దేవా నంద్ కాళ్లు విరిగి కడుపులో బలమైనగాయాలయ్యాయి. అక్కడి వారు గుర్తించి 108లో ఎంజీఎంకు తరలించారు. చికిత్స చేస్తుండగా పరిస్థితి విషమించడంలో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తీసుకె ళ్లాలని డాక్టర్లు సూచించారు. దీంతో హైదరా బాద్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. అయినా వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో మంగళవారం మృతి చెందాడు. దేవానంద్ చికిత్సకు ఇప్పటివరకు రూ.10లక్షల వరకు ఖర్చు చేశామని కుటుంబ సభ్యులు తెలిపారు. తమ కుటుంబానికి ఏ అధికారులు, ఏ సంఘం నాయ కులు సహకరించలేదని, ఆర్థికంగా చితికిపోయిన తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని మృతునికి కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు.



దేవానంద్(ఫైల్)



మృతుడి ఇంటి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ల నియామకానికి కసరత్తు

మంత్రుల చుట్టూ ఆశావహుల ప్రదక్షిణలు

హనుమకొండ టౌన్, మార్చి19: బీఆర్ఎస్ హయాంలో నియామకమైన ఎన్పీడీసీఎల్ డైరెక్టర్లను కాంగ్రెస్ ప్రభుత్వం తొలిగించింది. ఇప్పుడు కొత్త (ఫైనాన్స్ ఆపరేషన్స్ ప్రాజెక్ట్స్ హెచ్ఆర్ అండ్ ఐఆర్) డైరెక్టర్లను నియమించేందుకు ఫిబ్రవరిలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో డైరెక్టర్లుగా పనిచేసేందుకు ఎన్పీడీసీఎల్‌తో పాటు, ఎస్పీడీసీఎల్, ట్రాన్స్‌కో, జెన్‌కోలో పని చేస్తున్న చాలామంది సీఈలతో పాటు రిటైర్డ్ సీఈలు ఈనెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్నారు. సర్వీసులో ఉన్నవారైతే ఎస్ఈ, సీఈగా కలిపి ఐదేళ్లు, మొత్తంగా 15 ఏళ్ల సర్వీసు పూర్తయి ఉండాలని, రిటైర్డ్ అధికారులైతే 62 ఏళ్లు దాటకూడదని షరతు విధించింది. ఈ నిబంధనల ప్రకారం ఒక్కో డైరెక్టర్ పోస్టుకు 10 నుంచి 15 మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. సీఎండీ అధ్యక్షతన ఏర్పాటయ్యే ప్రత్యేక కమిటీ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక్కొక్క డైరెక్టర్ పోస్టుకు ముగ్గురిని ఎంపిక చేస్తారు. వీరి పేర్లను సీల్డ్‌కవర్‌లో సంబంధిత మంత్రితో పాటు సీఎం దృష్టికి పంపిస్తే ముగ్గురిలో ఒక్కరిని ఖరారు చేసి ఎన్పీడీసీఎల్‌కు సమాచారం ఇస్తారు. కంపెనీ డైరెక్టర్ పేరును ప్రకటించి ఆఫర్ లేఖను మంజూరు చేస్తుందని ఎన్పీడీసీఎల్ సీనియర్ అధికారులు చెబుతున్నారు.

కాగా, డైరెక్టర్ పోస్టులను చేజిక్కించుకునేందుకు ఇప్పటికే పలువురు పావులు కదుపుతున్నారు. సంబంధిత మంత్రిని ప్రసన్నం చేసుకునేందుకు కాంగ్రెస్ నేతలతో పాటు సన్నిహితులతో పైరవీలు చేస్తున్నారు. ఇదిలా వుండగా, ఎలక్షన్ కోడ్ రాకముందే నోటిఫికేషన్ జారీ, దరఖాస్తుల ప్రక్రియ ముగిసినందున నియామకాలకు ఎలాంటి అడ్డంకి రాదని పలువురు అభిప్రాయ పడుతు న్నారు. ఒక వేళ అడ్డంకిగా మారితే నియామకానికి అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది.

చెక్‌పోస్టును సందర్శించిన సెంట్రల్ జోన్ డీసీపీ

కాజీపేట, మార్చి 19: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా కాజీపేట డీజిల్‌కాలనీ వద్ద మంగళవారం చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద ప్రత్యేక పోలీసు బలగాలు వాహనాలు తనిఖీ చేశారు. అనుమానం ఉన్న వారిని అదుపులోకి తీసుకుని వివరాలు సేకరించి వదిలి పెట్టారు. ఈ చెక్‌పోస్టును వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారీ మంగళవారం సందర్శించారు. ఎన్నికల దృష్ట్యా వాహనాల ద్వారా డబ్బులు తరలించే అవకాశం ఉన్నందున పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించినట్లు తెలిసింది.



చెక్‌పోస్టు సందర్శించిన డీసీపీ

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 19: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి మంగళవారం తనిఖీ చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన ఈవీఎంలను, వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించిన కలెక్టర్ ఈవీఎంల కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్ల గురించి రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. తనిఖీల అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో సీల్ వేశారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవోలు వెంకటేష్, నారాయణ, తహసీల్దార్లు విజయ్ కుమార్, భాస్కర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు శ్యాంసుందర్, నేహాల్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



స్ట్రాంగ్‌రూమ్‌లో ఉన్న ఈవీఎం మిషన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కేయూ రిజిస్ట్రార్‌తో అధ్యాపకుల వాగ్వాదం

▸▸ తమ కోర్టు కేసులును తొలగించాలని డిమాండ్

కేయూ క్యాంపస్, మార్చి 19: కాకతీయ యూనివర్సిటీలో మంగళవారం 2010 బ్యాచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు నిరసన ఆందోళనకు దిగారు. తమ కోర్టు కేసుల నేపథ్యంలో తమను వర్సిటీ అధికారులు పట్టించుకుని తమకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఏళ్లనుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా విధులు నిర్వహిస్తున్న తమను అర్ధాంతరంగా కోర్టు కేసుల బూచి చూపి ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన ఆందోళన కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ తాడూరి శాస్త్రి, డాక్టర్ పొడేటి శ్రీనివాస్, డాక్టర్ ముంజం శ్రీనివాస్, డాక్టర్ రమేశ్, డాక్టర్ మమత, డాక్టర్ రమ, డాక్టర్ సుజాత, డాక్టర్ సయోధ, అసిస్టెంట్ రిజిస్ట్రార్ పెండ్లి అశోక్‌బాబు తదితరులు ఉన్నారు.



రిజిస్ట్రార్‌తో వాగ్వివాదం చేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు

మెట్టుగుట్టపై ఘనంగా మూల మంత్రహోమం

మడికొండ, మార్చి 19: మడికొండలోని మెట్టుగుట్టపై గల హరిహర క్షేత్రంలో శ్రీరాముడి జన్మనక్షత్రం పునర్వసు సందర్భంగా సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈవో శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్ ఆధ్వర్యంలో సీతారామచంద్రస్వామివారికి పంచామృతాలతో సర్వాంగాభిషేకం చేశారు. అనంతరం యాగశాలలో శ్రీరామ మూలమంత్రహోమం నిర్వహించారు. శివాలయంలో మెట్టురామలింగేశ్వరస్వామి వారలకు ప్రాతఃకాల రుద్రాభిషేకం జరిపి భక్తులకు దర్శనం కల్పించారు. ఈవో, చైర్మన్ ఆధ్వర్యంలో జరిగిన పూజలలో అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనాచార్యులు, పారుపెల్లి సత్యనారాయణ శర్మ, ధర్మకర్తలు భైరి రాజుగౌడ్, రొడ్డ దయాకర్, వస్కుల ఉమ, దండిగం శ్రీనివాస్, బోగి కేదారి, మాడిశెట్టి జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది రామక్రిష్ణ, భాస్కర్, రణధీర్, అనిల్, కుమార్, సురేష్, రాజేశ్వరి, వెంకటలక్ష్మి, భక్తులు పాల్గొన్నారు.



విద్య, ఆరోగ్యమే లక్ష్యంగా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడ కార్యక్రమం

వెయ్యి దినాల ప్రాముఖ్యతపై కేంద్రాల్లో అవగాహన

గర్భిణులు, బాలింతలతో పాటు కుటుంబ సభ్యులకు సైతం..

హనుమకొండ సిటీ, మార్చి 19: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో 'పోషన్ పక్వాడ'-2024 కార్యక్రమాన్ని చేపట్టింది. గర్భిణులు, బాలింతలు, 0-6 యేళ్ల మధ్య పిల్లలకు పౌష్టికాహార ప్రాముఖ్యతను విశదీకరించడం కార్యక్రమ లక్ష్యం. 'పౌష్టికాహారం- విద్య' థీమ్‌తో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా హనుమకొండ జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కాజీపేట, ఐనవోలు, ధర్మసాగర్, వేలేరు, హనుమకొండ మండలాల పరిధిలోని ప్రాజెక్టుల్లో కార్యక్రమాలు చేపడుతున్నారు. ఐసీడీ ఎస్ అధికారులు, సిబ్బంది, అంగన్ వాడీ టీచర్లు, ఆయాలు కేంద్రాల్లోనే కాక వివిధ మార్గాల ద్వారా గర్భిణులు, బాలింతలు, 0-6 యేళ్ల వయసు మధ్య పిల్లలకు పౌష్టికాహారం, విద్యపై అవగాహన కల్పిస్తున్నారు.

పోషణ పక్షం లక్ష్యాలు

పోషణ్ భీ-పడాయి భీ (పౌష్టికాహారం - విద్య) సూత్రంతో చేపట్టిన పోషణ పక్షం కార్యక్రమంలో ఆయా మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన బాలింతలు, గర్భిణులు, ప్రీస్కూల్ పిల్లలకు బలమైన పౌష్టికాహారం తీసుకోవాల్సిన విధానాలను దృశ్య రూపకంగా, మౌఖిక వివరణతో వివిధ మార్గాల్లో అవగాహన కల్పిస్తున్నారు.

వేయి దినాల ప్రాముఖ్యత

తల్లితోపాటు శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా జీవించేందుకు 'వేయి దినాల' ప్రణాళిక ప్రాముఖ్యత విశిష్టతను అంగన్‌వాడీ కేంద్రాల్లో తెలియచేస్తున్నారు. గర్భధారణ నుంచి ప్రసవం దాక.. గర్భిణీకి తొమ్మిది నెలల సమయం పడుతుంది. ఈ కాలాన్ని 270 రోజు లుగా లెక్క కడతారు. ఈ సమ యంలో గర్భిణీ తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పౌష్టికాహారం అంశాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో వివరిస్తూ ఆ మేర కు వారికి పౌష్టికాహారాన్ని అంది స్తున్నారు. ఇక ప్రసవం తరువాత తల్లి ఆరోగ్యంతో పాటు శిశువు ఆరోగ్య పరిరక్షణ చర్యలను పోషణ పక్షం కార్యక్రమంలో వివరిస్తున్నారు. శిశువు జననం నుంచి ముర్రుపాలు పట్టించడం, ఆపై రెండేళ్ల వయస్సు వరకు తల్లిపాల శ్రేష్ఠత ఆరోగ్యం అంశాలను తల్లితో పాటు భర్త, ఇతర కుటుంబ సభ్యులకు సైతం అవగాహన కల్పించే చర్యలను చేపడుతున్నారు. శిశువు రెండేళ్ల వయస్సు కాలాన్ని మొత్తం 730 రోజులుగా లెక్క కడుతున్నారు. ఈ క్రమంలో గర్భిణీ నుంచి ప్రసవం వరకు తల్లి ఆరోగ్యం కోసం 270 రోజులు, శిశువు రెండేళ్ల వయస్సు లెక్కన 730 రోజులు ఈ రెండింటినీ కలిపితే వేయి రోజుల ప్రణాళికతో తల్లి, బిడ్డ ఆరోగ్య పరిరక్షణ కాలంగా పరిగణించి ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. వేయి దినాల ప్రత్యేకతను అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కాక ఆయా గ్రామాలు, మండలాల ప్రధాన కేంద్రాల్లో దృశ్య శ్రవణ మార్గాలు, పోస్టర్లు, కరప త్రాలు, ఇంటింటి సందర్శన తదితర మార్గాల ద్వారా ఐసీడీఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్లు అవగా హన కల్పిస్తున్నారు.

ఆరోగ్యం, విద్యకు ప్రాముఖ్యత

'పోషణ్ భీ-పడాయి భీ' (ఆరోగ్యంతో పాటు విద్య కూడా..) సూత్రంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ దశలో శిశువులకు విద్యపై అవగాహన కల్పించేలా అంగన్‌వాడీ టీచర్లు కృషి చేస్తున్నారు. చిన్నారులకు అర్థమయ్యేలా ఆట వస్తువులు, బొమ్మలు ఇతరత్రా మార్గాల ద్వారా వారికి విద్యపై ఆసక్తి కలిగే లా చర్యలు తీసుకుంటున్నారు. చిరు ప్రాయంలోనే పిల్లలకు విద్యపై ఆసక్తి కల్పించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

23వ తేదీతో ముగింపు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 9 నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్షం కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐసీ డీఎస్ అధికారులు చేపట్టారు. ఈ మేరకు హనుమ కొండ జిల్లాలోని మండలాల్లో కార్యక్రమ నిర్వహణ జరుగుతోంది. మార్చి 23న కార్యక్రమం ముగుస్తుంది. మొత్తంగా 15 రోజుల పాటు సాగే పోషణ పక్షం కార్యక్రమంలో తల్లి, శిశువు ఆరోగ్యం మాత్రమే కాకుండా విద్య ప్రాముఖ్యత వివరణ జరుగుతోంది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

కాజీపేట టౌన్, మార్చి 19 : కాజీపేట 61వ డివిజన్‌లోని చైతన్యపురిలో గల వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకలను మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కల్యాణోత్సవ వేడుకల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. రుత్వికుల వేదమంత్రోచ్చరణల మధ్య కొనసాగిన కల్యాణోత్సవాన్ని భక్తులు ఆద్యంతం తిలకించి తన్మయత్వం పొందారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం సీతారామచంద్రస్వామికి అభిషేకం చేశారు. బాలభోగం, హోమం, బలిహరణం, పూలంగి సేవ వంటి ప్రత్యేక పూజలు కొనసాగాయి. అనంతరం మహా అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో భాగంగా ఈ నెల 20వ తేదీ బుధవారం సాయంత్రం 7 గంటలకు గరుడ సేవ, గ్రామోత్సవం ఉంటుందని ఆలయ నిర్వాహక కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులైన పంజాల అశోక్‌కుమార్, మేజర్ వడ్డెపల్లి నరేందర్‌లు తెలిపారు.

రెండోరోజూ 'పది' పరీక్షలు ప్రశాంతం

5వ పేజీ తరువాయి

మొత్తం 9,439 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 9,420 మం ది హాజరయ్యారు. హనుమకొండ జిల్లా పరిధిలో 11,985 మందికి గాను 11,971 మంది హాజరు కాగా 14 మంది గైర్హాజరయ్యారు. వరంగల్‌లోని ప్లాటినం జూబ్లీ పరీక్ష కేంద్రాన్ని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సందర్శించగా, డీఈవో వాసంతి 5 కేంద్రాలను సందర్శించారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 46 కేంద్రాలను తనిఖీలు చేశాయి. హనుమకొండలో కలెక్టర్ సిక్తా పట్నాయక్ బాసిత్ ప్రభుత్వ పాఠశాలలోని కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. విద్యార్థులు అసౌకర్యానికి గురికాకుండా వసతులు కల్పించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మర్కజీ పాఠశాలలోని పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్ష సమయంలో పటిష్టమైన బందోబస్తు నిర్వహించాలని అక్కడున్న పోలీసులకు ఆయన సూచించారు. ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా నగరంలోని మూడు కేంద్రాలను సందర్శించారు. డీఈవో డాక్టర్ అబ్దుల్‌హై, ఏసీజీఈ డి.చలపతిరావు కలిసి 10 కేంద్రాలను సందర్శించగా, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 28 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

నాయిని సమక్షంలో కాంగ్రెస్‌లో చేరికలు



కండువాలతో పార్టీలోకి ఆహ్వానిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, మార్చి 19: వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. మంగళవారం హనుమకొండలోని విశాల్ భవన్‌లో తాళ్లపల్లి రవీందర్ ఆధ్వర్యంలో చేరికల కార్యక్రమం జరిగింది. వంద మందికి పైగా కాంగ్రెస్‌లో చేరిన వారిని పార్టీ కండువాలతో రాజేందర్‌రెడ్డి ఆహ్వానించారు. ఈసందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్ పట్ల శ్రేణుల్లో విముఖత ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజాదరణ పొందడంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీని వీడుతున్నారని పేర్కొన్నారు.

కోరుకొండపల్లి వద్ద రూ.1.60 లక్షల పట్టివేత

కేసముద్రం, మార్చి19: మహబూబాబాద్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన కేసముద్రం మండలం కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద మంగళవారం సా యంత్రం రూ.1.60 లక్షలను పట్టుకున్నట్లు ఎస్ఐ వంశీధర్ తెలిపారు. హనుమ కొండ న్యూశాయంపేటకు చెందిన ఆనందపు శ్రీతన్ అనే వ్యక్తి ఈ నగదును ఎలాంటి రశీదులు లేకుండా తరలిస్తుండగా సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.


కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు



కాంగ్రెస్‌లో చేరిన నేతలతో ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

వడ్డెపల్లి, మార్చి 19: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు సమక్షంలో గ్రేటర్ వరంగల్ 56వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ తీర్థాన్ని పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కలిసి కట్టుగా అందరూ కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నేత, గౌడ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింత రమేష్‌గౌడ్, 56వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రుద్రోజు మణింద్రనాథ్, బీఆర్ఎస్ డివిజన్ నేతలు ఎస్‌కే సిరాజ్, చిలువేరు శ్యామ్ బాబు, లావుడ్య శ్రీను నాయక్, గడ్డం రఘుపతి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో 56వ డివిజన్ కాంగ్రెస్ నేతలు కొంక హరిబాబు, దూలం సదానందం గౌడ్, జనుప సారంగపాణి, భూక్య విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



కమిషనర్ అతిథి గృహానికి పాత కమిషనర్ పేరుతో ఉన్న బోర్డు

బోర్డుపై పేరు మారలే..

▸▸ కొత్త కమిషనర్ నివాసం వద్ద పాత బోర్డు

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థకు కొత్త కమిషనర్ వచ్చినా అధికారులు మాత్రం ఇంకా బోర్డులు మార్చలేదు. కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పేరును రాయడంలో కిందిస్థాయి అధికారులు అలసత్వం వహిస్తున్నారు. హనుమకొండ బాలసముద్రంలో కమిషనర్ అతిథి గృహం ప్రధాన ద్వారానికి పాత కమిషనర్ రిజ్వాన్ బాషా షేక్ అనే పేరుతో ఉన్న గుర్తింపు ప్లేట్లను అధికారులు ఇంకా తొలగించలేదు.

దివ్యాంగులు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

▸▸ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్వని తానాజీ వాకడే

▸▸ ఐఎంఏ హాలులో అవగాహన కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: గ్రేటర్ పరిధిలో నివసిస్తున్న దివ్యాంగులు ఓటు హక్కును విధిగా సద్వినియోగం చేసుకోవాలని లోక్‌సభ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సూచించారు. మంగళవారం వరంగల్ ఐఎంఏ హాలులో దివ్యాంగులు, సీనియర్ సిటిజన్‌లకు ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కమిషనర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికలలో దివ్యాంగులు సౌకర్యార్థం ర్యాంపులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక క్యూలైన్‌లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. వరంగల్ తూర్పు నియోజక వర్గంలో 12 వేల మంది దివ్యాంగ ఓటర్లు ఉన్నారని, ప్రతీ ఒక్కరు ఓటు హక్కును బాధ్యతగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఫామ్-8 సమర్పణ ద్వారా పీడబ్ల్యూడీ మార్కింగ్ ఇవ్వాలని అన్నారు. దివ్యాంగులు 12 (డి) ఫామ్‌ను నింపి సమర్పిస్తే ఇంటి వద్ద నుంచి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన ఓటర్లతో ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, టీపీఆర్‌వో రాజేశ్‌కుమార్, తహసీల్దార్ ఇక్బాల్, టీఎం సి.రమేష్, దివ్యాంగ సంఘం నాయకులు బండి రాజేందర్, చక్రపాణి, వాణి, సీవోలు పాల్గొన్నారు.

నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించండి?

త్వరలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వరించాలని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. మంగళవారం వరంగల్ తసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులతో మాట్లాడారు. వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉందని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తే వారిని గుర్తించి విచారణ అనంతరం నోడల్ అధికారులు కేసులు నమోదు చేయాలని అన్నారు. వాహనదారుల వద్ద రూ.50 వేలకు మించి డబ్బులు ఉండే సీజ్ చేయాలని, పంచనామా అనంతరం పూర్తి సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు తెలియచేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, సిటి ప్లానర్ వెంకన్న, కుడా సీపీవో అజీత్‌రెడ్డి, ఏఈలు ప్రవీణ్‌చంద్ర, కృష్ణారావు, కుడా సెక్రెటరి మురళీధర్‌రావు, ఏసీపీ నందిరాంనాయక్, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో రమేష్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ అశ్వని తానాజీ వాకడే

డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయండి

గ్రేటర్ పరిధిలో నివసిస్తున్న వృద్ధులకు డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. సిటిజన్ అసోసియేషన్, ఓరుగల్లు వినియోగదారుల రక్షణ సమితి ఆధ్వర్యంలో కమిషనర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. నగరంలో ప్లాస్టిక్ కవర్ల వినియోగం ఎక్కువైందని, వాటిని నియంత్రించాలని కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీనియర్ సిటిజన్లు నర్సయ్య, యుగేందర్, సత్యనారాయణ, సాంబయ్య, రవీందర్ గౌడ్, జార్జీలు ఉన్నారు.

ప్రజలకు సేవ చేయడమే రోటరీ లక్ష్యం

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 19: ప్రజలకు సేవ చేయడమే రోటరీ క్లబ్ లక్ష్యమని జిల్లా 3150 గవర్నర్ బుసిరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ హనుమకొండ ఆధ్వర్యంలో సీకేఎం ప్రసూతి వైద్యశాలకు మంగళవారం 6వీల్ చైర్స్, 6 స్ట్రెచర్స్ వంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు ఆస్పత్రికి వచ్చినప్పుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా వీల్‌చైర్స్, స్ట్రెచర్స్ వారికి ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. అన్నం రవీంద్రనాద్ మాట్లాడుతూ.. ఆస్పత్రికి వీల్‌చైర్స్ అవసరం ఉందని సభ్యులకు చెప్పగానే వెంటనే వారిలో కొంతమంది స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీకేఎం ఆస్పత్రి సూపరింటెండెంట్ నిర్మల, రోటరీ క్లబ్ ప్రతినిధులు కేవీఎస్ శిరీష్ కుమార్, గంగోజుల నరేష్, మనోహర్ రెడ్డి, రాజిరెడ్డి, రాంరెడ్డి, సతీష్, విజయ్, రవీందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, ప్రవీణ్ రావు, శ్రవణ్, మంజుల, బిందు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



వీల్‌చైర్లతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

మల్లు స్వరాజ్యానికి ఘన నివాళి

వరంగల్ కార్పొరేషన్, మార్చి 19: వర్గ పోరాటాలను ముందుకు తీసుకుపోవడంలో మల్లు స్వరాజ్యం పాత్ర గొప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం జిల్లా కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బొట్ల చక్రపాణితో పాటు జిల్లా నాయకులు పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడారు. నాటి నైజాం నవాబు దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి కార్మిక, కర్షకులను ఏకం చేసి పోరాటం చేసి మల్లు స్వరాజ్యం వీరత్వం మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వాసుదేవరెడ్డి, ఉప్పలయ్య, వెంకట్, వీరన్న, సంపత్, భానునాయక్, వెంకటయ్య, రవి, రాజు, లింగమూర్తి పాల్గొన్నారు.



సీపీఎం కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఐనవోలు, మార్చి 19 : పశు వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచించారు. పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం మామునూరు సహకారంతో జాతీయ సేవా పథకంలో భాగంగా మండలంలోని వెంకటాపురం, పెరుమాండ్లగూడెం గ్రామాల్లో మంగళవారం పశువైద్య శిబిరాలను నిర్వహించారు. ఈ శిబిరంలో 40 పశువులకు గర్భకోశ సంబంధిత వ్యాధుల చికిత్స చేసి 310 పశువులకు నిర్ధారణ పరీక్షలు జరిపి మందులు అందజేశారు. సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ పాడిపశువులు, వ్యాధులు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పశువైద్య కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ విజయలక్ష్మి, ఉషారాణి, అమృత్‌కుమార్, సురేష్, సునిల్, రామేష్, శ్రీను, ప్రీతి, అనూష, తేజ, స్థానిక పశువైద్యులు వినయ్, విక్రమ్, పార్థసారిధి, 39మంది పశువైద్య కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

పోలీసుల కవాతు

ధర్మసాగర్.మార్చి 19: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు సీఐ మహేందర్, ఎస్ఐ హరిత ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో స్థానిక పోలీసులు మంగళవారం కవాతు నిర్వహించారు. ధర్మసాగర్, ముప్పారం, నారాయణగిరి, వేలేరు మండలం చింతలతండా, ఎర్రబెల్లి గ్రామాలలోని వాడవాడలా పోలీసులచే కవాతు చేశారు. ఈ సందర్భంగా సీఐ మహేందర్ మాట్లాడుతూ.. ధర్మసాగర్, వేలేరు మండలంలోని ప్రజలు తమ ఓటు హక్కును సంక్రమంగా వినియోగించుకోవాలని, ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి గొడవలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.



కేంద్ర బలగాలతో కవాత్తు నిర్వహిస్తున్న పోలీసులు

చిరుధాన్యాల్లో పోషక విలువలు

కాళోజీ జంక్షన్, మార్చి 19: చిరు ధాన్యాలతో చేసిన వంటకాల్లో పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు సరైన పోషకాహారం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కవిత అన్నారు. హనుమకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని హౌసింగ్ బోర్డు అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన పోషణ పక్వాడా కార్యక్రమానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె చిరు ధాన్యాల వినియోగంపై అవగాహన కల్పించారు. బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంపై ఆమె తల్లులకు దిశా నిర్దేశం చేశారు. చిరు ధాన్యాలతో పాటు ఆకు కూరలు వివిధ రకాల కూరగాయలు, పండ్లు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆమె వివరించారు. జిల్లా మహిళా సాధికారత కేంద్రం సభ్యురాలు స్వర్ణలత లింగ వివక్షత గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సరస్వతి, రమ, సఖీ సెంటర్ కేసు వర్కర్ వినీలా, అంగన్‌వాడీ హెల్పర్లు పాల్గొన్నారు.

ఫ్యాషన్

లవ్లీ లాంగ్ గౌన్స్

ఈవినింగ్ పార్టీల్లో వెలిగిపోవాలంటే, ఆకర్షణీయమైన ఈవినింగ్ గౌన్స్ ధరించాలి. శాటిన్, నెటెడ్, సెక్విన్, ఎంబ్రాయిడరీ.... ఇలా లాంగ్ గౌన్స్‌లో బోలెడన్ని వెరైటీలు. వాటిలో నప్పే గౌన్ ఎంచుకుంటే లవ్లీ లేడీ మీరే కావచ్చు!



శాటిన్ గౌన్

సింపుల్‌గా, ఎలిగెంట్‌గా కనిపించాలనుకుంటే శాటిన్ మేడ్ లాంగ్ గౌన్ ధరించాలి. పార్టీలకు నప్పే ఈ గౌన్ బరువు కూడా చాలా తక్కువ. కాబట్టి వేడుకల్లో హుషారుగా పాల్గొనాలనుకుంటే, శాటిన్ గౌన్ బెస్ట్ ఆప్షన్!

బుట్ట బొమ్మల్లా

నడుము కింద నుంచి వెడల్పుగా విస్తరించినట్టు కనిపించే గౌన్‌లో కూడా దేవకన్యలా వెలిగిపోవచ్చు. ఇందుకోసం గౌన్‌లో ఎక్కువ లేయర్లు ఉండేలా చూసుకోవాలి. అలాగని గౌన్ అసౌకర్యంగా, బరువుగా ఉండకూడదు. చూడడానికి భారీగా కనిపించినా, ధరించడానికి తేలికగా ఉండాలి.

లేయర్ లాంగ్ గౌన్

నిలువుగా ఒకే పొడవుతో ఉండే గౌన్ బోరు కొట్టిందా! అయితే అలలుఅలలుగా ఎగసిపడే లేయర్ గౌన్ ఎంచుకోండి. ఛాతీ దగ్గర సెక్విన్ వర్క్‌తో, నడుము కింద నుంచి ప్లెయిన్‌గా ఉండే లేయర్ లాంగ్ గౌన్ నాజూకుగా కనిపించేలా చేస్తుంది. ఈ డ్రెస్‌తోపాటు, మెడలో చోకర్, చెవులకు స్టడ్స్ జోడిస్తే అలంకరణ పూర్తయినట్టే.

సెలబ్ ఫిట్

బడి రోజుల్లో ఐఏఎస్ అధికారి కావాలనుకుంది. ఇరవయ్యేళ్లు వచ్చేసరికి నటించాలనే ఆసక్తి కలిగింది. ఆ కోరిక బలపడి... అవకాశాలు వెతుక్కొంటూ ముంబయి చేరింది. మోడల్‌గా మొదలుపెట్టి... విభిన్న చిత్రాలతో అలరిస్తూ... మంచి నటిగా ఎదిగిన యామీ గౌతమ్ జీవితంలో పెద్దగా మలుపులేమీ లేవు. కానీ అనుకున్నది సాధించాలన్న పట్టుదల, అంకితభావం కనిపిస్తాయి. అలరించే పాత్రలతోనే కా దు... అద్భుతమైన శరీరాకృతితోనూ అలరిస్తున్న నటి యామీ.

ఆరోగ్యమే అందం... ఆనందం

ప్రతిభ ఉంటే అవకాశాలకు కొదవలేదని నిరూపించిన నటి యామీ గౌతమ్. ఆరంభం నుంచే మూస పాత్రల్లో ఒదిగిపోకుండా... విభిన్న కథాంశాలను ఎంచుకొంటూ... తనకంటూ ఒక ప్రత్యేకమైన కెరీర్‌ను నిర్మించుకుంది. హిమాచల్ ప్రదేశ్‌లోని బిలాస్‌పూర్‌కు చెందిన ఆమె... పెరిగింది చండీగఢ్‌లో. ఆమె తండ్రి ముఖేష్ గౌతమ్ పంజాబీ సినీ పరిశ్రమలో దర్శకుడు. తల్లి అంజలి గృహిణి. యామీకి చెల్లి సురిలీ గౌతమ్, తమ్ముడు ఓజాస్ గౌతమ్ ఉన్నారు. సురిలీ కూడా నటి. పంజాబీ సినిమాతో కెరీర్ ప్రారంభించింది. నాన్న దర్శకుడే అయినా... చిన్నప్పుడు ఆ రంగం వైపు వెళ్లాలని యామీ ఏ రోజూ అనుకోలేదు. సివిల్ సర్వీసెస్ రాసి ఐఏఎస్ అధికారి కావాలని కలలు కన్నది. న్యాయవాద వృత్తిమీద ఆసక్తితో 'లా'లో చేరింది. లా చదువుతుండగా ఆమె మనసు నటన వైపు మళ్లింది.

ఎప్పుడైతే నటి కావాలనే కోరిక మదిలో నాటుకుందో... ఆ దిశగా అప్పుడే ఆమె ప్రయత్నం మొదలైంది. చదువు మధ్యలోనే ఆపేసి... ముంబయికి వెళ్లిపోయింది. సినిమాల్లో అవకాశాలు దక్కించుకోవాలన్నది ఆమె ప్రధాన లక్ష్యం. మోడల్‌గా ముంబయిలో ప్రయాణం మొదలుపెట్టిన యామీ తొలిసారి తెరపై కనిపించింది... టీవీ సీరియల్‌లో. 2008లో ప్రసారమైన 'చాంద్ కే పార్ చలో'లో ప్రధాన పాత్ర పోషించిన ఆమె... తరువాత మరో అయిదు హిందీ ధారావాహికల్లో నటించింది. 'యే ప్యార్ న హోగా కామ్' సీరియల్ ఆమెకు మంచి పేరు తీసుకువచ్చింది.

బుల్లి తెరపై యామీ అందం, అభినయం చూసిన కన్నడ దర్శకుడు దేవరాజ్ పాలన్ 'ఉల్లాస ఉత్సాహ'లో ఆమెకు అవకాశం ఇచ్చారు. 2010లో విడుదలైన ఆ చిత్రంతో తొలిసారి వెండి తెరపై మెరిసింది యామీ. ఆ మరుసటి ఏడాది తెలుగు చిత్రం 'నువ్విలా'లో నటించింది. అందులో యామీతో పాటు ఆరుగురు కొత్త ముఖాలను దర్శకుడు రవిబాబు తెరకు పరిచయం చేశారు. వారిలో హీరో విజయ్ దేవరకొండ ఒకరు. 'విక్కీ డోనార్'తో బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన యామీ గౌతమ్... దక్షిణాది భాషల్లో కూడా నటిస్తూ వచ్చింది. తెలుగులో 'గౌరవం, యుద్ధం, కొరియర్‌బాయ్ కల్యాణ్' చిత్రాలు చేసింది. పరిశ్రమలోకి వచ్చిన పద్నాలుగేళ్లలో దాదాపు ముప్పై చిత్రాల్లో నటించిన యామీ కెరీర్‌ను మలుపు తిప్పింది మాత్రం 2018లో విడుదలైన 'ఉరీ: ది సర్జికల్ స్ట్రయిక్'. అందులోని అద్భుతమైన నటనకు ప్రశంసలు, అవార్డులు అందుకుంది. గత నెలలో వచ్చిన 'ఆర్టికల్ 370'లో జూనీ హస్కర్‌గా యామీ అభినయం మరో స్థాయిలో ఉంది.

'సనమ్ రే' షూటింగ్‌లో భాగంగా సహ నటుడు పులకిత్ సామ్రాట్‌తో మూడేళ్ల సహజీవనం చేసిన యామీ... 2018లో అతడికి బ్రేకప్ చెప్పేసింది. 2021లో 'ఉరీ' దర్శకుడు, గీత రచయిత ఆదిత్య ధార్‌ను పెళ్లి చేసుకుంది. 'నా వైవాహిక జీవితం ఎంతో ఆహ్లాదంగా, ఆనందంగా సాగుతోంది. వృత్తిగత, వ్యక్తిగత జీవితాన్ని బ్యాలెన్స్ చేసుకోవడానికి నాకు మావారు ఆదిత్య మద్దతు, ప్రోత్సాహం ఉన్నాయి. నా కుటుంబ సహకారం, అండ ఉన్నాయి' అంటూ 'ఆర్టికల్ 370' ప్రచార కార్యక్రమాల్లో భాగంగా యామీ చెప్పుకొచ్చింది. పెళ్లికి ముందు, ఆ తరువాత కూడా ఆమెలో అదే ఉత్సాహం, అంకితభావం. తన వృత్తిపట్లే కాదు... తన శరీరం గురించి శ్రద్ధ తీసుకోవడంలోనూ ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది ఆమె. ఎందుకంటే... 'ఆరోగ్యంగా ఉంటేనే అందం, ఆనందం' అంటుంది యామీ.



ఇదీ మెనూ...

'పిజ్జాలు, బర్గర్లు వంటి జంక్ ఫుడ్‌కు నేను దూరం. సాధ్యమైనంతవరకు ఇంటి వంటకే ప్రాధాన్యం ఇస్తాను. శరీరం డీహైడ్రేట్ అవ్వకుండా తరచూ నీళ్లు తాగుతా. కొబ్బరి నీళ్లు, ఇతర పండ్ల రసాలు తీసుకొంటా. అలాగే నా డైట్‌లో కూడా పుచ్చకాయ లాంటి నీటి ఆధారిత పండ్లు ఉండేలా చూసుకొంటా' అంటున్న యామీకి స్వీట్స్ ఇష్టమైన వంటకం. కుదిరినప్పుడల్లా నోరు తీపి చేసుకొంటుంది.

- బ్రేక్‌ఫాస్ట్‌లో ఎగ్ వైట్, ఫ్రూట్ స్మూతీస్, మిల్క్ షేక్స్, బాదంతో కూడిన పూర్తి స్థాయి పోషకాహారం.
- మధ్యాహ్న భోజనానికి ముందు బౌల్ నిండా పండ్ల ముక్కలు, నట్స్.
- లంచ్‌కు పప్పు లేదా చికెన్ కర్రీ, పెరుగుతో చపాతీ, అన్నం, వెజిటబుల్ సలాడ్.
- రాత్రి భోజనంలో బ్రౌన్ బ్రెడ్‌తో వెజిటబుల్ శాండ్‌విచ్, గ్రిల్డ్ చికెన్.

డైట్ పేరుతో కడుపును ఆకలితో ఉంచడం యామీకి నచ్చదు. అలా చేస్తే ఆరోగ్యం దెబ్బ తింటుందనేది ఆమె అభిప్రాయం. ఆకలి వేసినప్పుడు తినడం, బరువు పెరిగినట్టు అనిపిస్తే జిమ్‌లో అదనపు గంటలు శ్రమించి, శరీరాన్ని అదుపులో పెట్టుకోవడం... ఇదే ఇన్నేళ్లుగా ఆమె అనుసరిస్తున్న విధానం.

వర్కవుట్ ఇలా...

నచ్చింది వెనకాడకుండా తినేస్తుంది యామీ. అయితే ఎంత తింటే అంత వ్యాయామం చేస్తుంది. జిమ్‌కు వెళ్లి ఎప్పటికప్పుడు అదనపు కేలరీలు కరిగిస్తుంది. రోజు విడిచి రోజు యోగా చేస్తుంది. తన మేని మెరుపులకు, మానసిక ప్రశాంతతకు, ఆశావహ దృక్పథానికి యోగానే కారణమని చెబుతోంది.

- ఉదయం లేవగానే ట్రెడ్‌మిల్‌పై జాగింగ్, రన్నింగ్‌తో కూడిన కార్డియో సెషన్.
- రోజూ వ్యాయామాలకు ముందు కనీసం ఇరవై నిమిషాలు జాగింగ్
- వెయిట్, స్ట్రెంత్ ట్రైనింగ్ సెషన్స్‌తో పాటు పిలెట్స్ తప్పనిసరి. పిలెట్స్ ఆమెకు ఇష్టమైన వ్యాయామం.
- వీటితోపాటు డ్యాన్స్‌ను తన వర్కవుట్‌లో భాగం చేసుకుంది యామీ. తరచూ ఒకే రకమైన వ్యాయామాల వల్ల ఆసక్తి తగ్గుతుంది. అందుకే రొటీన్‌కు భిన్నంగా కార్డియో సెషన్‌కు నాట్యాన్ని జోడించింది. ఇది తనకు మానసికంగా ఉల్లాసాన్ని ఇస్తుందని, తన సామర్థ్యాన్ని రెట్టింపు చేస్తుందనేది యామీ మాట.



మనలో చాలా మంది సముద్రతీరాలకు విహారయాత్రలకు వెళ్తూ ఉంటాం. సముద్ర అందాలను ఆస్వాదిస్తాం. కొద్ది కాలం గడపి వచ్చేస్తాం. సముద్రమనగానే మనకు అందమైన జ్ఞాపకాలే గుర్తుకొస్తాయి. కానీ తమిళనాడుకు చెందిన ఉమామణి ఏ విషయాన్నీ అంత త్వరగా మర్చిపోరు. పదేళ్ల క్రితం... 49 ఏళ్ల వయస్సులో సరదాగా చేసిన స్కూబా డైవింగ్ ఆమె జీవితాన్నే మార్చేసింది. ప్రస్తుతం ఆమె సముద్ర కాలుష్యాన్ని నివారించటానికి ఉద్యమం చేపట్టారు. తాజాగా ఆమెను సోని-బీబీసీ ఎర్త్... "ఎర్త్ ఛాంపియన్ ఆఫ్ ది మంత్"గా ప్రకటించాయి కూడా!


సముద్రాలకు ఛాంపియన్

న్యూస్‌మేకర్





"సముద్రం మొదట చాలా భయపెడుతుంది. కళ్ల ముందు అంతు లేని నీళ్లు కనిపిస్తుంటే కాళ్లలో వణుకుపుడుతుంది. పదేళ్ల క్రితం తొలి సారి స్కూబా డైవింగ్‌కు వెళ్లినప్పుడు నాలో అలాంటి భయమే కలిగింది. దూకండి.. దూకండి అని స్కూబా ట్రైనర్ అరుస్తున్నాడు. దూకనని మొరాయించాను. కానీ కళ్లు మూసుకొని ఒక్క సారి ఆలోచించా. భయపడి మానేస్తే- జీవితంలో అలాంటి అనుభవం మరో సారి దొరుకుతుందో.. లేదో అనుకున్నా. కళ్లు మూసుకొని దూకేసా! ఆ సమయంలో నా వయస్సు గుర్తుకురాలేదు. ఆ జంప్ నా జీవితాన్ని మార్చేసింది" అంటారామే! ఉమామణి పుట్టింది.. పెరిగింది చెన్నైలో. మద్రాసు యూనివర్సిటీలో సాహిత్యంలో మాస్టర్స్ చేశారు. ఆ తర్వాత ఒక డాక్టర్‌తో వివాహమయింది. భర్త వృత్తిరీత్యా 2004లో మాల్దీవులకు వెళ్లిపోయారు. "చిన్నప్పటి నుంచి నాకు పెయింటింగ్ అంటే ఇష్టం. అయితే ఒక మాస్టర్ వద్ద పెయింటింగ్ నేర్చుకోలేకపోయాను. ఆ నిరాశ నన్ను చాలా కాలం వెంటాడుతూ ఉండేది. పెళ్లి అయిన తర్వాత పెయింటింగ్‌ను కూడా వదిలేశాను. మంచి భార్యను అయితే చాలననుకున్నాను. మా పిల్లలకు చదువు చెబుతూ కాలం గడిపేదాన్ని. ఇలా కొద్ది కాలం గడిచింది. ఏదో చేయాలనే కోరిక మళ్లీ బలంగా నాలో కలిగింది. దీనితో పీహెచ్‌డీ చేయటం మొదలుపెట్టా. అంతే కాదు. 45 ఏట మళ్లీ పెయింటింగ్ మొదలుపెట్టా. అది నాకు పునర్జన్మ అని చెప్పాలి.." అంటారు ఉమామణి. ఆ సమయంలోనే ఆమె సముద్రగర్భంలోని కోరల్‌రీఫ్స్‌పై డాక్యుమెంటరీ చూశారు. అది ఆమెను ఆకర్షించింది. నెమ్మదిగా కోరల్ రీఫ్స్ పెయింటింగ్స్ వేయటం మొదలు పెట్టారు. ఎగ్జిబిషన్స్ కూడా నిర్వహించారు. అయితే ఉమామణి తన జీవితంలో ఎప్పుడూ కోరల్ రీఫ్స్‌ను చూడలేదు.



మలుపు తిప్పిన సంభాషణ...

ఒక రోజు ఉమామణి తన కజిన్‌తో మాట్లాడుతున్నప్పుడు సముద్ర కాలుష్యం వైపు సంభాషణ మళ్లింది. "నిజమైన కోరల్ రీఫ్స్‌ను ఎప్పుడైనా చూశావా? అని మా కజిన్ అడిగాడు. నువ్వు అందమైన పెయింటింగ్స్ వేస్తున్నావు. కానీ లోపలికి వెళ్లి చూడు. ఎంత కాలుష్యం ఉందో అర్థమవుతుంది" అన్నాడు. ఆ సంభాషణ నాలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. సముద్ర గర్భంలోకి వెళ్లి కోరల్ రీఫ్స్‌ను చూసి..వాటిని రక్షించటానికి ఏదైనా చేయాలనిపించింది. దీంతో ఆమె ఒక సారి సముద్రగర్భంలోకి వెళ్లి చూశారు. ఆ తర్వాత తాను కూడా స్కూబా డైవింగ్‌లో కోర్సు చేయాలని నిర్ణయించుకున్నారు. దానికి ఆమె కుటుంబం కూడా చాలా సహకరించింది. "మాకు పెళ్లి అయ్యి 25 ఏళ్లైన సందర్భంగా మా అబ్బాయి నాకు సర్టిఫికేషన్ కోర్సుకు అయ్యే ఖర్చును బహుమతిగా ఇస్తామనన్నాడు. వాడి మాటలు వింటే నాకు కళ్లంపట నీళ్లు తిరిగాయి. నాపై వాడికున్న ప్రేమ అర్థమయింది.." అంటారు ఉమామణి. ఆమెకు కోరల్ రీఫ్స్ పట్ల ఉన్న ప్రేమ పెరగటం మొదలుపెట్టింది. అదే సమయంలో వాటిని కాపాడటానికి ఏదో ఒకటి చేయాలనే సంకల్పం కూడా నెరవేరింది. "పదేళ్ల క్రితం తొలిసారి నేను కోరల్ రీఫ్స్‌ను చూశాను. ఆ తర్వాత అనేక సార్లు సముద్ర గర్భంలోకి వెళ్లాను. వెళ్లిన ప్రతి సారి - కాలుష్యం పెరిగిపోతూనే ఉంది. చాలా మందికి తెలియని విషయమేమిటంటే- మనకు ఆక్సిజన్ కావాలంటే సముద్రాలు కాలుష్యసారం కాకూడదు. కార్బన్ వాయువులను సముద్రాలు తమ ఒడిలో దాచుకుంటాయి. కానీ మనం సముద్ర గర్భాలను చెత్తను పడేసే బ్యాగ్‌ల వాడుతున్నాం" అంటారామే!

డాక్యుమెంటరీ...

కోరల్ రీఫ్స్ గురించి ఏదో చేయాలనే సంకల్పంతో ఉన్న ఉమామణికి ప్రియా తువాసరి పరిచయమయ్యారు. అప్పటికే ప్రియాకు మంచి డాక్యుమెంటరీ చిత్రాలు తీసే దర్శకురాలుగా పేరు ఉంది. ఉమామణి జీవితం ప్రియను బాగా ఆకర్షించింది.

కోరల్ రీఫ్స్ పరిరక్షణకు సంబంధించి- ఒక డాక్యుమెంటరీ తీయటానికి ఇద్దరు కలిపి ప్రయత్నం ప్రారంభించారు. ఇదే 2019లో - 'కోరల్ ఉమెన్'గా విడుదలయింది. దీనికి అనేక అవార్డులు లభించాయి. "మన దేశంలో కోరల్ రీఫ్స్ గురించి ఎక్కువగా మాట్లాడరు. అందువల్ల ఈ చిత్రం అనేక మందిని ఆకర్షించింది. అనేక అవార్డులు కూడా వచ్చాయి. అయితే ఇకపై నేను వేసే పెయింటింగ్‌లలో కోరల్‌రీఫ్స్ అందంగా కనబడవు. సముద్రం లోపల ఉన్న వాస్తవ చిత్రాన్ని అవి కళ్లకు కడతాయి" అంటారామే! ఉమామణి తన ఉద్యమాన్ని ప్రారంభించి- ఒక దశాబ్దమయింది. తన పెయింటింగ్ ఎగ్జిబిషన్స్ వల్ల ఎంతో కొంత అవగాహన పెరిగిందంటారామే! "ఒక గృహిణి నుంచి స్కూబా డ్రైవర్‌గా.. ఒక ఉద్యమకారిణిగా మారాను. సముద్రాలు తమ గురించి తాము చెప్పుకోలేవు. అందుకే నేను సముద్రాల గురించి బయట ప్రపంచానికి చెప్పుకోగలుగుతాను. అందరూ నాలాగే ఈ ప్రపంచానికి ఏదో ఒకటి చేయాలని సంకల్పిస్తే- అంత కన్నా గొప్ప విషయం ఏదీ ఉండదు" అంటారు ఉమామణి.

ఈమె పేరు... సరిత. కేరళ రాష్ట్రం. లాయర్ కావాలన్నది ఆమె ఆశయం. అయితే విధి ఆమెకు పెద్ద సవాలే విసిరింది. రైలు ప్రమాదంలో ఎడమ చేయి పోయింది. కానీ తన లక్ష్యం నుంచి ఆమె పక్కకు తప్పుకోలేదు. ఒంటిచేత్తోనే కష్టపడి... విజయాన్ని అందుకున్నారు.

స్ఫూర్తి



"త్రిశూర్ లా కాలేజీలో చదువుకుని.. మా ఊరు కొచ్చిన్‌కు వెళ్తున్నా. రైలు ఆగింది. డోర్ పక్కన నిలుచున్నా. వెనకాల నుంచి డోర్ వేగంగా నా మీదకు వచ్చింది. ఏం జరిగిందో తెలీలేదు. తలకు గాయమైంది. స్పైనల్ సమస్యతో పాటు ఎడమ చేయి మోచేతి దాకా.. కట్ అయిపోయింది. ఆ ఘోరమైన యాక్సిడెంట్ జరిగిందనే విషయం ఆసుపత్రిలో మెలకువ వచ్చాక తెలిసింది. ఏమీ చేయలేని పరిస్థితి. కొన్ని నెలల పాటు మంచానికి పరిమితమైంది. దీనికి ముందు నా జీవితం బావుండేది.

అలా చదువుకోవాలనే ఆశ...

మాది పేద కుటుంబం. అయినా చదువుకోవాలనే ఆశ ఉండేది.

విజయాన్ని ఒంటి చేత్తో అందుకుంది

దీంతో టీ షాప్‌లో పని చేశా. డబ్బు సరిపోకపోవటంతో కొరియర్ ఏజెంట్‌గా పని చేశా. డబ్బే లేని వ్యక్తి చదువులెందుకు అనవసరం అన్నట్టు కొందరు మాట్లాడేవారు. అవేమీ పట్టించుకునే దాన్ని కాదు. ఎందుకంటే మా నాన్నకి ఉద్యోగం లేదు. మా అమ్మ ఇద్దరు ఆడపిల్లలతో కష్టపడేది. కొందరి ఇళ్లలో పనిమనిషిగా చేసేది. దీంతో డిగ్రీ ముందు నుంచే అమ్మకు చేదోడు వాదోడుగా ఉండేదాన్ని. డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేశా. ఆ క్రమంలో 2001లో టైపిస్ట్‌గా ఓ లాయర్ దగ్గర ఉద్యోగం దొరికింది. టైప్ రాకున్నా.. నేర్చుకుని అక్కడ జాయినయ్యా. ఆ సమయంలో చదువుకోవాలనే ఆశ పుట్టింది. ఆ బర్నింగ్ డిజైర్ వల్లనే సాయంత్రం పూట లాకోర్సులో జాయినయ్యా.

అంతా బావుందనుకుంటే...

టైపిస్ట్‌గా పని చేసేప్పుడే చదువుకుని ఎంట్రన్స్ ఎగ్జామ్ రాశా. కొజికోడే పట్టణంలోని గవర్నమెంట్ లా కాలేజ్‌లో సీట్ వచ్చింది. ఎగిరి గంతేశా. అయితే ఉద్యోగం వదిలేస్తే పూట గడవని పరిస్థితి కాబట్టి కాలేజీలో చేరలేకపోయా. అయితే మళ్లీ 2020లో ఎంట్రన్స్ రాస్తే.. త్రిశూర్ లా కాలేజీలో సీట్ వచ్చింది. జాబ్ వదిలేయకుండానే చదువుకునే అవకాశం ఉండటంతో రోజూ కాలేజీకి రైల్‌లో వెళ్లి వచ్చేదాన్ని. అలాంటి సమయంలో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగాక.. నాకు పర్లేదు అనుకున్నప్పుడు.. మా నాన్న క్యాన్సర్‌తో చనిపోయారు. 2022 సమయంలో మా ఆఫీసులోని కొందరు స్టాఫ్ నాకు అండగా నిలిచారు. ఆర్థికంగా సాయపడ్డారు. దీంతో లా కోర్సు పూర్తి చేశా. గత వారంలోనే లాయర్‌గా ఎన్‌రోల్ అయ్యా.

అదే నా ఆశ...

టీషాప్‌లో పని చేసిన దాన్ని చదువుతానని అనుకోలేదు. చదివినా.. లాయర్ అవుతానని అస్సలు అనుకోలేదు. జీవితంలో ఏమేమో అనుకున్నా. అందుకు వ్యతిరేకంగా జరిగాయి. అయినా ముందుకెళ్లా. చివరికి లాయర్ అయ్యాను. ఈ సమాజానికి నా వంతు సేవ చేయాలన్నదే నా ఆశయం.

కూల్ కూల్ గ్లాసెస్

ఎండాకాలం వచ్చేస్తోంది. ఈ కాలంలో చలువ కళ్లద్దాలు పెట్టుకునే అలవాటు మీకుందా? అయితే మీ ముఖాకృతికి తగిన వాటిని ఎలా ఎంచుకోవాలో తెలుసుకోండి!

దీర్ఘవృత్తాకారం: మీ ముఖం ఈ ఆకృతిలో ఉంటే దీర్ఘచతురస్రాకారం, నలుచదరం లేదా ఏవియేటర్ మోడల్ కళ్లద్దాలు ఎంచుకోవాలి.

వృత్తాకారం: ఈ ముఖాకృతి కలిగి ఉంటే, దీర్ఘచతురస్రం, నలుచదరం లేదా వృత్తాకార గాగుల్స్ ఎంచుకోవాలి.

నలుచదరం: ఈ కోవకు చెందిన వారు బ్రోలీన్, క్యాట్ ఐ, రౌండ్ మోడళ్లు ఎంచుకోవాలి.

డైమండ్: ఈ షేప్ కలిగి ఉంటే, ఓవల్, రౌండ్ లేదా క్యాట్ ఐ చలువ జోళ్లు ఎంచుకోవాలి.

పియర్: ఈ షేప్ అయితే బ్రోలీన్, ఓవల్ లేదా ఏవియేటర్ బాగుంటాయి.

హార్ట్: దీర్ఘచతురస్రం, రౌండ్ లేదా జామెట్రిక్ షేప్‌లు బాగుంటాయి.



ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
బుధవారం • 20 మార్చి 2024
cinema@andhrajyothy.com

గ్లాస్ అంటే సైజు కాదు... సైన్యం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా రూపొందుతున్న మాసివ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా పవన్‌కల్యాణ్ నటిస్తున్నారు. 'భగత్ బ్లేజ్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను మంగళవారం విడుదల చేశారు. ఈ సినిమాలో పంచ్ డైలాగులు పవర్‌ఫుల్‌గా ఉన్నాయి.. తన రేంజ్‌ను విమర్శించే వారికి ఘాటుగా సమాధానం ఇస్తూ 'గాజు పగిలే కొద్దీ పదునెక్కుద్ది.. గ్లాస్ అంటే సైజు కాదు.. సైన్యం.. కనిపించని సైన్యం' అంటూ పవన్ కల్యాణ్ కౌంటర్ ఇవ్వడం గూస్ బంప్స్ తెప్పించింది. ఈ టీజర్‌లో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించారు. సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ ఆకట్టుకొనే బ్యాక్ గ్రౌండ్ స్కోర్‌తో పవన్‌కల్యాణ్ క్యారెక్టర్‌కు ఎలివేట్ చేశారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: అయనంక బోస్, స్ర్కీన్‌ప్లే, కె.దశరథ్, నిర్మాతలు: నవీన్ యర్నేని, వై.రవిశంకర్.

మహేశ్‌ను జపాన్ తీసుకొస్తా




రాజమౌళి

జూనియర్ ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా దర్శకధీరుడు రాజమౌళి రూపొందించిన 'ఆర్ఆర్ఆర్' చిత్రం దేశవిదేశాల్లో విజయం సాధించింది. అలాగే ఇటీవల జరిగిన ఆస్కార్ వేడుకల సందర్భంగా గత ఏడాది ఆస్కార్ వేదికపై 'ఆర్ఆర్ఆర్' చిత్రం సృష్టించిన సందర్భాన్నా అందరూ మరోసారి గుర్తు చేసుకున్నారు. ఈ సినిమా జపాన్‌లో కూడా విడుదలై విజయం సాధించింది. ఈ విజయాన్ని అక్కడి ప్రేక్షకులతో కలసి ఆస్వాదించడానికి రాజమౌళి ఇటీవలే జపాన్ వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన అక్కడి ప్రేక్షకులతో మాట్లాడుతూ "నేను దర్శకత్వం వహించే నెక్ట్స్ ప్రాజెక్ట్ స్ర్కిప్ట్ వర్క్ పూర్తయింది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయి. నటీనటుల ఎంపిక ఇంకా ఓ కొలిక్కి రాలేదు. కేవలం కథానాయకుడు మాత్రమే ఖరారు అయ్యారు. ఆయన పేరు మహేశ్‌బాబు. చాలా అందంగా ఉంటారు. త్వరలోనే ఈ సినిమాను మొదలుపెడ్తాను. సినిమా రిలీజ్ సమయానికి మహేశ్‌ను కూడా జపాన్ తీసుకువచ్చి మీకందరికీ పరిచయం చేస్తాను. మహేశ్‌ను కూడా కచ్చితంగా మీరందరూ ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని చెప్పారు.

అత్యద్భుత విజువల్స్‌తో...



తమిళ హీరో సూర్య నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కంగువ'. ఈ భారీ పీరియాడికల్ యాక్షన్ ఫిల్మ్‌కు 'వేదాలమ్, వీరుడొక్కడే, వివేకం' వంటి చిత్రాలు తీసిన శివ దర్శకత్వం వహిస్తున్నారు. దిశాపటాని, యోగిబాబు, బాబీడియోల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'కంగువ' సినిమాను భారీ బడ్జెట్‌తో ప్రముఖ నిర్మాణ సంస్థలు స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ బ్యానర్స్‌పై కేఈ జ్ఞానవేల్ రాజా, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పది భాషల్లో తెరకెక్కుతున్న 'కంగువ' త్రీడీలోనూ ప్రేక్షకుల ముందుకు రానుంది. పలు అంతర్జాతీయ భాషల్లోనూ ఈ సినిమాను రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. శరవేగంగా షూటింగ్ పూర్తి చేసి సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు. మంగళవారం 'కంగువ' టీజర్ విడుదలైంది. అత్యద్భుత విజువల్స్‌తో ఈ టీజర్ ఆకట్టుకుంది. ఇందులో సూర్య పోరాట యోధుడిగా చేసిన యాక్షన్ సీన్స్ థియేటర్స్‌లో అందరిచేత విజిల్స్ వేయించేలా ఉన్నాయి. ఈ చిత్రానికి ఎడిటర్: నిశాద్‌యూసుఫ్, సినిమాటోగ్రఫీ: వెట్రి పళనిస్వామి, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఏ జే రాజా, కో ప్రొడ్యూసర్: నేహా జ్ఞానవేల్‌రాజా.

సిద్ధమైన హనీ-బన్నీ



హాలీవుడ్ వెబ్ సిరీస్ 'సిటాడెల్' ఇండియన్ వెర్షన్‌లో సమంత, వరుణ్ ధావన్ జంటగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఒరిజినల్ వెర్షన్‌కు రుస్సో బ్రదర్స్ దర్శకత్వం వహించగా, 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌తో పాపులర్ అయిన దర్శక ద్వయం రాజ్, డీకే ఇండియన్ వెర్షన్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సిరీస్ చిత్రీకరణ పూర్తయినా, ఎప్పటి నుంచి స్ట్రీమింగ్ అవుతుందనే విషయంలో ఇంతవరకూ ఎటువంటి అప్‌డేట్ రాలేదు. మేకర్స్ మంగళవారం ఈ సిరీస్ పోస్టర్‌తో పాటు టైటిల్‌ను రివీల్ చేశారు. 'హనీ-బన్నీ' పేరుని ఖరారు చేశారు. ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ అవనుంది. డేట్ మాత్రం ఇంకా ఫిక్స్ చేయలేదు. 1990ల నేపథ్యంలో సాగనున్న ఈ సిరీస్ అద్భుతమైన ప్రేమ కథతో కూడిన స్పై యాక్షన్ థ్రిల్లర్. దర్శక ద్వయం రాజ్, డీకే రూపొందించిన 'ఫ్యామిలీమ్యాన్' సిరీస్‌లో నెగెటివ్ టచ్ ఉన్న పాత్రను పోషించిన సమంత 'హనీ-బన్నీ సిరీస్‌కోసం మార్షల్ ఆర్ట్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఈ సిరీస్‌లో కేకే మీనన్, సిమ్రాన్, సోహమ్ మజుందార్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.


కామెడీతో వేడి పుట్టిస్తాం



సుహాస్ హీరోగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న చిత్రం విడుదల తేదీని ప్రకటించారు. 'అందరూ మెచ్చే వినోదం ప్రారంభమవుతుంది. మీ క్యాలెండర్‌లో మే 24ని గుర్తు పెట్టుకోండి. మేం అద్భుతమైన కామెడీతో వేడి పుట్టించడానికి సిద్ధంగా ఉన్నాం' అని హీరో సుహాస్ వెల్లడించారు. గత ఏడాది డిసెంబర్‌లో ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో సుహాస్‌కి జతగా సంకీర్తన విపిన్ నటిస్తున్నారు. 'సలార్' చిత్రానికి డైలాగ్ రైటర్‌గా పని చేసిన సందీప్‌రెడ్డి బండ్ల ఈ సినిమాకు దర్శకుడు. మే 24న విడుదలయ్యే ఈ సినిమా టైటిల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని నిర్మాతలు చెప్పారు. ఈ సందర్భంగా రిలీజ్ డేట్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఆ పోస్టర్‌ను చూస్తుంటే ఫ్యామిలీ ఎమోషన్స్ కలిగిన ఓ ఫన్నీ కోర్టు డ్రామా చిత్రమని అర్థమవుతుంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిశోర్, మురళీశర్మ, గోపరాజు, రఘుబాబు, పృథ్వీ, శివన్నారాయణ, రూపలక్ష్మి, విజయలక్ష్మి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి నిర్మాతలు: హర్షిత్ రెడ్డి, హన్షిత. సమర్పణ: శిరీష్.

దర్శక ధీరుడి సమర్పణలో...

దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి తనయుడు ఎస్.ఎస్.కార్తికేయ నిర్మాతగా మారుతున్నారు. ప్రముఖ ఆర్కా మీడియా వర్క్స్ సంస్థ అధినేతలు శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేనితో కలసి కార్తికేయ రెండు క్రేజీ ప్రాజెక్ట్స్‌ను రూపొందించనున్నారు. పాన్ ఇండియా డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి ఈ చిత్రాలకు సమర్పకుడిగా వ్యవహరిస్తున్నారు. సినిమా, సినిమాకు ఎంచుకునే పాత్రల్లో వైవిధ్యాన్ని ప్రదర్శించే మళయాళ నటుడు, 'పుష్ప' ఫేమ్ ఫహాద్ ఫాజిల్ ఈ రెండు చిత్రాల్లోనూ నటిస్తుండటం విశేషం. కార్తికేయ ఈ మధ్య తెలుగులో డిస్ట్రిబ్యూటర్‌గా విడుదల చేసిన 'ప్రేమలు' చిత్రానికి ఫహాద్ ఫాజిల్ కూడా ఓ నిర్మాత అనే సంగతి తెలిసిందే. ఈ రెండు చిత్రాల్లో ఒకటి ఫ్రెండ్‌షిప్ ఆధారంగా తెరకెక్కిస్తున్నారు. దీనికి 'ఆక్సిజన్' అనే టైటిల్ ఖరారు చేశారు. నూతన దర్శకుడు సిద్ధార్థ్ నాదెళ్ల దర్శకుడు. మరో చిత్రం ఫ్యాంటసీ కథాంశంతో రూపొందుతోంది. ఈ చిత్రం టైటిల్ 'డోంట్ ట్రబుల్ ది ట్రబుల్'. శశాంక్ ఏలేటి దర్శకుడు. ఈ రెండు





చిత్రాలకు వేటికవే భిన్నంగా, కంటెంట్ బేస్డ్‌గా తెరకెక్కనున్నాయి. ఈ సినిమాలను ప్రకటించిన సందర్భంగా కార్తికేయ మాట్లాడుతూ "డిస్ట్రిబ్యూటర్‌గా నా తొలి చిత్రం 'ప్రేమలు' ద్వారా నాకు విజయాన్ని అందించి నాపై మీకున్న అపరిమితమైన ప్రేమను తెలియజేశారు. దీంతో మంచి చిత్రాలకు భాషాపరమైన భేదాలుండవనే నమ్మకం నాలో మరింతగా పెరిగింది. ఈ రెండు చిత్రాల్లో నటిస్తున్న ఫహాద్ ఫాజిల్ బహుముఖ ప్రజ్ఞకు ప్రతిరూపం, నేనెంతగానో ఆరాధించే వ్యక్తి" అని అన్నారు.

మహిళలకు టెనెంట్ సందేశం



'పొలిమేర 2' చిత్రం ఘన విజయం తర్వాత సత్యం రాజేశ్ కథానాయకుడిగా నటిస్తున్న సినిమా 'టెనెంట్'. వై. యుగంధర్ దర్శకత్వంలో మోగుళ్ల చంద్రశేఖర్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ట్రైలర్‌కు చక్కటి స్పందన వచ్చింది. ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు థ్రిల్ చేసే అంశాలతో ఈ చిత్రం రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. 'ఈ తరం మహిళలు ఎంత జాగ్రత్తగా మెలగాలో ఈ చిత్రంలో చూపించబోతున్నాం, ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. ఏప్రిల్ మూడో వారంలో 'టెనెంట్'ను విడుదల చేస్తాం' అని నిర్మాత తెలిపారు. మేఘా చౌదరి, చందన పయావుల కీలకపాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సాహిత్య సాగర్. సినిమాటోగ్రఫీ: జెమిన్ జోమ్

14ఏళ్ల తర్వాత వేదం కాంబినేషన్‌లో..



మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి చిత్రంతో రీ ఎంట్రీ ఇచ్చారు అనుష్క శెట్టి. ప్రస్తుతం ఆమె నటిస్తున్న 50వ చిత్రం అధికారికంగా ఖరారైంది. ప్రయోగాత్మక చిత్రాలు తీసే క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్‌మెంట్స్ బ్యానర్లపై వంశీ కృష్ణ రెడ్డి, రాజీవ్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ చిత్రానికి 'ఘాటి' అనే టైటిల్‌ను ప్రకటించి, పోస్టర్ రిలీజ్ చేశారు. చీరతో ముఖాన్ని కప్పి ఎడారిలో ఒంటరి బాటసారిగా సాగుతున్న అనుష్కను ఇందులో చూపించారు. ఓ మహిళ.. తనకు జరిగిన అన్యాయంపై పోరాడి బయటపడే కథగా ఈ సినిమా తెరకెక్కనుంది. కాగా, క్రిష్ దర్శకత్వంలో దాదాపు 14 ఏళ్ల తర్వాత అనుష్క నటిస్తుండటం విశేషం. వీరిద్దరి కలయికలో వచ్చిన 'వేదం' విమర్శకుల ప్రశంసలతో పాటు క్లాసికల్ హిట్ స్టేటస్‌ను సంపాదించుకుంది. అందులో వేశ్యగా నటించిన అనుష్క, ఈ చిత్రంలోనూ అదే పాత్ర పోషించనున్నారని టాక్ వినిపిస్తోంది.

ఏడు గెటప్పుల్లో మంచు లక్ష్మి



లక్ష్మీ మంచు ప్రధాన పాత్ర పోషించిన సోషియో ఫాంటసీ 'ఆదిపర్వం'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. ఎం.ఎస్.కే నిర్మాత. ఈ పీరియాడిక్ డ్రామా తెలుగుతో పాటు పలు భాషల్లో విడుదలవుతోంది. తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ ఎన్. గిరిధర్ చేతుల మీదుగా 'ఆదిపర్వం' తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీ మంచు మాట్లాడుతూ 'పోస్టర్ చూస్తుంటే 'నేను ఇన్ని పాత్రలు చేశానా?' అనిపిస్తోంది. అన్ని రకాల ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది' అన్నారు. 'ఈ చిత్రానికి బలం, బలగం మంచు లక్ష్మి. ఆమె నటించకపోతే ఈ సినిమా లేదు. ఇందులో ఆమె ఏడు రకాల గెటప్స్ వేశారు. తన నట విశ్వరూపం చూస్తాం' అని దర్శకుడు చెప్పారు. శివ కంఠంనేని, ఎస్తర్ నోరోనా కీలకపాత్రలు పోషించిన ఈ చిత్రానికి సంగీతం: మాధవ్, సంజీవ్. సినిమాటోగ్రఫీ: ఎస్ఎన్ హరీశ్

యుద్ధ విద్యల్లో శిక్షణ



హృతిక్ రోషన్, ఎన్టీఆర్ నటిస్తున్న మల్టీస్టారర్ 'వార్ 2'. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో హృతిక్ రోషన్ ఏజెంట్ కబీర్ పాత్రలో కనిపించనున్నారు. తన పాత్ర కోసం ఆయన కసరత్తు మొదలుపెట్టారు. తన సినిమాల్లోని పాత్రకు తగ్గట్లు కనిపించేందుకు ఆయన ఎంత కష్టమైనా వెనుకాడరు. జిమ్‌లో కసరత్తులు చేసి, ఇప్పటికే బాడీని ఫిట్‌గా తయారు చేశారు. భారీ పోరాట ఘట్టాలతో తెరకెక్కుతోన్న చిత్రం కావడంతో, స్టైలిష్ యాక్షన్ సీక్వెన్స్ కోసం ఆయన మార్షల్ ఆర్ట్స్, కత్తియుద్ధంలో శిక్షణ తీసుకోబోతున్నారని యూనిట్ తెలిపింది. గతంలో వచ్చిన 'వార్' చిత్రానికి ఇది సీక్వెల్. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో ఆదిత్య చోప్రా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

స్వేచ్ఛకు స్ఫూర్తి



సాయికుమార్, పార్వతీశం, ఐశ్వర్య, హారిక ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'మెర్సీ కిల్లింగ్'. సూరపల్లి వెంకట రమణ దర్శకత్వంలో మాధవి తాలబత్తుల నిర్మిస్తున్నారు. ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ఫస్ట్‌లుక్, మోషన్ పోస్టర్‌ను హీరో ఆకాశ్ పూరి చేతుల మీదుగా విడుదల చేశారు. కొత్త తరహా కాన్సెప్ట్‌తో తెరకెక్కిన 'మెర్సీ కిల్లింగ్' ఘన విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 స్ఫూర్తితో ఈ సినిమా కథ రూపొందించినట్లు దర్శకుడు తెలిపారు. స్వేచ్ఛ అనే అనాథ బాలిక న్యాయం కోసం జరిపిన పోరాటం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని నిర్మాత చెప్పారు. సంగీతం: ఎం. ఎల్ రాజా. సినిమాటోగ్రఫీ: అమర్ జీ.

పురాణ యోధుడి పాత్రలో షాహిద్ కపూర్



వరుస విజయాలతో జోరుమీదున్నారు బాలీవుడ్ కథానాయకుడు షాహిద్ కపూర్. ఆయన హీరోగా నటించబోయే కొత్త చిత్రం 'అశ్వత్థామ' అధికారికంగా ఖరారైంది. మహాభారతంలోని అశ్వత్థామ పాత్ర ఆధారంగా అల్లుకున్న కల్పిత గాథతో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఆ మహావీరుడు ఈ కాలానికి ఎలా వచ్చాడు, ఇక్కడున్న దుష్టశక్తులను తుదముట్టించేందుకు ఆయన జరిపిన భారీ పోరాటాల నేపథ్యంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. సచిన్ రవి దర్శకత్వంలో వసు భగ్నానీ, పూజా ఎంటర్టైన్‌మెంట్స్ నిర్మిస్తున్నాయి. గతంలో విక్కీ కౌశల్ కథానాయకుడిగా దర్శకుడు ఆదిత్యధర్ 'అశ్వత్థామ' ప్రాజెక్ట్‌ను ప్రకటించినా బడ్జెట్ పరిమితుల వల్ల వెనక్కు తగ్గారు.

'కలియుగం పట్టణంలో'



విశ్వ కార్తికేయ, ఆయూషి పటేల్ హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'కలియుగం పట్టణంలో'. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో రాబోతోన్న ఈ మూవీకి రమాకాంత్ రెడ్డి దర్శకత్వం వహించారు. డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు నిర్మించిన 'కలియుగం పట్టణంలో' ఈ నెల 29న రాబోతోంది. సోమవారం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేష్‌లు మాట్లాడుతూ "కలియుగం పట్టణంలో సినిమా అంతా కూడా కడపలోనే తీశాం. దర్శకుడు రమాకాంత్ రెడ్డి చెప్పిన కథ నచ్చడంతో ఈ ప్రాజెక్ట్‌ను నిర్మించాం. సినిమా అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది" అని అన్నారు. దర్శకుడు రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ. "ఈ సినిమాలో యాక్షన్, లవ్, క్రైమ్..ఇలా అన్నీ ఉన్నాయి. ప్రేక్షకులు మా సినిమాను చూసి ఆదరించాలి" అని కోరారు. విశ్వ కార్తికేయ మాట్లాడుతూ "కలియుగం పట్టణంలో ప్రతీ పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. ఈ సినిమా తప్పక ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుంది" అని అన్నారు. ఆయుషి పటేల్ మాట్లాడుతూ "టీం అంతా కలిసి సినిమా షూటింగ్ ఎంతో సరదాగా చేశాం" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: గ్యారీ బీహెచ్, కెమెరామెన్: చరణ్ మాధవనేని, సంగీతం: అజయ్ అరసాద, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రామ్ ప్రకాష్ రెడ్డి.

రోజుకు రూ. 25 లక్షలు



ఐపీఎల్ వ్యాఖ్యాతగా మళ్లీ సిద్ధూ

న్యూఢిల్లీ: మాజీ క్రికెటర్ నవ్‌జ్యోత్ సింగ్ సిద్ధూ దశాబ్ధ కాలం తర్వాత కామెంటేటర్‌గా కనిపించనున్నాడు. శుక్రవారం నుంచి జరిగే ఐపీఎల్ ద్వారా అతను అభిమానులను అలరించబోతున్నాడు. కామెంటరీ బాక్స్‌లో సిద్ధూ ఉంటే ఆ సందడే వేరుగా ఉంటుంది. తనకు మాత్రమే ప్రత్యేకమైన చలోక్తులు, ప్రాస, జాతీయాలతో మ్యాచ్ జరిగే విధానాన్ని అత్యంత ఆసక్తికరంగా మారుస్తుంటాడు. అలాగే కామెంటేటర్‌గా తొలిసారి కమ్‌బ్యాక్ చేస్తున్నానని, విరామం వచ్చినా తన మాటల పదును తగ్గదని సిద్ధూ తేల్చాడు. గతంలో టోర్నీ మొత్తానికి రూ.60-70 లక్షలు వస్తే.. ఈసారి ఐపీఎల్‌లో మ్యాచ్‌కు రూ.25 లక్షలు తీసుకుంటున్నట్టు వెల్లడించాడు.



ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి

డబ్ల్యూఎఫ్ఐకి పాలనాధికారం అప్పగించడంపై వినేష్, మాలిక్

న్యూఢిల్లీ: రెజ్లింగ్‌కు సంబంధించిన పూర్తి పాలనాధికారాన్ని సంజయ్ సింగ్ నేతృత్వంలోని భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)కు జాతీయ ఒలింపిక్ సంఘం (ఐవోఏ) అప్పగించడాన్ని స్టార్ రెజ్లర్లు వినేష్ ఫొగట్, సాక్షి మాలిక్ తప్పుపట్టారు. ఈ విషయంలో ప్రధానమంత్రి జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేసిన రెజ్లర్లు.. బ్రిజ్‌భూషణ్ లాంటి అణచివేతవాదులను క్రీడలకు దూరం ఉంచేందుకు ఏదో ఒకటి చేయాలని నరేంద్ర మోదీని కోరారు. 'రెజ్లర్లను వేధించిన బ్రిజ్‌భూషణ్ మళ్లీ రెజ్లింగ్‌పై అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాడు. మహిళా శక్తి గురించి అనర్గళంగా ఉపన్యాసాలు ఇచ్చే మోదీ.. ఇలాంటి వారిని నియంత్రించండి' అని ఫొగట్ ఘాటైన పదజాలంతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టింది. డబ్ల్యూఎఫ్ఐ ఆఫీసు బేరర్లు.. తమను తాము చట్టాలకు అతీతులుగా భావిస్తున్నారని సాక్షి మాలిక్ కామెంట్ చేసింది. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్‌భూషణ్‌కు అనుచరుడైన సంజయ్.. రెజ్లింగ్ చీఫ్‌గా ఉంటే పరిస్థితుల్లో మార్పు ఉండదని వినేష్, మాలిక్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బాచ్

'ఫ్రెండ్‌షిప్ గేమ్స్'.. రాజకీయ కుట్ర

- రష్యా క్రీడలకు దూరంగా ఉండండి
- అథ్లెట్లు, ప్రభుత్వాలకు ఐవోసీ విజ్ఞప్తి

జెనీవా: 'ప్రపంచ క్రీడలపై రష్యా ఎదురుదాడి.. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐవోసీ)ని కలవరపెడుతోంది. ఒలింపిక్స్‌లో తమ దేశంపై నిషేధం విధించడంతో.. రష్యానే అలాంటి విశ్వక్రీడల నిర్వహణకు సన్నాహకాలు చేస్తోంది. ఒలింపిక్స్ తరహాలో సెప్టెంబరు 15 నుంచి 29 వరకు మాస్కో, యకతరీన్‌బర్గ్‌లో 'అంతర్జాతీయ ఫ్రెండ్‌షిప్ గేమ్స్' పేరుతో గ్రాండ్ ఈవెంట్‌ను నిర్వహించనున్నట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదివరకే ప్రకటించారు. ఇందులో పతక విజేతల కోసం రూ. 415 కోట్ల ప్రైజ్‌మనీని కూడా ఆయన ప్రకటించారు. ఇదే ఐవోసీని ఎక్కువగా భయపెడుతోంది. ఒలింపిక్స్‌లో పతకాలు మాత్రమే ఇస్తారు కానీ.. నజరానాలు ఉండవు. అథ్లెట్లు డబ్బు కోసం ఆశపడి రష్యా క్రీడల్లో పాల్గొనే అవకాశం లేకపోలేదు. అందుకే.. ఈ 'ఫ్రెండ్‌షిప్ గేమ్స్'లో అథ్లెట్లు ఎవరూ పాల్గొనవద్దని ఐవోసీ విజ్ఞప్తి చేస్తోంది. విశ్వక్రీడల స్ఫూర్తిని దెబ్బతీసి, ఆటలను రాజకీయమయం చేసేందుకు రష్యన్ సమాఖ్య చేస్తున్న కుట్ర ఇదని ఐవోసీ చీఫ్ థామస్ బాచ్ మంగళవారం ఆరోపించారు.

పంత్ రాక.. మారేనా ఢిల్లీ రాత?



2 ఐపీఎల్ రోజుల్లో

టైటిల్ విషయం పక్కనపెడితే ఈసారి ఐపీఎల్‌కు సంబంధించి ఢిల్లీ క్యాపిటల్స్‌కు అత్యంత ఉత్సాహకరమైన విషయం కెప్టెన్ రిషబ్ పంత్ పునరాగమనం. దాదాపు ఏడాదిన్నర క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పంత్ నిరుడు ఈ మెగా టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. అందరినీ సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తి కోలుకోవడం ద్వారా ఈ ఐపీఎల్‌కు తన పూర్వస్థాయిలో పంత్ సై అంటుండడం క్యాపిటల్స్ ఆత్మవిశ్వాసాన్ని రెండింతలు పెంచుతోంది. పదహారు సీజన్లలో ఒక్కసారే టైటిల్ ఫైట్‌కు రాగలిగింది ఢిల్లీ. హేమాహేమీ క్రికెటర్లున్నా జట్టు విజేతగా నిలవకపోవడమేమిటి? అనేది క్యాపిటల్స్ అభిమానుల ఆవేదన. ఈ నేపథ్యంలో పునరాగమన వేళ..కెప్టెన్ పంత్ తన జట్టును విజేతగా నిలుపుతాడా చూడాలి. **ఇక, ఈ సీజన్‌లో ఢిల్లీ జట్టుకు కెప్టెన్‌గా పంత్ వ్యవహరిస్తాడని క్యాపిటల్స్ యాజమాన్యం మంగళవారం అధికారికంగా ప్రకటించింది.**

బలం: పంత్ తిరిగి రావడం ఢిల్లీ బ్యాటింగ్ లైనప్‌ను మరింత బలోపేతం చేస్తుంది. డేవిడ్ వార్నర్ ఎలాగూ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. అతడి ధాటి బ్యాటింగ్‌కు పృథ్వీ షా తోడైతే శుభారంభాలు ఖాయం. మరో ఆస్ట్రేలియన్ మిచెల్ మార్ష్ దూకుడైన బ్యాటింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. జ్యే రిచర్డ్‌సన్, నోకియా, ముకేశ్‌తో పేస్ విభాగం.. అక్షర్, కుల్దీప్‌తో స్పిన్ బౌలింగ్ దుర్భేద్యంగా కనిపిస్తోంది.

బలహీనత: పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్లు లేక పోవడం ఢిల్లీకి లోటు. అలాగే ఇంగ్లండ్ స్టార్ హ్యారీ బ్రూక్, ఎన్‌గిడి ఈ సీజన్ నుంచి తప్పుకోవడం పెద్ద దెబ్బ.

ఢిల్లీ జట్టు: పంత్ (కెప్టెన్), వార్నర్, పృథ్వీ షా, నోకియా, అభిషేక్ పోరెల్, మార్ష్, అక్షర్, స్టబ్స్, ఇషాంత్, ముకేశ్, ఖలీల్, కుల్దీప్, వోస్వాల్, ప్రవీణ్ దుబే, ఫ్రాజెర్, హోప్, యశ్ ధుల్, స్వస్తిక్, లలిత్, రికీ భుయ్, కుశాగ్ర, రసిక్, రిచర్డ్‌సన్, సుమిత్.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)



భారీ అంచనాలతో..

ఐపీఎల్ అరంగేట్రాన్ని ఘనంగా చాటిన జట్టు గుజరాత్ టైటాన్స్. బరిలో దిగిన తొలిసారే ఏకంగా టైటిల్ పట్టేసి అదరగొట్టిన ఆ జట్టు..రెండోసారి రన్నరప్‌గా నిలవడం ద్వారా తమ ఆట గాలివాటం కాదని నిరూపించింది. టైటాన్స్‌ను రెండుసార్లు అద్భుతంగా నడిపించిన కెప్టెన్ హార్దిక్ పాండ్యా అనూహ్యంగా గుజరాత్‌ను వీడి తన పాత జట్టు ముంబైకి జైకొట్టాడు. దాంతో యువ క్రికెటర్ శుభమన్ గిల్ సారథ్యంలో ఈసారి గుజరాత్ జట్టు అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. మ్యాచ్ విన్నర్లతో కూడిన టైటాన్స్ తన తొలి రెండు సీజన్లలో అద్భుతంగా రాణించింది. దీంతో ఈసారీ ఆ జట్టుపై భారీ అంచనాలున్నాయి.

బలం: గిల్, డేవిడ్ మిల్లర్, కేన్ విలియమ్సన్, వేడ్, రాహుల్ తెవాటియాలాంటి స్టార్లతో గుజరాత్ బ్యాటింగ్ లైనప్ బలంగా ఉంది. ముఖ్యంగా మిల్లర్, వేడ్ కొద్ది బంతుల్లోనే మ్యాచ్ గతిని మార్చి వేయగల బ్యాటర్లు. గత సీజన్‌లో అమోఘంగా ఆడిన గిల్.. ఈసారీ చెలరేగితే టైటాన్స్‌కు తిరుగుండదు.

బలహీనత: హార్దిక్ పాండ్యా లేకపోవడం, కీలక పేసర్ షమి గాయంతో దూరం కావడంతో ఆ జట్టు బౌలింగ్ బలహీన పడింది. గాయం నుంచి కోలుకొని పునరాగమనం చేస్తున్న స్పిన్నర్ రషీద్ ఎలా బౌలింగ్ చేస్తాడనేది కీలకం. జోష్ లిటిల్, మోహిత్ శర్మ, ఉమేశ్, జాన్సన్ ప్రత్యర్థి బ్యాటర్లను ఎలా నియంత్రిస్తారో చూడాలి.

గుజరాత్ జట్టు: గిల్ (కెప్టెన్), సాహా, వేడ్, మిల్లర్, కేన్ విలియమ్సన్, సాయి సుదర్శన్, మనోహర్, విజయ్ శంకర్, నల్‌కండే, తెవాటియా, రషీద్, ఉమేశ్, లిటిల్, మోహిత్, షారుఖ్, జయంత్, నూర్ అహ్మద్, సాయికిశోర్, అజ్మతుల్లా, సుశాంత్, కార్తీక్ త్యాగి, సుతార్, జాన్సన్, మిన్జ్.

ఆ గండం గట్టెక్కాలి..



ఐపీఎల్‌లో రెండేళ్ల క్రితం అరంగేట్రం చేసిన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్..రెండుసార్లు ప్లేఆఫ్స్‌కు చేరినా ఎలిమినేటర్ గండాన్ని దాటలేక పోయింది. 2022లో బెంగళూరు చేతిలో ఓడిన లఖ్‌నవూ.. గత సీజన్‌లో ముంబైకి తలొగ్గి మూడో స్థానంతో సరిపెట్టుకొంది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫైనల్ చేరాలనే పట్టుదలతో ఉంది. గతేడాది గాయంతో సగం సీజన్‌కు దూరమైన కెప్టెన్ కేఎల్ రాహుల్.. అందుబాటులోకి రావడం జట్టుకు అదనపు బలం.

బలం: కెప్టెన్ కేఎల్ రాహుల్, స్టొయినిస్, మేయర్స్, పూరన్, క్రునాల్ పాండ్యా, డికాక్‌లతో బ్యాటింగ్ లైనప్ బలంగానే కనిపిస్తోంది. ఇక, అవేశ్ ఖాన్‌కు బదులు ట్రేడింగ్‌లో దేవదత్ పడిక్కళ్‌ను తీసుకోవడంతో బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్టంగా తయారైంది. వేలంలో రూ. 6.4 కోట్లకు కొనుగోలు చేసిన పేసర్ శివమ్ మావి.. మొహిసిన్ ఖాన్‌కు బ్యాకప్‌గా నిలవనున్నాడు.

బలహీనత: నాకౌట్‌లో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడంలో జట్టు విఫలమవుతోంది. గత రెండు సీజన్లలో బౌలింగ్ విభాగంలో అనుభవలేమి ఎక్కువగా కనిపించింది. ఇంగ్లండ్ పేసర్ ఉడ్ దూరమవడం లోటే. మావి, సిద్దార్థ్, యష్ ఠాకూర్, అర్షద్ ఖాన్, అమిత్ మిశ్రాలు ఎంతమేరకు రాణిస్తారేది కూడా ప్రశ్నార్థకం.

లఖ్‌నవూ జట్టు: రాహుల్ (కెప్టెన్), పడిక్కళ్, డికాక్, పూరన్, టర్నర్, బదోని, దీపక్ హుడా, కృష్ణప్ప గౌతమ్, క్రునాల్, మేయర్స్, స్టొయినిస్, అర్షద్, ప్రేరక్, యుధ్‌వీర్, అర్షిన్, విల్లే, మావి, జోసెఫ్, మయాంక్ యాదవ్, మోసిన్, బిష్ణోయ్, యష్ ఠాకూర్, అమిత్ మిశ్రా, నవీనుల్, సిద్దార్థ్.

సూర్య ఫిట్‌నెస్‌పై సందిగ్ధత

ముంబై తొలి మ్యాచ్‌కు దూరం?



ముంబై: ముంబై ఇండియన్స్ స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ ఐపీఎల్ బరిలోకి దిగడంపై సందిగ్ధత నెలకొంది. దీంతో ఈనెల 24న గుజరాత్‌తో జరిగే తొలి లీగ్ మ్యాచ్‌కు అతడు దాదాపు దూరమైనట్టే. స్పోర్ట్స్ హెర్నియా ఆపరేషన్ చేయించుకొన్న సూర్య.. జాతీయ క్రికెట్ అకాడమీలో పునరావాసంలో ఉన్నాడు. మంగళవారం నిర్వహించిన ఫిట్‌నెస్ టెస్ట్‌లో సంతృప్తికర ఫలితాలు రాలేదు. గురువారం మరోసారి సూర్యకు ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించిన తర్వాత.. అంతా బాగుందనుకొంటే ఐపీఎల్‌లో ఆడేందుకు అనుమతిస్తారు.

అఫ్ఘాన్‌తో ఆసీస్ టీ20 సిరీస్ వాయిదా

సిడ్నీ: ఈ ఏడాది ఆగస్టులో అఫ్ఘానిస్థాన్‌తో జరగాల్సిన మూడు టీ20ల సిరీస్‌ను ఆస్ట్రేలియా వాయిదా వేసుకొంది. అఫ్ఘాన్‌లో మహిళలు, ఆడపిల్లలపై జరుగుతున్న అకృత్యాలు, అణచివేత ధోరణులకు నిరసనగా ఆసీస్ ఈ నిర్ణయం తీసుకొంది. 2021లోనూ ఇలాంటి కారణాలతోనే అఫ్ఘాన్‌తో టెస్ట్ మ్యాచ్‌ను కూడా ఆసీస్ రద్దు చేసుకొంది.

రివ్యూ వేగంగా.. మరింత కచ్చితంగా

ఐపీఎల్‌లో 'స్మార్ట్ రీప్లే వ్యవస్థ'

ముంబై: నిర్ణయ సమీక్షను మరింత వేగంగా, కచ్చితంగా చేసేందుకు ఈసారి ఐపీఎల్‌లో కొత్తగా 'స్మార్ట్ రీప్లే వ్యవస్థ'ను ప్రవేశపెట్టనున్నారు. ఈ కొత్త సిస్టమ్‌లో ఇద్దరు హాక్-ఐ ఆపరేటర్ల నుంచి థర్డ్ అంపైర్‌కు నేరుగా 8 హైస్పీడ్ కెమెరాల నుంచి విభిన్న కోణాల్లోంచి తీసిన ఇమేజ్‌లు అందుబాటులో ఉంటాయి. వారు కూడా అంపైర్‌తోపాటు అదే రూమ్‌లో ఉంటారు. గతంలో టీవీ బ్రాడ్‌కాస్టింగ్ డైరెక్టర్.. వీరి మధ్య అనుసంధానకర్తగా వ్యవహరించే వాడు. కానీ, నూతన వ్యవస్థలో అతడి ప్రమేయం అనవసరం. అంతేకాకుండా హాక్-ఐ ఆపరేటర్లతో జరిపే సంప్రదింపులను కూడా నేరుగా ప్రసారం చేస్తారు. దీనివల్ల ఏ నిర్ణయం ఎందుకు తీసుకొన్నారో స్పష్టంగా అర్థమవుతుంది. బౌండ్రీ వద్ద అందుకొనే క్యాచ్‌లు, ఎల్బీలు, స్టంపింగ్‌లతోపాటు నేలకు దగ్గరగా పట్టే క్యాచ్‌లను వేగంగా విశ్లేషించడం కోసం.. అంపైర్లకు వివిధ కోణాల్లో స్పష్టమైన విజువల్స్ అందుబాటులోకి రావడంలో ఈ వ్యవస్థ సహాయకారిగా ఉంటుంది. రివ్యూ చేసేటప్పుడు సంప్రదాయ పద్ధతిలో ఒకటి తర్వాత ఒకటి ఇలా అన్నింటినీ పరిశీలించకుండా.. వేగంగా నిర్ణయానికి వచ్చే స్టెప్‌కు రావడానికి కొత్త వ్యవస్థ దోహదం చేస్తుంది. స్మార్ట్ రీప్లే సిస్టమ్‌పై అవగాహన కోసం ఎంపిక చేసిన 15 మంది అంపైర్లకు బీసీసీఐ ఇటీవల రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించింది.

లక్ష్య.. ర్యాంకుల్లో ముందంజ

న్యూఢిల్లీ: గతవారం ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో సెమీ ఫైనల్ చేరడంతో భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ ర్యాంకింగ్స్‌లో ముందంజ వేశాడు. మంగళవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్‌లో సింగిల్స్‌లో లక్ష్య ఐదు స్థానాలు మెరుగై 13వ ర్యాంకులో నిలిచాడు. ప్రణయ్ 9వ ర్యాంకును నిలబెట్టుకోగా..శ్రీకాంత్ 27వ, సింధు 11వ ర్యాంకులో ఉన్నారు. డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జోడీ టాప్ ర్యాంకును పదిలం చేసుకోగా, గాయత్రి/ట్రీసా జంట 26వ ర్యాంకులో కొనసాగుతోంది.

స్విస్ ఓపెన్ మెయిన్‌డ్రాకు సిక్కి జోడీ

బాసెల్: స్విస్ ఓపెన్ మెయిన్ బ్యాడ్మింటన్ టోర్నీలో మెయిన్ డ్రాకు సిక్కిరెడ్డి-సుమిత్ రెడ్డి జోడీ అర్హత సాధించింది. మంగళవారం జరిగిన మిక్స్‌డ్ డబుల్స్ అర్హత పోటీల్లో సిక్కి-సుమిత్ జంట 21-12, 21-17తో లీలా-జోరినా(స్విట్జర్లాండ్) జంటపై గెలిచింది.

వాలీబాల్ లీగ్ ఫైనల్లో ఢిల్లీ

చెన్నై: ఢిల్లీ తుఫాన్స్ జట్టు ప్రైమ్ వాలీబాల్ లీగ్ ఫైనల్లో ప్రవేశించింది. మంగళవారం జరిగిన ఎలిమినేటర్ పోరులో ఢిల్లీ 3-2తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై విజయం సాధించింది.

'హాల్ ఆఫ్ ఫేమ్'లో పంకజ్

న్యూఢిల్లీ: లెజెండరీ క్యూయిస్ట్, భారత స్టార్ పంకజ్ అడ్వాణీ కెరీర్‌లో మరో మైలురాయి చేరింది. 38 ఏళ్ల పంకజ్‌కు ప్రతిష్ఠాత్మక 'హాల్ ఆఫ్ ఫేమ్'లో చోటు దక్కింది. చైనాలోని షాంగ్రావో సిటీలోని వరల్డ్ బిలియర్డ్స్ మ్యూజియంలో సోమవారం పంకజ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసిన నిర్వాహకులు.. అతడిని హాల్ ఆఫ్ ఫేమ్ గౌరవంతో సత్కరించారు.

బిజినెస్

టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు పెంపు!

ఆఫ్‌సైట్ ఉద్యోగులకు మరింత హైక్

న్యూఢిల్లీ: ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తన ఉద్యోగుల జీతాలను ఏప్రిల్ నుంచి పెంచుతోంది. ఆన్‌సైట్ ఉద్యోగులకు సగటున రెండు నుంచి నాలుగు శాతం, ఆఫ్‌సైట్ ఉద్యోగులకు సగటున 7 నుంచి 8 శాతం పెరుగుతాయని సమాచారం. మంచి పనితీరు కనబరిచే టీసీఎస్ ఉద్యోగుల వేతనాలు మాత్రం 12 నుంచి 15 శాతం పెరగనున్నాయి. గత ఏడాది కూడా టీసీఎస్ ఉద్యోగుల జీతాలు 6 నుంచి 9 శాతం పెంచింది. మంచి పనితీరు కనబరిచే ఉద్యోగుల వేతనాలను 12 నుంచి 15 శాతం పెంచింది. అయితే ఏప్రిల్ నుంచి పెంచే జీతాలు అందరికీ వర్తిస్తాయా? లేక కొందరికేనా? అనే విషయం ఇంకా స్పష్టం కాలేదు. కొన్ని ఐటీ కంపెనీలు ప్రస్తుత డౌన్ ట్రెండ్‌ను దృష్టిలో పెట్టుకుని జీతాలు పెంపు మానేశాయి. కొన్ని కంపెనీలైతే పనితీరు ఆధారంగా ఇచ్చే వేరియబుల్ జీతాల్లోనూ కోత పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో టీసీఎస్ తన ఉద్యోగుల జీతాలు కొద్ది స్థాయిలోనైనా పెంచడం విశేషం. అయితే టీసీఎస్ మాత్రం ఈ జీతాల పెంపు వార్తలు పుకార్లని కొట్టివేసింది. జీతాల పెంపు ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని తెలిపింది.

ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.18.90 లక్షల కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇప్పటి వరకు (ఈ నెల 17 వరకు) ప్రత్యక్ష పన్నుల నికర వసూళ్లు వార్షిక ప్రాతిపదికన 20 శాతం వృద్ధితో రూ.18,90,259 కోట్లకు చేరుకున్నాయని ఐటీ శాఖ మంగళవారం వెల్లడించింది. అందులో, కార్పొరేట్ పన్నుల నికర వసూళ్లు రూ.9,14,469 కోట్లు కాగా.. సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ) సహా వ్యక్తిగత ఆదాయం పన్ను (పీఐటీ) వసూళ్లు రూ.9,72,224 కోట్లుగా నమోదయ్యాయి. కాగా, ప్రత్యక్ష పన్నుల స్థూల వసూళ్లు 18.74 శాతం వృద్ధితో రూ.22.27 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. 2023-24కు గాను సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం.. ఈసారి ప్రత్యక్ష పన్నుల ద్వారా రూ.19.45 లక్షల కోట్ల ఆదాయం సమకూరవచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

వడ్డీ రేట్లు పెంచిన బ్యాంక్ ఆఫ్ జపాన్

టోక్యో: జపాన్ కేంద్ర బ్యాంక్.. బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) వడ్డీ రేట్ల పెంపునకు దిగింది. కనీస వడ్డీ రేటును మైనస్ 0.1 శాతం నుంచి 0.1 శాతానికి పెంచింది. 2007 ఫిబ్రవరి తర్వాత బీఓజే వడ్డీ రేట్లు పెంచడం ఇదే మొదటిసారి. ప్రతికూల వడ్డీ రేట్ల ద్వారా తక్కువ ఖర్చుతో ఆర్థిక వ్యవస్థలోకి పెట్టుబడులు ఆకర్షించాలన్న లక్ష్యం నెరవేరినందున వడ్డీ రేట్లు స్వల్పంగా పెంచినట్టు బీఓజే గవర్నర్ కజువో యుఎడా చెప్పారు.

రూ.4.86 లక్షల కోట్లు ఆవిరి

భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్ .. సెన్సెక్స్ 736 పాయింట్లు డౌన్ .. 22,000 దిగువ స్థాయికి నిఫ్టీ

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో భారీగా నష్టపోయాయి. ఇంట్రాడేలో 815 పాయింట్లు క్షీణించి 72,000 దిగువకు జారుకున్న సెన్సెక్స్.. చివరికి 736.37 పాయింట్ల (1.01 శాతం) నష్టంతో 72,012.05 వద్ద ముగిసింది. నిఫ్టీ 238.25 పాయింట్లు (1.08 శాతం) కోల్పోయి 21,817.45 వద్ద స్థిరపడింది. సూచీలకు నెల రోజులకు పైగా కనిష్ఠ స్థాయిలివి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 23 నష్టాల్లో ముగిశాయి.

ప్రధాన కంపెనీలతో పాటు చిన్న, మధ్య స్థాయి షేర్లు సైతం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. దాంతో బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్ సూచీ 1.04 శాతం, మిడ్‌క్యాప్ ఇండెక్స్ 1.36 శాతం పతనమయ్యాయి. రంగాలవారీ సూచీల్లో ఐటీ, టెక్ 2.66 శాతం వరకు నష్టపోగా.. టెలికాం, సర్వీసెస్, యుటిలిటీస్ ఇండెక్స్‌లు ఒక శాతానికి పైగా జారుకున్నాయి. బేరిష్ ట్రెండ్ కారణంగా ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) ఒక్కరోజులోనే రూ.4.86 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.373.93 లక్షల కోట్లకు జారుకుంది.

మార్కెట్ నష్టాలకు కారణాలు

- బ్యాంక్ ఆఫ్ జపాన్ (బీఓజే) 17 ఏళ్లలో తొలిసారిగా వడ్డీ రేట్లను పెంచడంతో ఆసియా మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ ప్రతికూలంగా మారింది. దాంతో మన మార్కెట్లు నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అధిక ధరల వద్ద ట్రేడవుతున్న షేర్లలో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు.
- ఐటీ రంగ కంపెనీలైన టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్‌తో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లలో అమ్మకాలు సూచీలకు భారీగా గండికొట్టాయి.
- అమెరికన్ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ కూడా బుధవారం వడ్డీ రేట్లపై నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో మదుపరులు అప్రమత్త ధోరణిని కనబరిచారు. ఫెడ్ రేట్ల తగ్గింపు జాప్యం కావచ్చన్న ఆందోళనలు ప్రపంచ మార్కెట్ల ట్రేడింగ్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపుతున్నాయి. భారత్ సహా వర్ధమాన మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు మళ్లీ వెనక్కి వెళ్లిపోతున్నాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు మళ్లీ ఎగబాకుతుండటం కూడా మన ఈక్విటీ మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.



తిరోగమనంలో ఎల్ఐసీ షేరు

ఏడాది గరిష్ఠ స్థాయి నుంచి 25 శాతం పతనం

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్ఐసీ షేరు వరుసగా మూడో రోజూ నష్టపోయింది. మంగళవారం మరో 2.77 శాతం క్షీణించి రూ.879.50 వద్ద స్థిరపడింది. గడిచిన మూడు ట్రేడింగ్ సెషన్లలో షేరు 8.27 శాతం తగ్గింది. ఈ ఏడాది ఫిబ్రవరి 9న నమోదైన ఏడాది గరిష్ఠ స్థాయి రూ.1,175 నుంచి ఇప్పటివరకు 25.14 శాతం పతనమైంది.


ఆర్ఈసీ రూ.4.5 మధ్యంతర డివిడెండ్

ఈ ఆర్థిక సంవత్సరానికి (2023-24) గాను ప్రభుత్వ రంగ సంస్థ ఆర్ఈసీ మూడో మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. వాటాదారులకు రూ.10 ముఖవిలువ కలిగిన ఒక్కో షేరుకు రూ.4.5 డివిడెండ్ చెల్లించేందుకు కంపెనీ బోర్డు మంగళవారం ఆమోదం తెలిపింది. ఇప్పటికే ప్రకటించిన రెండు మధ్యంతర డివిడెండ్‌లతో కలిపి 2023-24కు గాను కంపెనీ మొత్తం డివిడెండ్ రూ.6.5 డివిడెండ్ చెల్లించినట్లవుతుంది. తాజా డివిడెండ్ చెల్లింపునకు అర్హులైన షేర్‌హోల్డర్ల రికార్డు తేదీని ఈనెల 28గా నిర్ణయించింది. వచ్చే నెల 17లోగా డివిడెండ్ చెల్లించనుంది.

పాపులర్ వెహికిల్ లిస్టింగ్.. ప్చ్

మారుతి సుజుకీ, హోండా, జేఎల్ఆర్ బ్రాండ్ కార్లతో పాటు టాటా మోటార్స్ వాణిజ్య వాహనాల డీలర్‌షిప్‌లను కలిగిన పాపులర్ వెహికిల్స్ అండ్ సర్వీసెస్ లిమిటెడ్ మంగళవారం షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.295తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు ఒక శాతం డిస్కౌంట్‌తో రూ.292 వద్ద లిస్టయింది. ఒక దశలో 11 శాతం వరకు క్షీణించిన కంపెనీ షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 6.35 శాతం నష్టంతో రూ.276.25 వద్ద స్థిరపడింది. గత గురువారంతో ముగిసిన కంపెనీ ఐపీఓకు ఇష్యూ సైజుతో పోలిస్తే 1.23 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

అపోలో హాస్పిటల్స్ ప్రెసిడెంట్, సీఈఓగా మధు శశిధర్



హైదరాబాద్: అపోలో హాస్పిటల్స్ డివిజన్ ప్రెసిడెంట్, సీఈఓగా డాక్టర్ మధు శశిధర్ నియమితులయ్యారు. ఈ మేరకు అపోలో గ్రూప్ ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ప్రెసిడెంట్‌గా ఉన్న కే హరిప్రసాద్ నుంచి శశిధర్ ఈ బాధ్యతలు తీసుకోనున్నారు. గత ఏడాది అక్టోబరు నుంచి శశిధర్ అపోలో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అంతకు ముందు ఆయన అమెరికాలోని క్లీవ్‌ల్యాండ్ క్లినిక్ ట్రెడిషన్ హాస్పిటల్ ప్రెసిడెంట్‌గా పని చేశారు. శశిధర్ నాయకత్వంలో అపోలో హాస్పిటల్స్ పేరు ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ ఆశాభావం వ్యక్తం చేసింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	66,330 ▲	60,800 ▲	80,300 ▲
ముంబై	65,589 ▼	60,080 ▼	73,844 ▼

భారత్‌లోనే విద్యుత్ కార్ల అసెంబ్లింగ్

ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ థిల్లాన్

ఇంగోల్‌స్టాట్ (జర్మనీ): జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ ఆడి భారత్‌లో విక్రయించే విద్యుత్ కార్లను దేశీయంగానే అసెంబ్లింగ్ చేసే ప్రయత్నంలో ఉంది. దీనివల్ల కస్టమర్లకు అందుబాటులో ఉండే వివిధ ధరల శ్రేణుల్లో కార్లను అందుబాటులోకి తెచ్చి కస్టమర్ బేస్ పెంచుకునే వీలు కలుగుతుందని ఆడి ఇండియా హెడ్ బల్బీర్ సింగ్ థిల్లాన్ అన్నారు. ఆడి కంపెనీ కొత్త ఎలక్ట్రిక్ కారు క్యూ6 ఈ-ట్రాన్‌ను ప్రపంచ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఈ ఏడాదిలోనే ఈ కారు ప్రపంచ మార్కెట్లలో ప్రవేశించనుంది. వచ్చే ఏడాది భారత మార్కెట్లో కూడా విక్రయాలు ప్రారంభం అవుతాయి. ఈ సందర్భంగా థిల్లాన్ మాట్లాడుతూ.. ఈ మోడల్‌లో విద్యుత్ వాహనాల రంగంలో తమ అస్తిత్వం మరింత పెరుగుతుందని అన్నారు. 2030 నాటికి తమ అమ్మకాల్లో 50 శాతం విద్యుత్ కార్లే ఉంటాయని భావిస్తున్నట్టు చెప్పారు. ఈ కారు ఒకసారి చార్జి చేస్తే 625 కిలోమీటర్లు నడుస్తుంది. ప్రస్తుతం విద్యుత్ కార్లన్నీ సీబీయూలుగా దిగుమతి చేసుకుని ఔరంగాబాద్ ప్లాంట్‌లో అసెంబ్లింగ్ చేస్తోంది. దీని వల్ల 60 శాతం నుంచి 100 శాతం వరకు కస్టమ్స్ సుంకాలు భరించాల్సి వస్తోంది. స్థానికంగానే ఉత్పత్తి చేయడం వల్ల ఆ భారం తగ్గి కస్టమర్లకు మరింత తక్కువ ధరకు కార్లు అందించగలుగుతామని థిల్లాన్ అన్నారు.

2025 నాటికి 20 కొత్త మోడల్స్: వచ్చే ఏడాది చివరికి తాము ప్రపంచ మార్కెట్లో 20 కొత్త మోడల్స్ ప్రవేశపెట్టాలనుకుంటున్నట్టు ఆడి ఏజీ సీఈఓ గెర్నాట్ డోల్నర్ చెప్పారు. వివిధ రకాల కార్ల అభివృద్ధి కార్యకలాపాలపై తాము 2024-28 మధ్య కాలంలో 4100 యూరోలు ఇన్వెస్ట్ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. గత ఏడాది తమ విద్యుత్ కార్ల డెలివరీలు 50 శాతం పెరిగినట్టు ఆయన చెప్పారు. 2023 సంవత్సరంలో ఆడి కంపెనీ 1.78 లక్షల విద్యుత్ కార్లు విక్రయించింది. ముందు ఏడాదితో పోల్చితే ఇది 51 శాతం అధికం.

మహబూబ్‌నగర్‌లో గ్లోబల్‌లాజిక్ కార్యాలయం

హైదరాబాద్: జపాన్ కంపెనీ హిటాచీ గ్రూప్‌నకు చెందిన గ్లోబల్ లాజిక్ మహబూబ్‌నగర్‌లో కొత్త కార్యాలయం ప్రారంభించింది. దీనివల్ల కంటెంట్ ఇంజనీరింగ్ బిజినెస్ కార్యకలాపాలు మహబూబ్‌నగర్ కేంద్రంగా చేపట్టగలుగుతుంది. 180 మంది పని చేయగల సామర్థ్యంతో 18,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన ఈ కేంద్రం తమకు ఇన్నోవేషన్, టెక్నాలజీ హబ్‌గా ఉపయోగపడుతుందని కంపెనీ తెలిపింది. డేటా, జీఐఎస్ సొల్యూషన్లు, అత్యాధునిక జెనరేటివ్ ఏఐ ప్రాజెక్టులు సహా విభిన్న రంగాల్లో అత్యున్నత నాణ్యత గల కార్యకలాపాలకు ఇది కేంద్రంగా ఉంటుందని పేర్కొంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో హబ్ అండ్ స్పోక్ విధానంలో కార్యకలాపాలు చేపట్టి స్థానిక ప్రతిభకు అవకాశాలు కల్పించడంలో ఇది తమ తొలి ప్రయత్నమని కంపెనీ వెల్లడించింది. విస్తరణ వ్యూహంలో భాగంగా తాము తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్‌తో భాగస్వామ్యం కుదుర్చుకున్నట్టు తెలిపింది. ఇన్నోవేషన్‌ను ప్రోత్సహించి ఆర్థిక వృద్ధిని ఉత్తేజితం చేయడం, ఉపాధి అవకాశాలు కల్పించడంలో తమ కట్టుబాటుకు మహబూబ్‌నగర్‌లో కార్యాలయం ప్రారంభం నిదర్శనమని గ్లోబల్ లాజిక్ ఏపీఏసీ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ ప్రెసిడెంట్ పీయూష్ ఝా అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



19వ తేదీ			
హైదరాబాద్	415	విజయవాడ	425
20వ తేదీ		విశాఖపట్నం	430
చిత్తూరు	478	వరంగల్	415
గోదావరి	425	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	101	గోదావరి	103
వరంగల్	101	విజయవాడ	103
కరీంనగర్	101	గుంటూరు	107
మహబూబ్‌నగర్	101	ఒంగోలు	107
కర్నూలు	101	చిత్తూరు	110
విశాఖపట్నం	98		

8.3% వడ్డీ రేటుకే గృహ రుణాలు: బీఓఐ

ముంబై: ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ ఇండియా (బీఓఐ) గృహ రుణాల వడ్డీ రేటు తగ్గించింది. ప్రస్తుతం గృహ రుణాలపై 8.45 శాతంగా ఉన్న వడ్డీ రేటును 8.3 శాతానికి తగ్గించింది. అయితే ఈ ఆఫర్ ఈ నెలాఖరు వరకు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ ఆఫర్ సందర్భంగా తీసుకునే గృహ రుణాలపై ప్రాసెసింగ్ చార్జీలను కూడా బ్యాంక్ రద్దు చేసింది. రూఫ్‌టాప్ సోలార్ ప్రాజెక్టులకూ ఈ నెలాఖరు వరకు 7 శాతం వడ్డీ రేటుకే రుణాలు ఇవ్వనున్నట్టు ప్రకటించింది.

గ్లెనిగల్స్ హెల్త్‌కేర్ ఇక గ్లెనిగల్స్ హాస్పిటల్స్

హైదరాబాద్: గ్లెనిగల్స్ హెల్త్‌కేర్ ఇండియా తన హాస్పిటల్స్ పేరు మార్చుకుంది. ఈ హాస్పిటల్స్ ఇక గ్లెనిగల్స్ హాస్పిటల్స్' పేరుతో వ్యవహరించబడతాయి. గ్లెనిగల్స్ హాస్పిటల్స్. హైదరాబాద్ సహా ముంబై, చెన్నై, బెంగళూరుల్లో మొత్తం 6 హాస్పిటల్స్‌ను నిర్వహిస్తోంది. ఈ హాస్పిటల్స్ మొత్తం 1,500 పడకలతో రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాయి. ఐహెచ్‌హెచ్ హెల్త్‌కేర్ గత ఏడాది ఆగస్టులో గ్లెనిగల్స్ హాస్పిటల్స్ ఈక్విటీలో 100 శాతానికి కొనుగోలు చేసింది.

ఉద్యమ ద్రోహులే పార్టీకి ద్రోహం చేస్తున్నారు

- అయోధ్యకు వెళితే బీజేపీలో చేరినట్లా?: శ్రీనివాస్‌గౌడ్
- సీఎం రేవంత్ రెడ్డిని జైల్లో పెట్టాలి: కొప్పుల ఈశ్వర్
- కవిత అరెస్టును ఖండిస్తున్నాం: బీఆర్ఎస్ మహిళా నేతలు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో ద్రోహం చేసి.. రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కొందరు.. ఇప్పుడు ద్రోహం చేసి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారని మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతలు కొప్పుల ఈశ్వర్, బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వంలో ఉన్నపుడు పార్టీనుంచి ఎంతో లాభం పొందిన వారంతా ఇతర పార్టీల్లోకి వెళ్తూ తమ నైజం చాటుకుంటున్నారని విమర్శించారు. తాను బీజేపీలో చేరుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని, అయోధ్యను దర్శించేందుకు వెళ్లినంత మాత్రాన బీజేపీలో చేరినట్లా అని ప్రశ్నించారు. కొందరు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని వారిపై పరువు నష్టం దావావేస్తానని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. సభలు, సమావేశాల్లో నీచమైన భాష వాడుతున్న సీఎం రేవంత్ రెడ్డిపై క్రిమినల్ కేసుపెట్టి జైల్లో వేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సాక్షిగా ఉన్న ఎమ్మెల్సీ కవితను పార్లమెంటు ఎన్నికలకు ముందు నిందితురాలిగా మార్చడం రాజకీయ కుట్ర అని బీఆర్ఎస్ మహిళా నేతలు సత్యవతి రాథోడ్, గొంగిడి సునీత, హరిప్రియ నాయక్‌లు ఆరోపించారు. కవిత అరెస్టును ఖండిస్తున్నామని చెప్పారు. తెలంగాణలో కేసీఆర్‌ను, ఢిల్లీలో కేజ్రీవాల్‌ను రాజకీయంగా దెబ్బతీసేందుకు ఈడీని ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. కవిత నిర్దోషిగా బయటపడతారని వారు అన్నారు.

భూకబ్జా కేసు కొట్టేయాలని కన్నారావు పిటిషన్

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆదిభట్ల పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన భూకబ్జా కేసు కొట్టివేయాలంటూ మాజీ సీఎం కేసీఆర్ అన్న కొడుకు కల్వకుంట్ల కన్నారావు అలియాస్ తేజేశ్వర్ రావు హైకోర్టును ఆశ్రయించారు. కన్నారావు తమపై తన అనుచరులతో దాడి చేసి భూ ఆక్రమణకు పాల్పడ్డారని ఓఎస్ఆర్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ బండోజు శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కన్నారావు, అతని అనుచరులపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు కొట్టేయాలని కన్నారావు సహా పలువురు క్వాష్ పిటిషన్‌లు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లపై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ కే సుజన ధర్మాసనం తీర్పును బుధవారానికి వాయిదా వేసింది.

కలుషిత నీటితో ఆకుకూరల సాగును అడ్డుకోండి

- చెరువుల రక్షణకు కార్యాచరణ రూపొందించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కలుషిత జలాలతో జరుగుతున్న ఆకుకూరల సాగును అడ్డుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. కలుషిత నీటితో పండించిన ఆకుకూరలు ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని వ్యాఖ్యానించింది. అలాగే, ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లోని చెరువుల పునరుద్ధరణకు కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో చెరువుల ఆక్రమణలపై పిల్ దాఖలైన నేపథ్యంలో వాటిని పరిశీలించి నివేదిక ఇవ్వాలని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్, రెవెన్యూ శాఖ జీపీ శ్రీకాంత్‌రెడ్డితో హైకోర్టు కమిటీ వేసింది. ఈ కమిటీ 13 చెరువులను పరిశీలించి.. అక్కడి సమస్యలను, తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తూ హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఉప్పల్ నల్లచెరువు కలుషిత జలాలలో ఆకుకూరలు పండిస్తున్నారని కమిటీ తన నివేదికలో పేర్కొంది. మంగళవారం ఈ నివేదికను పరిశీలించిన న్యాయస్థానం ఆకుకూరల అంశంపై ఆందోళన వ్యక్తం చేసింది. చెరువుల రక్షణ, పునరుద్ధరణకు కమిటీ సిఫారసుల ఆధారంగా ఆరువారాల్లో కార్యాచరణ రూపొందించాలని పేర్కొంటూ తదుపరి విచారణను ఏప్రిల్ 29కి వాయిదా వేసింది.

అరుణోదయను నిషేధిత సంస్థ అనడం సరికాదు

- సిరిసిల్ల ఎస్పీ వ్యాఖ్యలను ఖండించిన విమలక్క

రాంనగర్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'అరుణోదయ'ను నిషేధిత సంస్థగా సిరిసిల్ల ఎస్పీ చేసిన వ్యాఖ్యలను ఆ సంస్థ తీవ్రంగా ఖండించింది. మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సంస్థ అధ్యక్షులు మోహన్ బైరాగి, ప్రధాన కార్యదర్శి మల్సూర్, గౌరవ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య (ఏసీఎఫ్) 1974లో ఏర్పడి 50 సంవత్సరాలుగా ప్రజల కోసం గళం విప్పి పనిచేస్తోందని వారు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో కీలకపాత్ర పోషించి ప్రజల మన్ననలు పొందిన తమ సంస్థను సిరిసిల్ల ఎస్పీ నిషేధిత సంస్థగా అభివర్ణించడం తగదన్నారు. సిరిసిల్ల జిల్లాలో పోకల సాయికుమార్ అనే లా విద్యార్థితో పాటు పురుషోత్తమరావుపై గత ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించిందన్నారు. ఆ సందర్భంగా ఎస్పీ తమ సంస్థను నిషేధిత సంస్థగా పేర్కొన్నారని చెప్పారు. నిషేధిత జాబితాలో ఏ పార్టీలు, ఏ ప్రజా సంఘాలు ఉన్నాయో కూడా తెలియకుండా ఎస్పీ స్థాయి అధికారి తమ సంస్థపై దుష్ప్రచారం చేయడం తగద న్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, తమ కార్యకర్తలపై తప్పుడు కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

రూ.91.98 లక్షల నగదు సీజ్

- హైదరాబాద్‌లో ఓ ద్విచక్రవాహనంలో రూ.25 లక్షలు పట్టివేత

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాష్ట్రవ్యాప్తంగా వాహన తనిఖీలు ముమ్మరంగా జరుగుతున్నాయి. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదు, ఇతర వస్తువులు, మద్యంను అధికారులు సీజ్ చేస్తున్నారు. మంగళవారం రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.91.98 లక్షల నగదును అధికారులు సీజ్ చేశారు. ఇందులో హైదరాబాద్‌లోని తారకరామ థియేటర్ సమీపంలో మంగళవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో భాగంగా ఓ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనంలో తరలిస్తున్న రూ.25 లక్షల నగదును సుల్తాన్ బజార్ పోలీసులు సీజ్ చేశారు. అలాగే, ద్విచక్రవాహనంపై వెళుతున్న ఓ వ్యక్తి నుంచి రూ.26 లక్షల నగదును రాజేంద్రనగర్ పోలీసులు పట్టుకున్నారు. కాగా, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.16.43 లక్షల నగదు, రూ.10,250 విలువైన వస్తువులను సీజ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ మంగళవారం ప్రకటించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో రూ.18.15 లక్షల నగదు, అక్రమంగా నిల్వ చేసిన రూ.32,170 విలువైన మద్యం, రూ.1.96 లక్షల విలువైన మిక్సీలు, గ్యాస్ స్టవ్‌లు, రైస్ కుక్కర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో రూ.9.5లక్షల నగదును వాడపల్లి చెక్‌పోస్టు వద్ద ఏపీకి వెళ్తున్న ఓ కారులో గుర్తించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారంలో రూ.2,85,000, కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)లో రూ.85 వేలు, మంచిర్యాల జిల్లా కాసిపేటలో రూ.2,70,000 నగదును సీజ్ చేశారు.

పోలీస్ స్టేషన్ రైటర్ అవినీతి రాత

- రూ.4 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ

మెదక్ అర్బన్, మార్చి 19: మెదక్ రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్‌గా పనిచేస్తున్న కానిస్టేబుల్ సురేందర్ రూ.4 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌లోని అవుసులపల్లి గ్రామానికి చెందిన కందుల రాములు (చంద్రం) గ్రామ అవసరాలకు ఇసుక తీసుకెళ్తుండగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకునే ప్రయత్నం చేశారు. రాములు తప్పించుకునిపోగా స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎస్సై రాములుకు ఫోన్ చేసి చెప్పడంతో ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తీసుకురమ్మన్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకుని రాములుపై ఇసుక అక్రమ రవాణా కేసు నమోదు చేశారు. స్టేషన్ బెయిల్, ట్రాక్టర్ విడుదల కోసం రైటర్ సురేందర్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. ఒప్పందం కుదిరిన తర్వాత స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. తర్వాత రాములు రూ.15 వేలు సురేందర్‌కు ఇచ్చాడు. మిగతా రూ.5 వేల కోసం ఒత్తిడి తెచ్చాడు. అప్పటికే మైనింగ్ శాఖకు రాములు రూ.5 వేలు జరిమానా చెల్లించాడు. ట్రాక్టర్ విడుదల లెటర్‌తో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. మిగతా రూ.5 వేలు కూడా ఇవ్వాల్సిందేనన్న రైటర్ సురేందర్ చివరకు రూ.4 వేలకు తగ్గాడు. అనంతరం రాములు ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. వారి సూచన మేరకు మంగళవారం సురేందర్‌కు రూ.4 వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రైటర్‌ను అదుపులోకి తీసుకుని అతడి ఇంట్లో సోదాలు నిర్వహించారు. లంచం డబ్బును 'సార్'కు ఇచ్చినట్లు అతడు వెల్లడించాడు. దాంతో సార్ ఎవరు? అనే కోణంలో విచారణ ప్రారంభించారు.

'కోడ్'.. కష్టాలు!

- కొత్త రేషన్ కార్డుల జారీకి బ్రేక్
- 'ప్రాధాన్య' సాగు నీటి ప్రాజెక్టులూ బందే
- అప్‌డేట్ కాని ధరణి.. ఇబ్బందుల్లో అర్జీదారులు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌తో అమల్లోకి వచ్చిన 'కోడ్'.. సామాన్య ప్రజలకు కష్టాలు తెచ్చిపెట్టింది. ప్రభుత్వం అమలు చేయాలని భావించిన కొత్త పథకాలకు బ్రేకులు పడడంతో ఎన్నో ఏళ్లుగా ఆశగా ఎదురుచూస్తున్న ప్రజలు.. మరికొన్ని రోజులు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేసే ప్రక్రియకు మళ్లీ బ్రేక్ పడింది. కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ... సంబంధిత పోర్టల్‌ను ఇంకా ప్రారంభించలేదు. ఈలోగానే పార్లమెంటు ఎన్నికల నగారా మోగటంతో కార్డుల జారీని మళ్లీ పెండింగ్ పెట్టాల్సి వచ్చింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ కూడా కసరత్తును నిలిపివేసింది. పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాతే కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు.. ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయదలుచుకున్న ప్రాధాన్య జాబితాలోని సాగునీటి ప్రాజెక్టుల పనులకూ బ్రేక్ పడింది. గోదావరి బేసిన్ పరిధిలో ప్రాణహిత-చేవెళ్ల, ఎల్లంపల్లి, చిన్నకాళేశ్వరం, మొడికుంటవాగు, ఇందిరమ్మ వరద కాలువ, దేవాదుల, చనకా కొరాటా, సీతారామ ఎత్తిపోతల పథకం, కృష్ణా బేసిన్ పరిధిలో పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వం ప్రాధాన్య ప్రాజెక్టుల జాబితాలో చేర్చింది. వాస్తవానికి ఈ దఫా బడ్జెట్‌లో నీటిపారుదల రంగానికి రూ.28,024 కోట్లు కేటాయించారు. ఈ నిధుల్లో రుణాలకు అసలు/వడ్డీలు పోనూ రూ.10వేల కోట్లను ప్రాజెక్టులకు వెచ్చించే అవకాశాలున్నాయి. అయితే, వీటిని పట్టాలెక్కించేలోపే పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ రావడంతో సర్కారు ఆశలు ఆవిరయ్యాయి. మరో 78 రోజుల పాటు ఎలాంటి పనులూ చేపట్టే అవకాశం లేకుండా పోయింది.

అందుబాటులోకి రాని లాగిన్‌లు

ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియ కూడా 'కోడ్' కారణంగా ఆగిపోయింది. గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌కు వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించకపోవడంతో కుప్పలు తెప్పలుగా పేరుకుపోయాయి. వీటిని పరిష్కరించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ నెల 1 నుంచి 9 వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. ఈ ప్రక్రియను ఈ నెల 17 వరకు పొడిగించింది. అయితే, ఎన్నికల కోడ్ నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్‌ను రెండు రోజుల కిందటే నిలిపివేయాల్సి వచ్చింది. ధరణి అప్‌డేట్ ప్రక్రియకు బ్రేక్ పడింది. మరోవైపు.. తాజా స్పెషల్ డ్రైవ్‌లో 1.20 లక్షల దరఖాస్తులను పరిశీలించారు. మిగిలిన దరఖాస్తులు కూడా పరిశీలించి పరిష్కరించాల్సి ఉంది. ఇప్పటికే పరిశీలించి, పరిష్కరించిన దరఖాస్తులకు సంబంధించిన సమాచారం అర్జీదారులకు మెసేజ్ రూపంలో వెళ్లాలి. కానీ, ఆర్డీవోల లాగిన్‌లు ఓపెన్ కాకపోవడం, తహసీల్దార్ల లాగిన్‌లు పని చేస్తున్నా డిజిటల్ సంతకాలు రాకపోవడం ఇబ్బందిగా మారింది. దీంతో అర్జీదారులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఏ సాఫ్ట్‌వేర్ వాడారు?

(మొదటి పేజీ తరువాయి)

ఎక్కడ కొనుగోలు చేశారు? ఆ టూల్ కొనుగోలుకు ఫండింగ్ చేసిందెవరు?" అనే ప్రశ్నలకు సమాధానం రాబట్టేందుకు యత్నించినట్లు సమాచారం. ఈ వివరాలు బయటకు పొక్కొద్దనే ఉద్దేశంతోనే ప్రణీత్‌రావు హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ హార్డ్‌డిస్క్‌లను కటర్‌తో ధ్వంసం చేసి, అనంతగిరి అడవుల్లో పారేసినట్లు ప్రణీత్‌రావు వాంగ్మూలమివ్వడంతో.. ఓ బృందం ఇప్పుడు ఆ శకలాల కోసం అన్వేషిస్తోంది. అయితే.. హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేస్తే.. వాటిల్లోని డేటాను రిట్రీవ్ చేయడం దాదాపు అసాధ్యమని సైబర్‌సెక్యూరిటీ నిపుణులు చెబుతున్నారు. "హార్డ్‌డిస్కలలో ఉండే సెక్టార్లు అత్యంత సున్నితంగా ఉంటాయి. వాటిని విద్యుదయస్కాంత క్షేత్రాల వద్ద పెట్టినా.. సెక్టార్లు ధ్వంసమవుతాయి. అలాంటిది.. హార్డ్‌డిస్క్‌లను ధ్వంసం చేసి, అడవుల్లో పారేస్తే.. సెక్టార్లు పూర్తిగా దెబ్బతిని ఉంటాయి. ఆ సెక్టార్లకు ఎండ తగిలినా డేటా తుడిచిపెట్టుకుపోతుంది" అని సైబర్ సెక్యూరిటీ నిపుణుడొకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. అయితే.. ప్రణీత్‌రావు సెల్‌ఫోన్ డేటాను రిట్రీవ్ చేసినట్లు తెలిసింది. అందులోని చాటింగ్ డేటా ఆధారంగా ప్రణీత్‌రావును ప్రశ్నిస్తున్నారు.



కుట్రలో భాగస్వాముల అరెస్టులు షురూ..

ఈ కేసులో ప్రణీత్‌రావుకు విజిలెన్స్‌లో పనిచేసే ఓ ఎస్పీ మొదలు.. పలువురు ఇన్‌స్పెక్టర్లు సహకరించినట్లు దర్యాప్తు అధికారులు ఇప్పటికే గుర్తించారు. ఈ క్రమంలో వరంగల్‌కు చెందిన ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను మంగళవారం ఉదయం అరెస్టు చేసినట్లు తెలిసింది. వారిని హైదరాబాద్‌లో ఓ రహస్య ప్రదేశంలో విచారిస్తున్నారు. ప్రణీత్‌రావు పోలీసు కస్టడీ ముగిసేలోపే.. వీరిని ముఖాముఖి కూర్చోబెట్టి ప్రశ్నించనున్నారు. మరో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లను సోమవారం విచారించినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇక ప్రణీత్‌రావుకు సహకరించిన అధికారులు, ఎస్ఐబీ ఉన్నతాధికారులు.. ఇలా వరుసపెట్టి విచారణలు, అరెస్టులు ఉంటాయని తెలుస్తోంది.



హైకోర్టును ఆశ్రయించిన ప్రణీత్‌రావు

తనను దిగువ కోర్టు నిబంధనలకు విరుద్ధంగా పోలీసు కస్టడీకి అనుమతించిందని, ఆ ఆదేశాలను కొట్టివేయాలని కోరుతూ మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు తన అడ్వొకేట్ ద్వారా మంగళవారం హైకోర్టును ఆశ్రయించారు. "నాంపల్లి మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు యాంత్రికంగా రిమాండ్‌కు అనుమతినిచ్చింది. పోలీసు కస్టడీలో ఎంతసేపు ప్రశ్నించాలి? ఏ సమయం వరకు? అనేది పేర్కొనలేదు. రోజువారీ దర్యాప్తు పూర్తవ్వగానే జైలుకు తరలించాలి. కానీ, పోలీస్‌స్టేషన్‌లోనే నిర్బంధిస్తున్నారు. నిద్రపోవడానికి కూడా అక్కడ సదుపాయాల్లేవు" అని ఆయన కోర్టుకు అందజేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా ఈ కేసుకు సంబంధించిన వివరాలను మీడియాకు లీకులుగా అందజేస్తున్నట్లు వివరించారు. "నన్ను బంజారాహిల్స్ ఠాణాలో రహస్యంగా విచారిస్తున్నారు. నా రక్తసంబంధీకులు, కనీసం నా అడ్వొకేట్‌ను కూడా కలవనివ్వడం లేదు. నాపై ఫిర్యాదు చేసిన ఎస్ఐబీ అదనపు ఎస్పీ రమేశ్ విచారణలో ఎలా పాల్గొంటారు? రిమాండ్ కాపీని నాకు, న్యాయవాదికి చాలా ఆలస్యంగా అందజేశారు. దాని వల్ల అప్పీల్ చేసుకోవడంలో ఆలస్యమేర్పడింది" అని కోర్టుకు వివరించారు. డీకే బసు, పరంజిత్‌సింగ్ సైనీ కేసుల్లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను దిగువకోర్టు పోలీసులకు కచ్చితంగా నిర్దేశించలేదని తెలిపారు. ఇంటరాగేషన్ సమయం విషయంలోనూ బీవీరావు కేసులో ఇదే హైకోర్టు ఇచ్చిన తీర్పు(రాత్రి 8 నుంచి ఉదయం 8 గంటల వరకు దర్యాప్తు చేయకూడదు)ను పాటించాలనే షరతులను కిందికోర్టు విధించలేకపోయిందని వాపోయారు. ఈ పిటిషన్ మంగళవారం జస్టిస్ రాధారాణి ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలంటూ రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావును ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

ఫోన్ ట్యాపింగ్‌లో నన్ను ఇరికించే కుట్ర

- బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదు
- అవినీతిపరులే వెళ్లిపోతున్నారు: ఎర్రబెల్లి



రాంనగర్, మార్చి 19: తాను పార్టీని వీడబోనని, గిట్టని వారు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. కొందరు అవినీతిపరులు.. తమ ఆస్తులను కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌ను వీడి అధికార కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆరోపించారు. అవకాశవాదులు పోయినంత మాత్రాన ఆందోళ చెందాల్సిన అవసరం లేదని, తాము కేడర్‌కు అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. హనుమకొండలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కలిసి పనిచేసి బీఆర్ఎస్‌ను బలోపేతం చేద్దామని కార్యకర్తలకు సూచించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంతో తనకు సంబంధం లేదని ఎర్రబెల్లి పేర్కొన్నారు. ప్రణీత్‌రావు అమ్మమ్మ ఊరు పర్వతగిరి అని, ఆయనతో తనకు పరిచయం కూడా లేదని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో తనను ఇరికించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ ఫొటో పెట్టుకుని విజయం సాధించి, అధికారాన్ని అనుభవించి, స్వలాభం కోసం పార్టీని వీడటం సిగ్గుచేటన్నారు. ఎండిన ఆకులు రాలిపోయినా.. చెట్టు వేర్లు బలంగానే ఉన్నాయని, మళ్లీ చిగురిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో చోటా భాయ్, కేంద్రంలో బడా భాయ్ కలిసి కేసీఆర్‌పై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. పార్ట్‌టైమ్ రాజకీయనేతలు పార్టీ మారినంత మాత్రాన జరిగే నష్టమేమీ లేదని పేర్కొన్నారు.

ఇలాగైతే ఉండలేం..

- మహారాష్ట్రలో బీఆర్ఎస్‌ను వీడుతున్న పలువురు నేతలు
- లోక్‌సభ ఎన్నికలపై అధిష్ఠానం స్పందించకపోవడంవల్లే..

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో బీఆర్ఎస్ ఉనికి కోల్పోతోంది. ఆ రాష్ట్రానికి చెందిన పార్టీ నేతలు క్రమంగా తమ దారి తాము చూసుకుంటున్నారు. తాజాగా మహారాష్ట్ర బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, రైతు సంఘం నేత మాణిక్‌రావు కదం మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఆ వెంటనే ఎన్సీపీలో చేరారు. ఆ పార్టీ ఆయనను మహారాష్ట్ర కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించింది. ఆయనే కాదు.. ఆ రాష్ట్రంలోని పలువురు బీఆర్ఎస్ నేతలు ఇతర పార్టీల్లో చేరుతున్నట్లు తెలుస్తోంది. "లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున మహారాష్ట్రలో అభ్యర్థులను నిలుపుతామన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత మా రాష్ట్రంపై పూర్తిస్థాయి దృష్టి పెడతామన్నారు. ఇప్పుడు చడీచప్పుడు లేకుండా ఉన్నారు. ఈ పరిస్థితిలో ఏదో ఒకటి చెప్పాలి" అంటూ మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు ఇటీవలే కేసీఆర్‌కు లేఖ రాసిన సంగతి తెలిసిందే. ఇది జరిగి పదిరోజులు గడిచినా.. పార్టీ అధిష్ఠానం స్పందించకపోవడంతో వారంతా తలో దారీ చూసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో పోటీపై స్పష్టత ఇవ్వనందునే తమ నిర్ణయం తాము తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని వారు చెబుతున్నారు. "మహారాష్ట్రలో స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేద్దామన్నారు. తక్కువ సమయం ఉందని వెనుకంజ వేశారు. జాతీయ స్థాయిలో పార్టీని బలంగా తీసుకువెళ్తామంటూ వెతికి వెతికి మరీ.. ప్రజాసంఘాలు, వివిధ పార్టీలకు చెందిన నేతల్లో ఆసక్తి పెంచి.. వచ్చిన వారందరినీ బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకున్నారు. ఇప్పుడా ఊసే ఎత్తడం లేదు" అని మహారాష్ట్ర బీఆర్ఎస్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వడగళ్ల నష్టం... రోడ్డెక్కిన రైతన్న

- నష్టపరిహారం కోసం కామారెడ్డి జిల్లా భిక్కనూరులో రైతుల రాస్తారోకో
- రైతులు అప్రమత్తంగా ఉండాలి: తుమ్మల
- ఎకరాకు రూ.10వేలివ్వాలి: హరీశ్

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్, మార్చి 19: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వడగళ్ల వాన వల్ల జరిగిన పంటనష్టానికి గానూ తమకు నష్టపరిహారం చెల్లించాలని కామారెడ్డి జిల్లా భిక్కనూరు టోల్‌గేట్ వద్ద మంగళవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. వేల ఎకరాల్లో వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలతో పాటు బొప్పాయి, మామిడి, జామ తోటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని, ప్రభుత్వం ఇప్పటివరకు దీనిపై స్పందించకపోవడం విచారకరమన్నారు. నేడు కూడా స్పందించకపోతే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న వ్యవసాయాధికారులు, కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వర్‌రావు, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి అక్కడికి చేరుకుని.. పంట నష్టాన్ని అంచనా వేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తామని, నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు నిరసనను విరమించారు. కాగా, రెండు రోజులుగా ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా వడగళ్ల వానలు కురుస్తున్నాయి. దీంతో యాసంగిలో సాగు చేసిన జొన్న, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే చేతికి వచ్చిన జొన్న, మొక్కజొన్న పంటల నూర్పిడికి.. ఈ వర్షాలు ఇబ్బందికరంగా మారాయని రైతులు వాపోతున్నారు. అదీగాక నువ్వు పంట ఎదుగుదలకు కూడా ఆటంకంగా మారాయన్నారు. మంగళవారం బోథ్, తలమడుగు, ఆదిలాబాద్, జైనథ్, సిరికొండ,



భిక్కనూరు జాతీయ రహదారిపై రైతుల రాస్తారోకో

ఇచ్చోడ, ఇంద్రవెల్లి పలు మండలాల్లో మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురిశాయి. తలమడుగు మండలంలో పర్యటించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేటలో ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. నిమిషాల వ్యవధిలోనే వృక్షాలు నేలకూలడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం, ఇండ్లు ధ్వంసం కావడం, రోడ్లపై వరద పోటెత్తడం జరిగిపోయాయి. పలుచోట్ల పంటలకు నష్టం వాటిల్లింది. వెంటనే ఎమ్మెల్యే హరీశ్‌రావు అధికారులను అప్రమత్తం చేశారు. వాతావరణంలో మార్పులతో రాష్ట్రంలో అకాల వర్షాలు కురుస్తున్నందున రైతాంగమంతా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మార్కెట్‌కు తీసుకొచ్చే పంటలు దెబ్బతినకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. అకాల వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం చెల్లించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వడగళ్ల వానతో పంటనష్టం జరుగుతున్నా పభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు.

మూడు రోజులపాటు వర్షాలు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాగల మూడు రోజులపాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం వెల్లడించింది. కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో వాతావరణంలో మార్పులు వచ్చినట్లు పేర్కొంది.

మహిళలకు భూమి హక్కు కల్పించాలి

- రుణాలు, సబ్సిడీలతో సాగుకు ఊతమివ్వాలి
- వ్యాపారం చేసుకునేలా నైపుణ్య శిక్షణ ఇవ్వాలి
- నారీశక్తి పురస్కార గ్రహీత రుక్మిణీరావు

నల్లగొండ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంపై ఆధారపడిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు భూమిపై హక్కులు కల్పించాలని, ప్రధానంగా ఒంటరి మహిళలకు భూమి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నారీశక్తి పురస్కార గ్రహీత, సామాజిక కార్యకర్త రుక్మిణీరావు అన్నారు. మహిళా రైతులపై వ్యవస్థీకృత హింస-స్వభావం-రూపాలపై.. సొప్పెకామ్, మహిళా కిసాన్ అధికార్ మంచ్, గ్రామ్య రిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ సంస్థల ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లాలో జరిపిన అధ్యయన వివరాలు, మహిళా రైతుల అభ్యున్నతికి కావలసిన సిఫారసులను మంగళవారం నల్లగొండలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె వెల్లడించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు, సబ్సిడీలు, వ్యవసాయ విస్తరణ, మార్కెటింగ్ సదుపాయాలను ప్రభుత్వం అందించాలని సూచించారు. విత్తనాలు, నీటి వసతి కల్పించడంతో పాటు, చిరుధాన్యాల సాగుకు సహకారం అందించాలన్నారు. స్థానిక వనరుల ఆధారంగా చిన్న తరహా పరిశ్రమలు, గ్రూప్ బిజినెస్ చేసుకునేలా మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు జిల్లా స్థాయిలో ప్రణాళికలు అమలు చేయాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాల్లోని మహిళలకు జీవో-194 ప్రకారం నష్ట పరిహారం, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని, పిల్లల చదువులకు ఆర్థిక సాయం చేయడంతో పాటు, త్రిసభ్యకమిటీ ద్వారా అప్పులను తీర్చాలని సూచించారు. ఇల్లు లేని మహిళలకు ఇల్లు, పింఛన్, రేషన్‌కార్డులు, ఆరోగ్య శ్రీకార్డులను ఇవ్వాలని కోరారు. గ్రామ పంచాయతీ సభ్యులు, సర్పంచులు, మహిళా గ్రూపులు.. గ్రామ సమాఖ్య సంఘాల్లోని మహిళలకు గృహ హింస చట్టం, లైంగిక వేధింపుల నివారణ చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. గుడుంబా, గంజాయి విక్రయాలను నిరోధించడానికి చొరవ తీసుకోవాలని కోరారు. స్త్రీలపై హింసను నిరోధించడానికి ప్రభుత్వ వ్యవస్థలు మండల స్థాయిల్లో జెండర్ రిసోర్స్ కేంద్రాలను స్థాపించి.. మహిళా రైతులకు, గ్రామీణ అసంఘటిత రంగ మహిళలకు అందుబాటులోకి తేవాలన్నారు. వ్యవసాయాన్ని పనిస్థలంగా గుర్తించాలని, అక్కడ జరిగే వేధింపులను నివారణకు జిల్లా పాలనా వ్యవస్థ ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టాలని.. కలెక్టర్, పోలీస్ శాఖ, మహిళా సంక్షేమ, వ్యవసాయ, రెవెన్యూ పంచాయతీ శాఖల అధికారులు, పౌర సంఘాలు ఈ ప్రచారాన్ని కొనసాగించాలని రుక్మిణీరావు సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్, ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి, వివిధ సంస్థల ప్రతినిధులు వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న రుక్మిణీరావు

బౌద్ధ సాహితీవేత్త చంద్రశేఖర్ మృతి

- బుద్ధిజం ప్రచారకుడిగా పలు అనువాదాలు, రచనలు
- పీపుల్స్‌వార్ సెంట్రల్ ఆర్గనైజర్‌గా విప్లవ ఉద్యమం



హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బౌద్ధ సాహిత్య రచయిత, అనువాదకుడు, పీపుల్స్‌వార్ పార్టీ మాజీ సెంట్రల్ ఆర్గనైజర్ దేవన చంద్రశేఖర్(65) చనిపోయారు. తాను తెలుగులోకి అనువదించిన అంబేడ్కర్ 'కుల నిర్మూలన' పుస్తక ప్రచురణ నిమిత్తం హైదరాబాద్ వచ్చిన ఆయన.. మంగళవారం ఉదయం 9 గంటలకు ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో స్నేహితులతో మాట్లాడుతూ కుప్పకూలారు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే గుండెపోటుతో చనిపోయారని వైద్యులు తెలిపారు. చంద్రశేఖర్ స్వస్థలం ఏపీలోని ఉమ్మడి ప్రకాశం జిల్లా వేటపాలెం. గుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న సమయంలో ఆయన సామ్యవాద సిద్ధాంతానికి ఆకర్షితుడయ్యారు. రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ) కార్యకర్తగా నాలుగేళ్లు పనిచేశారు. అనంతరం పీపుల్స్‌వార్ పార్టీ సెంట్రల్ ఆర్గనైజర్‌గా 1987వరకు కొనసాగారు. విప్లవోద్యమం నుంచి బయటకు వచ్చిన చంద్రశేఖర్ 1990లో బుద్ధిస్టుగా మారారు. విలువైన బౌద్ధ గ్రంథాలను తెలుగులో పరిచయం చేసిన చంద్రశేఖర్ మరణం బాధాకరమని ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి, సాహిత్య విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, పీకాక్ క్లాసిక్స్ గాంధీ తదితరులు విచారం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ భౌతిక కాయాన్ని వేటపాలెం తీసుకెళ్లారు. బుధవారం మచిలీపట్నంలోని వైఎస్ఆర్ మెడికల్ కళాశాలకు తండ్రి భౌతిక కాయాన్ని అందిస్తామని చంద్రశేఖర్ కుమారులు శ్రీధర్, భరత్ తెలిపారు.

రాజకీయ నేతలను
లోకాయుక్త పరిధిలోకి తేవాలి

» అధికారులను కూడా తీసుకురావాలి: కోదండరాం

బర్కత్‌పుర, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతిని నిర్మూలించడానికి.. రాజకీయ నాయకులను, అధికారులను కూడా లోకాయుక్త పరిధిలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలంగాణ జనసమితి వ్యవస్థాపకులు ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, కాళేశ్వరం పేరుతో వేల కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఓ ప్రణాళిక అంటూ లేకుండా అప్పులు చేశారని, వాటిని తీర్చటం ప్రస్తుత ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారిందన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో 'చేతన సొసైటీ' ఆవిర్భావ సదస్సుకు కోదండరాం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. చిన్నపాటి కేసుల్లో ఇరుక్కున్న వారి పట్ల సానుభూతితో వ్యవహరించాలని, రూ.కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వారిని మాత్రం కఠినంగా శిక్షించాలని ఆయన అభిప్రాయపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టారని, టెండర్లను పిలిచారని, డిజైన్లలో కూడా పలు లోపాలున్నాయని తెలిపారు. ప్రాజెక్టుల పేరుతో రాష్ట్రాన్ని లూటీ చేశారని, కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను మాత్రం పట్టించుకోలేదన్నారు. కర్ణాటకలో మాదిరిగా లోకాయుక్తను బలోపేతం చేయాలని, అప్పుడే అవినీతి రహిత తెలంగాణ ఏర్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చేతన సొసైటీ అధ్యక్షురాలు ఎస్కే ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలను మోదీ వక్రీకరించారు

» ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘనే: నిరంజన్

» తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోంది: మల్లు రవి

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మనం ఒక పార్టీకో, వ్యక్తికో వ్యతిరేకంగా పోరాడట్లేదని, ఒక శక్తికి వ్యతిరేకంగా పోరాడుతున్నామంటూ భారత్ జోడో న్యాయయాత్ర ముగింపు సందర్భంగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను జగిత్యాల సభలో ప్రధాని మోదీ వక్రీకరించారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. తద్వారా ప్రజల్లో మతపరమైన భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. ఇది కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌కు మంగళవారం లేఖ రాశారు.సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని వంద రోజుల పాలన.. దేశానికే ఆదర్శంగా నిలిచిందని, దేశంలో ప్రస్తుతం తెలంగాణ మోడల్‌పై చర్చ జరుగుతోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మల్లు రవి అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి నియామకంలోనూ సామాజిక న్యాయానికి పెద్ద పీట వేస్తున్నారన్నారు. రాష్ట్ర కేబినెట్ కూర్పు మొదలుకొని సీఎం కార్యాలయంలో అధికారులు, ఇటీవలి కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాల వరకు రేవంత్ ప్రభుత్వం సామాజిక సమతుల్యత పాటించిందన్నారు. రాష్ట్రంలో గతంలో ఎన్నడూ కూడా ఇంత లోతుగా కుల సమీకరణాలు, సామాజిక న్యాయం చూస్తూ పదవులు, అధికారిక పంపకాలు జరగలేదని అన్నారు. బీజేపీలో బీఆర్ఎస్ పార్టీ విలీనానికి కేసీఆర్ ప్లాన్ చేస్తున్నారని టీపీసీసీ నేత గజ్జెల కాంతం అన్నారు. గాంధీభవన్‌లో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ కవిత.. తన అక్రమ సంపాదనను లిక్కర్‌లో మాత్రమే కాని, విదేశాల్లోనూ పెట్టుబడులు పెట్టిందని ఆరోపించారు. సీబీఐకి చిత్తశుద్ధి ఉంటే పూర్తి విచారణ జరపాలన్నారు. కాగా, కంటోన్మెంట్ బీజేపీ నేత శ్రీ గణేష్ మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభంజనం

» రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లు ఖాయం: జి.చిన్నారెడ్డి

» కాంగ్రెస్‌లో చేరిన మజ్లిస్, బీఆర్ఎస్ నేతలు

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం వీస్తోందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి తెలిపారు. గాంధీ భవన్‌లో రాష్ట్రంలోని పలు జిల్లాలతో పాటు జూబ్లీహిల్స్‌కు చెందిన మజ్లిస్ పార్టీ నాయకుడు గొంటి విక్రమ్ యాదవ్ ఆధ్వర్యంలో మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు చిన్నారెడ్డి సమక్షంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి చిన్నారెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదని, కేంద్రంలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ జోడో యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని అన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ 14 ఎంపీ సీట్లు గెలుచుకోవడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ముందుకు దూసుకుపోతోందని చిన్నారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వంద రోజుల పాలనకు ప్రజలు నీరాజనం పలుకుతున్నారన్నారు. రానున్న పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు పని చేసి పార్టీ ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోండి

» సీఎం రేవంత్‌కు కూనంనేని సాంబ శివరావు లేఖ

హైదరాబాద్, మార్చి19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య విభాగంలో తొలగించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. మిషన్ భగీరథ పథకం కింద 2015 నుంచి పని చేస్తున్న 662 మంది వర్క్‌ఇన్‌స్పెక్టర్లు, 47 మంది జూనియర్ అసిస్టెంట్లను పనులు ముగిసిన తర్వాత తొలగించారని, దీని వల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని తెలిపారు. వారంతా ఉన్నత విద్యావంతులే అయినందున ప్రభుత్వం పునరాలోచన చేసి.. ప్రత్యామ్నాయ విభాగంలో ఉపాధి చూపాలని కోరారు.

విద్యుత్ సంస్థల్లో కోడ్ కొండెక్కాకే డైరెక్టర్ల భర్తీ

» డిస్కమ్‌లలో ఖాళీగా, జెన్‌కో, ట్రాన్స్‌కోలో పాత వారే

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో, దక్షిణ డిస్కమ్ (ఎస్పీడీసీఎల్-హైదరాబాద్), ఉత్తర డిస్కమ్ (ఎన్పీడీసీఎల్-వరంగల్)లో ఖాళీగా ఉన్న డైరెక్టర్ల భర్తీకి బ్రేక్ పడింది. సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ప్రస్తుతానికి నియామక ప్రక్రియను పక్కన పెట్టనున్నారు. డిస్కమ్‌లలో డైరెక్టర్లందరినీ తొలగించి... చీఫ్ జనరల్ మేనేజర్ (సీజీఎం) స్థాయి అధికారులకు బాధ్యతలు ఇవ్వగా... జెన్‌కో, ట్రాన్స్‌కోలో మాత్రం కొత్త డైరెక్టర్లు వచ్చేదాకా పాత వారినే కొనసాగిస్తున్నారు. ఇప్పటికే జెన్‌కోలో ఇద్దరు డైరెక్టర్లు రాజీనామాలు చేసి వెళ్లిపోయారు. దాంతో కొత్త డైరెక్టర్ల నియామకం కోసం ఈనెల 1 వరకు దరఖాస్తుల స్వీకరణ జరిగింది. అయితే డైరెక్టర్ల ఎంపిక కోసం ప్రభుత్వం త్రిసభ్య కమిటీ వేయాల్సి ఉండగా... నోటిఫికేషన్ వచ్చేసింది. ట్రాన్స్‌కోలో ట్రాన్స్‌మిషన్, ప్రాజెక్ట్స్, ఫైనాన్స్ డైరెక్టర్లను, జెన్‌కోలో హైడల్, థర్మల్, కోల్, ఫైనాన్స్, హెచ్ఆర్ డైరెక్టర్లతో పాటు దక్షిణ డిస్కమ్(ఎస్పీడీసీఎల్-హైదరాబాద్)లో డైరెక్టర్(ప్రాజెక్ట్), డైరెక్టర్(ఆపరేషన్) డైరెక్టర్(కమర్షియల్), డైరెక్టర్(ఫైనాన్స్), ఉత్తర డిస్కమ్(ఎన్పీడీసీఎల్-వరంగల్)లో డైరెక్టర్(ఫైనాన్స్), డైరెక్టర్(హెచ్ఆర్‌డీ అండ్ ఐఆర్), డైరెక్టర్(ఆపరేషన్స్), డైరెక్టర్(ప్రాజెక్ట్స్)ల కోసం దాదాపు 50కి పైగా దరఖాస్తులు వచ్చాయి. నిబంధనలు నిక్కచ్చిగా ఉండటం... ఇదివరకు లాగా కాకుండా ఐఏఎస్‌లు సీఎండీలుగా ఉండగా... అందులోనూ జెన్‌కో, ట్రాన్స్‌కో సీఎండీగా ఎస్ఏఎం రిజ్వీ ఉండటం వంటి కారణాలతో చాలా మంది దరఖాస్తు చేసుకోవడానికి వెనకడుగు వేసినట్లు తెలిసింది.

మల్కాజిగిరి నుంచి సునీత

(మొదటిపేజీ తరువాయి)

గంటలపాటు జరిగింది. సమావేశంలో తెలంగాణ, అరుణాచల్‌ప్రదేశ్, సిక్కిం, పశ్చిమ బెంగాల్, ఛత్తీస్‌గఢ్, అండమాన్ నికోబార్, పుదుచ్చేరి, కర్ణాటక, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాలకు చెందిన 85 మంది పేర్లపై చర్చలు జరిగాయి. తెలంగాణ నుంచి పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఈసీ సభ్యుడు ఉత్తమ్ కుమార్ రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. ఈనెల 21న మిగిలిన ఆదిలాబాద్, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, కరీంనగర్, భువనగిరి స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేయనున్నట్లు సమాచారం.


చేవెళ్ల అభ్యర్థి రంజిత్‌రెడ్డి

గవర్నర్‌గా రాధాకృష్ణన్



(మొదటిపేజీ తరువాయి)

తమిళిసై రాజీనామా తర్వాత తెలంగాణకు కొత్త గవర్నర్‌ను నియమించాల్సి ఉంది. కానీ, లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జార్ఖండ్ గవర్నర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఎన్నికలు ముగిసే వరకూ ఆయనే గవర్నర్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఇక, ఇప్పటి వరకు కొనసాగిన తమిళిసై గతంలో తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన విషయం తెలిసిందే. ఇప్పుడు రాధాకృష్ణన్ కూడా అదే నేపథ్యం నుంచి వచ్చారు. బాల్యం నుంచే ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన రాధాకృష్ణన్.. గతంలో తమిళనాడు బీజేపీ శాఖ అధ్యక్షుడిగా పని చేశారు. తమిళనాట పార్టీ బలోపేతానికి ప్రయత్నించారు. కమ్యూనిస్టుల అడ్డాగా పేరుగాంచిన కోయంబత్తూరు లోక్‌సభ స్థానం నుంచి 1998లో తొలిసారిగా విజయం సాధించారు. మరుసటి ఏడాదే మళ్లీ జరిగిన 1999 ఎన్నికల్లోనూ రెండోసారీ విజయబావుటా ఎగరేశారు. 2014లో అన్నాడీఎంకే అభ్యర్థి, 2019లో సీపీఎం అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. ఇటీవలి వరకూ బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, కొంతకాలంపాటు కేరళ ఇన్‌చార్జిగానూ వ్యవహరించారు. కొబ్బరి, కొబ్బరి ఉత్పత్తులను ప్రోత్సహించే ఆల్ ఇండియ కాయిర్ బోర్డుకు అధ్యక్షుడిగానూ పని చేశారు. ఎన్డీఏ కూటమి నుంచి 2004లో డీఎంకే వైదొలగిన తర్వాత కూటమిలోకి అన్నాడీఎంకే రావడంలో కీలక పాత్ర పోషించారు. అప్పట్లో అన్నాడీఎంకే అధినేత్రి జయలలితతో పలుమార్లు సమావేశమై ఆమెను ఒప్పించారు. గత ఏడాది ఫిబ్రవరిలో ఆయనను జార్ఖండ్ గవర్నర్‌గా నియమించారు. కాగా, తన రాజీనామాను ఆమోదించినందుకు రాష్ట్రపతి ముర్ముకు తమిళిసై ధన్యవాదాలు తెలిపారు. తనకు ఈ అవకాశం ఇచ్చిన ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, తెలంగాణ గవర్నర్‌గా, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు రాధాకృష్ణన్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి ఆయన తెలంగాణ రాజ్‌భవన్‌కు చేరుకున్నారు.

మహువాపై సీబీఐ దర్యాప్తునకు
లోక్‌పాల్ ఆదేశం

» ఆరు నెలల్లో నివేదిక సమర్పించాలని సూచన

న్యూఢిల్లీ, మార్చి 19: లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు బహుమతులు తీసుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న తృణమూల్ కాంగ్రెస్ నాయకురాలు మహువా మొయిత్రాను విచారించాలని సీబీఐని మంగళవారం లోక్‌పాల్ ఆదేశించింది. ఆమెపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు జరిపి ఆరు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించింది. దర్యాప్తు పురోగతిపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాలని కూడా ఆదేశించింది. వ్యాపారవేత్త దర్శన్ హీరనందాని నుంచి బహుమతులు తీసుకొని ఆయన సూచనల మేరకు గౌతమ్ అదానీ కంపెనీలను లక్ష్యంగా చేసుకొని లోక్‌సభలో ప్రశ్నలు అడిగినట్టు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి.

అరెస్టు అక్రమం

(మొదటిపేజీ తరువాయి)



అరెస్ట్ చేసే ముందు తమ వద్ద ఉన్న సాక్ష్యాధారాలను లిఖిత పూర్వకంగా నమోదు చేయాల్సి ఉందని, కానీ, దీనిని ఈడీ పట్టించుకోలేదని పేర్కొన్నారు. వ్యక్తి స్వేచ్ఛను కట్టడి చేస్తూ మనీలాండరింగ్ చట్టం 2002కి మనీ/ఫైనాన్స్ బిల్లు ద్వారా సవరణ చేయడం రాజ్యాంగ ఉల్లంఘన కిందికి వస్తుందన్నారు. మనీలాండరింగ్ చట్టం సెక్షన్ 19ని మహిళపై ప్రయోగించడాన్ని చట్ట విరుద్ధంగా పరిగణించాలని కోర్టుకు కవిత విజ్ఞప్తి చేశారు. ఈ నెల 15వ తేదీన ఈడీ తనను అరెస్టు చేసిన మరుసటి రోజే ప్రత్యేక కోర్టు తనను రిమాండ్‌కు పంపిందని, ఇదంతా పూర్తి యాంత్రికంగా జరిగిందని, ఇలా అనుచితంగా రిమాండ్‌కి పంపడం ఆర్టికల్ 21, 22(1)(2) కింద రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేనని పిటిషన్‌లో పేర్కొన్నారు. తనకు దర్యాప్తు సంస్థల సమన్ల జారీపై గతంలో సుప్రీంకోర్టులో తాను వేసిన పిటిషన్‌పై విచారణ పెండింగులో ఉన్నందున.. విచారణ పూర్తయ్యేవరకూ సమన్లు ఇవ్వబోమని ఈడీ సుప్రీంకోర్టు ఎదుట హామీ ఇచ్చిందని, ఇప్పుడు ఆ హామీని ఉల్లంఘించిందని కవిత పేర్కొన్నారు. ఈ కారణాల నేపథ్యంలో తన విడుదలకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోర్టుకు కవిత విజ్ఞప్తి చేశారు. కాగా, సర్వోన్నత న్యాయస్థానంలో కేసు విచారణ జరుగుతుండగానే తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, కోర్టు ధిక్కరణకు పాల్పడినట్లు భావించి, దర్యాప్తు సంస్థపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కవిత సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే.. ఆమె వేసిన పిటిషన్ అసంపూర్తిగా ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. నిబంధనల మేరకు పిటిషన్ పూర్తి చేసి దాఖలు చేసిన తర్వాతే విచారిస్తామని స్పష్టం చేసింది. దీనితో కవిత తరపున న్యాయవాదులు మంగళవారం మరోసారి పిటిషన్ దాఖలు చేశారు.

రిట్ పిటిషన్ ఉపసంహరణ

గతంలో సుప్రీంకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను కవిత వెనక్కి తీసుకున్నారు. ఢిల్లీ మద్యం కేసులో ఈడీ తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలని, మహిళలను దర్యాప్తు కార్యాలయాలకు పిలవకుండా ఇంటివద్దనే విచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గత ఏడాది మార్చి 14న కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 19వ తేదీకి వాయిదా వేసింది. అయితే, ఈ కేసులో ఇప్పటికే కవితను ఈడీ అధికారులు అరెస్టు చేశారని, కాబట్టి రిట్ పిటిషన్‌పై విచారణ అవసరం లేదని కవిత తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి మంగళవారం ధర్మాసనానికి తెలియజేశారు. తమ వ్యాజ్యాన్ని వెనక్కి తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కేసులో చట్ట ప్రకారం ఉపశమనం పొందేందుకు తదుపరి చర్యలకు వెళ్తామన్నారు. దీంతో కవిత రిట్ పిటిషన్ ఉపసంహరణకు జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం అంగీకరించింది.

తల్లి, కుమారులను కలుసుకునేందుకు అనుమతి

ఈడీ కస్టడీలో ఉన్న కవిత.. తన తల్లి శోభ, కుమారులు ఆదిత్య, ఆర్య, సోదరీమణులు అఖిల సౌమ్య, వినుత, సోదరుడు ప్రశాంత్‌ను కలుసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ మేరకు ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు కుటుంబసభ్యులను కలుసుకునేందుకు కవితకు కోర్టు అనుమతి ఇచ్చింది. కవితను మంగళవారం ఆమె సోదరుడు కేటీఆర్, న్యాయవాది మోహిత్‌రావు కలిశారు. కేసుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్టు తెలిసింది. కవిత తల్లి శోభ బుధ, గురువారాల్లో ఢిల్లీకి రానున్నట్టు సమాచారం. కాగా, రోజు రోజుకూ కవిత విచారణ సమయాన్ని ఈడీ పెంచుతోంది. మంగళవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, భోజన విరామం తర్వాత మధ్యాహ్నం 2 నుంచి 4.15 వరకు ప్రశ్నించినట్టు సమాచారం. ఆ తర్వాత కొద్దిసేపు టీ విరామం ఇచ్చి, మళ్లీ విచారణను ప్రారంభించినట్టు తెలిసింది. అందుకే, ప్రతిరోజూ 6 నుంచి 7 గంటల వరకు కుటుంబ సభ్యులు కలిసేందుకు అవకాశం ఇవ్వగా, మంగళవారం మాత్రం 7 తర్వాత అనుమతించారు.

మద్యం కేసు న్యాయమూర్తి బదిలీ

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి నాగ్‌పాల్ బదిలీ అయ్యారు. నాగ్‌పాల్ స్థానంలో కావేరీ బవేజా నియమితులయ్యారు. ఢిల్లీ హైకోర్టు జ్యుడీషియల్ సర్వీసెస్‌లోని 27 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. బదిలీ అయిన వారిలో నాగ్‌పాల్ కూడా ఉన్నారు. ఆయన ఇకనుంచి కమర్షియల్ కోర్టు-13, సెంట్రల్, తీస్ హజారీ కోర్టుల్లో న్యాయమూర్తిగా వ్యవహరించనున్నారు. ఢిల్లీ మద్యం కేసులో కవితతో పాటు ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్‌సింగ్ తదితరుల అరెస్టు కేసులను నాగ్‌పాల్ విచారించారు. ప్రస్తుతం.. సిసోడియా, సంజయ్‌సింగ్ జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా, కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు.



అక్కయ్య..
'తిహాడ్ క్లబ్'కు స్వాగతం
కవితకు
ఘరానా మోసగాడు సుఖేశ్ లేఖ

ఘరానా మోసగాడు, రూ.200 కోట్ల మనీలాండరింగ్ కేసులో మండోలీ జైలులో ఉన్న సుఖేశ్ చంద్రశేఖర్ ఎమ్మెల్సీ కవితకు ఓ లేఖ రాశారు. "మీకు తిహాడ్ జైలు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. త్వరలో మీరు తిహాడ్ క్లబ్ సభ్యులు కాబోతున్నారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కూడా త్వరలో అరెస్టవుతారు. కేజ్రీవాల్, ఆయన పార్టీ(ఆప్) సింగపూర్, హాంకాంగ్, జర్మనీల్లో దాచుకున్న వేల కోట్ల అవినీతి సొమ్మంతా బయటపడుతుంది" అని ఆ లేఖలో పేర్కొన్నారు. అరవింద్ కేజ్రీవాల్‌ను కాపాడే ప్రయత్నం చేయొద్దని కవితకు హితవు పలికారు. "మీ వాట్సాప్ చాటింగ్, కాల్స్‌పై దర్యాప్తు జరుగుతోంది. అరవింద్ కేజ్రీవాల్‌ను కాపాడే ప్రయత్నం చేయొద్దని నా సలహా. కేసు విషయాలను దాచిపెట్టే ప్రయత్నం చేయొద్దు. ఈ కేసులో అన్ని సాక్ష్యాలు ఉన్నాయని కోర్టుకు తెలుసు. మీ అందరికీ తిహాడ్ క్లబ్‌లో స్వాగతం పలికేందుకు నేను ఎదురు చూస్తుంటాను. నిజం నిప్పులాంటిది. ఫేక్ కేసులనో.. రాజకీయ కుట్ర అనో ఎంతోకాలం ఆరోపణలు చేయలేరు. ఎవరి కర్మ వారిని వెంటాడుతుంది. ఇంతకాలం మిమ్మల్ని ఎవరూ తాకలేరని అనుకున్నారు. కానీ, మీరు మరిచిపోతున్నదేంటంటే.. ఇది కొత్త భారతం. చట్టం గతంలోకంటే ఇప్పుడు బలంగా ఉంది. నేను గతంలో విడుదల చేసిన ఓ లేఖలో రెండు అంశాలపై జోస్యం చెప్పాను. అవి ఇప్పుడు నిజమయ్యాయి" అని కవితకు రాసిన లేఖలో పేర్కొన్నారు. సుఖేశ్ గత ఏడాది రాసిన లేఖలో.. బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోతుందని, ఆ వెంటనే కవిత అరెస్టు ఉంటుందని, ఆమె తిహాడ్ క్లబ్‌లో చేరతారని పేర్కొనడం గమనార్హం..!

మూడో జాబితాపై బీజేపీ కసరత్తు

» నడ్డా నేతృత్వంలో కోర్ కమిటీ భేటీ

» ఈ జాబితాలోనే

ఖమ్మం, వరంగల్ అభ్యర్థుల పేర్లు!



న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం దగ్గర పడుతున్న వేళ అభ్యర్థుల ఎంపికపై బీజేపీ కసరత్తు ముమ్మరం చేసింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలు ఉండగా ఇప్పటికే రెండు విడతల్లో 267 మంది అభ్యర్థులను పార్టీ ప్రకటించింది. మరో 276 మందిని ఖరారు చేయాల్సి ఉన్నది. ఇందుకోసం బీజేపీ కేంద్ర కమిటీ ముమ్మరంగా కసరత్తు చేస్తోంది. మంగళవారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నేతృత్వంలో కోర్ కమిటీ సమావేశం అయింది. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, హరియాణా, ఒడిసా, సిక్కిం, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన పార్టీ నేతలతో కమిటీ చర్చించింది. రాబోయే రెండు, మూడు రోజుల్లో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బీజేపీ కేంద్ర పార్లమెంటరీ కమిటీ సమావేశం జరగనున్నట్లు తెలిసింది. అందుకే.. వివిధ రాష్ట్రాల నేతలతో కోర్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నది. ఇక.. తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు గాను ఇప్పటికే 15 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఖమ్మం, వరంగల్ స్థానాలకు మాత్రమే అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. మూడో జాబితాలో ఆ రెండు స్థానాలకు కూడా అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలిసింది. ఖమ్మంలో జలగం వెంకట్రావు పేరు దాదాపుగా ఖరారు అయినట్లు తెలుస్తుండగా.. మరోవైపు.. కమ్మ సామాజిక వర్గానికి చెందిన బలమైన నేతను ఇక్కడ బరిలో నిలిపేందుకు బీజేపీ అధినాయకత్వం ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఇక వరంగల్‌కు అరూరి రమేశ్ పేరు దాదాపుగా ఖరారైంది. అక్కడి నుంచి మాజీ ఐపీఎస్ కృష్ణ ప్రసాద్ కూడా ఢిల్లీ స్థాయిలో టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు.

ఏపీ అభ్యర్థుల ఎంపికపైనా కసరత్తు

బీజేపీ అధిష్ఠానం నుంచి పిలుపు రావడంతో ఆ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు పురందేశ్వరి హుటాహుటిన ఢిల్లీకి చేరుకున్నారు. మంగళవారం ఢిల్లీలో బీఎల్ సంతోష్, శివప్రకాశ్, మధుకర్‌లతో సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఏపీకి చెందిన నేత సోము వీర్రాజు కూడా ఉన్నారు. ఏపీలో తెలుగుదేశం, జనసేనలతో పొత్తులో భాగంగా బీజేపీ 6ఎంపీ సీట్లు, 10 అసెంబ్లీ సీట్లలో బీజేపీ పోటీ చేయనుంది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాతో పురందేశ్వరి ఢిల్లీకి వచ్చినట్లు తెలిసంది.

హస్తం గూటికి గద్వాల మునిసిపల్ ఛైర్మన్

మరో 16 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

కొల్లాపూర్/గద్వాల, మార్చి 19: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్ర మునిసిపల్ ఛైర్మన్ బీఎస్ కేశవ్ మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఛైర్మన్ బీఎస్ కేశవ్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన మరో 16 మంది కౌన్సిలర్లు కూడా హస్తం గూటికి వెళ్లారు. జడ్పీ ఛైర్ పర్సన్ సరితతో కలిసి మంత్రి జూపల్లి కలిసేందుకు కొల్లాపూర్ వెళ్లిన కౌన్సిలర్లు.. చర్చల అనంతరం పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో తమకు సరైన గుర్తింపు లేదని, ఎన్నో అవమానాలు ఎదుర్కొంటున్నామని ఈ సందర్భంగా వారు మంత్రికి చెప్పినట్లు సమాచారం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, ఇంకా ఏడాది కాలం పాటు మునిసిపల్ పాలకవర్గం కాలపరిమితి ఉండడం అప్పటి వరకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పాలన సాగించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కొందరు కౌన్సిలర్లు తెలిపారు. దానికితోడు ప్రస్తుతం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక జరగనుంది. ఇందులో కౌన్సిలర్ల ఓట్లు కీలకం. దీంతో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగంలోకి దిగి మునిసిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లను పార్టీలోకి ఆహ్వానించినట్లు సమాచారం. వీరి చేరికతో మునిసిపాలిటీలో మొత్తం 37 వార్డులకు గాను కాంగ్రెస్ బలం 22 చేరింది. బీఆర్ఎస్ 8, బీజేపీ ఏడుగురు ఉన్నారు.

బీఆర్ఎస్‌కు మహబూబ్‌నగర్ జడ్పీ ఛైర్‌పర్సన్ గుడ్‌బై

» నేడు సీఎం సమక్షంలో స్వర్ణాసుధాకర్ రెడ్డి చేరిక



భూత్పూర్, మార్చి 19: బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్. మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ స్వర్ణాసుధాకర్‌రెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరబోతున్నారు. 2004లో స్వర్ణాసుధాకర్‌రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అమరచింత నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరఫున గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆమె బీఆర్ఎస్‌లో చేరారు. 2019లో జిల్లా పరిషత్ ఎన్నికల్లో భూత్పూర్ నుంచి జడ్పీటీసీ సభ్యురాలిగా గెలుపొంది జడ్పీ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు. పార్టీలో ఆమెకు మంచి పేరు ఉంది. అయితే ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చిన్నచింతకుంట మండలంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి పూర్తి స్థాయిలో ఎన్నికల ప్రచారం చేయలేదన్న అపవాదు రావడంతో ఆమె మనస్తాపం చెందారు. దీంతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణాసుధాకర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో ఫోన్‌లో మాట్లాడారు. పదేళ్లపాటు బీఆర్ఎస్‌లో మంచి గుర్తింపును పొందానని, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ సహకారంతో ప్రజలకు సేవ చేశానన్నారు. కిందిస్థాయి నాయకుల సూటిపోటి మాటల వల్లే తాను పార్టీ మారాల్సి వస్తోందని స్పష్టం చేశారు.

కేసీఆర్ రూ.లక్షనే మాఫీ చేయలేదు.. రేవంత్ 2 లక్షలు చేస్తాడా?

» మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల

కీసర, మార్చి 19(ఆంధ్రజ్యోతి): తురుంఖాన్ కేసీఆర్‌నే రూ.లక్ష రైతు రుణ మాఫీ చేయలేకపోయాడని, పిట్టల దొర రేవంత్‌రెడ్డి రూ.2 లక్షలు మాఫీ చేయగలడా? అని మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రశ్నించారు. అమలు కాని గ్యారంటీలు, హామీలతో రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని, ఒకేసారి రూ.2 లక్షల మాఫీ, ఏటా ఎకరానికి 15 వేల పెట్టుబడి సాయం, కౌలుదారులకు రైతు భరోసా ఇస్తామని విస్మరించారన్నారు. కోటిన్నర మంది మహిళలకు రూ.2,500 చొప్పున ఇవ్వాలంటే రూ.30 వేల కోట్లు కావాలని.. దరఖాస్తులు స్వీకరించినది ఎన్నికల కోసమే తప్ప పథకాలు అమలు చేసేందుకు కాదని పేర్కొన్నారు. మద్యం అమ్మితే తప్ప రాష్ట్రంలో జీతాలు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఉచిత బస్సు అనగానే మురిసిపోతున్నామని, మహిళలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేలు ఎప్పుడు ఇస్తారని నిలదీశారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కీసర మండలం కరీంగూడలో బీజేపీ ఆధ్వర్యంలో "ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతు" కార్యక్రమంలో, ఎన్నికల ప్రచారం, మారేడుపల్లిలో సీనియర్ సిటిజన్ మీట్ అండ్ గ్రీట్‌లో ఈటల మాట్లాడారు. ప్రశ్నించే గొంతుక అని రేవంత్‌రెడ్డికి ఓటేస్తే మల్కాజిగిరికి ఒక్కసారీ రాలేదని, రూపాయి కూడా ఇవ్వలేదని ఆరోపించారు. నియోజకవర్గంతో తనకేం సంబంధం అని అడుగుతున్నారని, మరి రేవంత్‌కు ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు డబ్బులున్నవారిని వెదుక్కొంటున్నారని, దమ్ముంటే అభ్యర్థిని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

శ్రీనివాస్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు!

మాజీ మంత్రిపై చర్యలు తీసుకోవాలని హౌసింగ్ బోర్డు అధికారులకు మంత్రి పొంగులేటి ఆదేశం

» టీజీవో పేరిట లీజుకు తీసుకున్న భవనం దుర్వినియోగం!

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్.. తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం పేరిట గృహకల్పలో లీజుకు తీసుకున్న భవనాన్ని స్వప్రయోజనాలకు వాడుకున్న వ్యవహారంపై ప్రభుత్వం ఆగ్రహంగా ఉంది. ఈ వ్యవహారంలో శ్రీనివాస్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధమైంది. ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా హౌసింగ్ బోర్డు అధికారులను రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. టీజీవో వ్యవస్థాపక ఛైర్మన్ హోదాలో సంఘం కార్యాలయం కోసం శ్రీనివాస్‌గౌడ్ 2013లో హౌసింగ్ బోర్డు నుంచి మూడు అంతస్తులను లీజుకు తీసుకున్నారు. అయితే అందులో ఒక అంతస్తులో తెలంగాణ ఎడ్యుకేషనల్ ట్రస్టు పేరుతో శ్రీనివాస్‌గౌడ్ స్వప్రయోజనాల కోసం వాడుకున్నారనే విషయాన్ని ఇటీవల నూతనంగా ఏర్పడిన టీజీవో కార్యవర్గం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లింది. దీంతో స్టడీ సర్కిల్ పేరుతో ట్రస్టు ఏర్పాటు చేసినట్లు, కార్పొరేట్ తరహాలో క్యాబిన్లు ఏర్పాటు చేసినట్లు, అందులో ప్రైవేటు చానల్‌ను నిర్వహించినట్లు హౌసింగ్ బోర్డు గుర్తించింది. నిబంధనల్ని ఉల్లంఘించినందున లీజు ఒప్పందాన్ని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలంటూ హౌసింగ్ బోర్డు అధికారులు శ్రీనివాస్‌గౌడ్‌కు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం భవనంలోని మూడు అంతస్తులూ నూతనంగా ఏర్పడిన టీజీవో అధీనంలో ఉండటంతో వారికి కూడా నోటీసులు జారీ చేశారు. అయితే.. పాత కార్యవర్గం హయాంలో జరిగిన లీజు ఉల్లంఘనలతో తమకు సంబంధం లేదని టీజీవో ప్రస్తుత అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు.. హౌసింగ్ బోర్డుకు సమాధానమిచ్చారు. మరోవైపు 33 ఏళ్లకుగాను కుదుర్చుకున్న లీజు ఒప్పందాన్ని ఎలా రద్దు చేస్తారని ప్రశ్నిస్తూ.. శ్రీనివాస్‌గౌడ్ తిరిగి హౌసింగ్ బోర్డుకు నోటీసులు పంపారు. పైగా అధికారులపై ఆయన ఒత్తిడి చేయడంతో.. శ్రీనివాస్‌గౌడ్ తమను బెదిరిస్తున్నారంటూ వారు మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ అంశంపై విచారణ చేయాలని, శ్రీనివాస్‌గౌడ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ కార్యదర్శిని ఆదేశించారు. ఇదిలా ఉండగా.. నూతనంగా ఏర్పడిన టీజీవో అవసరాల కోసం రెండు అంతస్తులను కేటాయించేందుకు యోచనలో హౌసింగ్ బోర్డు ఉంది. ఈ మేరకు హౌసింగ్ బోర్డుకు, టీజీవోకు మధ్య చర్చలు జరుగుతున్నాయి.

టీజీవో కోసం హౌసింగ్ బోర్డు ఇంజనీరింగ్ అధికారులు నాంపల్లి గృహకల్ప భవనం బ్లాక్-2లోని 1వ, 2వ, 3వ అంతస్తులను 2013లో లీజుకు ఇచ్చారు. ఒక్కో అంతస్తులో 2,960 చదరపు అడుగుల లెక్కన 8,880 చదరపు అడుగుల విస్తీర్ణాన్ని 33 ఏళ్లకు లీజుకు ఇస్తూ ఒప్పందం చేసుకున్నారు. 2013 జూన్ 25 నుంచి 2046 జూన్ 24 వరకు..

చదరపు అడుగుకు రూ.1 అద్దెతో.. 33 ఏళ్లకు లీజు

చదరపు అడుగుకు నెలకు రూ.1 చొప్పున అద్దె చెల్లించేలా, ఏటా ఈ అద్దెను 10 శాతం పెంచేలా ఒప్పందం చేసుకున్నారు. అయితే శ్రీనివాస్‌గౌడ్.. భవనంలోని మూడో అంతస్తులో తెలంగాణ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఏర్పాటు చేశారు. గ్రూప్ పరీక్షలకు శిక్షణ ఇస్తామని, మహిళల స్వయం ఉపాధికి బాటలు వేస్తామని ట్రస్టు ద్వారా ప్రచారం చేసుకున్నారు. కానీ, అక్కడ ఐబీఎన్ పేరుతో ఓ ప్రైవేటు చానల్ కార్యాలయం నిర్వహించారు. ఆ తరువాత అది పేరు మారి.. పలువురి చేతులు మారింది.

శంషాబాద్ టు సింధు దుర్గ్

» నూతన విమాన సర్వీసు ప్రారంభం

శంషాబాద్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): గోవా తరహాలో అరేబియా సముద్ర తీరంలో మరో పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న మహారాష్ట్రలోని సింధు దుర్గ్‌కు నూతన విమాన సర్వీసు ప్రారంభమైంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి సింధు దుర్గ్‌కు ఫ్లై 91 ఎయిర్‌లైన్స్ నూతన విమాన సర్వీస్‌ను ప్రారంభించినట్లు జీఎంఆర్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా జీఎంఆర్ సీఈవో ప్రదీప్ ఫణికర్ మాట్లాడుతూ.. దేశంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల నుంచి స్వల్ప దూర విమానాలతో కనెక్టివిటీ పెండానికి ప్రత్యేక ఎయిర్‌లైన్స్ ఎస్‌జీ 611 విమానం ద్వారా సేవలందిస్తున్నట్లు చెప్పారు. ప్రతి మంగళ, ఆదివారాల్లో శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఉదయం 9.55 గంటలకు బయలుదేరి ఉదయం 11.40 గంటలకు సింధు దుర్గ్ చేరుకుంటుందని, సింధు దుర్గ్ నుంచి తిరుగు ప్రయాణం.. ఎస్‌జీ 616 విమానం అర్ధరాత్రి 12.10 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 1.55 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టు చేరుకుంటుందని తెలిపారు.

నిబంధనల మేరకే హెచ్‌ఆర్‌ఏ సవరణ: ఆర్టీసీ

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకే ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏను సవరించినట్లు టీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం మంగళవారం ప్రకటించింది. జీవో నంబర్ 53 ప్రకారం హెచ్‌ఆర్‌ఏ సవరణ చేయాలని 2020లో ఆర్టీసీ యాజమాన్యాన్ని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందని అధికారులు గుర్తు చేశారు. అప్పట్లో ఆర్టీసీ ఉద్యోగులకు పే రివిజన్ చేయకపోవడంతో హెచ్‌ఆర్‌ఏ సవరణను తాత్కాలికంగా నిలుపుదల చేశామని అధికారులు తెలిపారు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం 2017 పీఆర్సీ ప్రకారం ఉద్యోగులకు 21 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించింది. దీనికి అనుగుణంగానే జీవో నంబర్ 53 ప్రకారం హెచ్‌ఆర్‌ఏను సవరించినట్లు ఆర్టీసీ యాజమాన్యం తెలిపింది. హెచ్‌ఆర్‌ఏ సవరణపై జరుగుతున్న అసత్య ప్రచారాన్ని నమ్మవద్దని ఆర్టీసీ అధికారులు పేర్కొన్నారు.

బెంగళూరులో 'మేఘనా ఫుడ్స్' పై ఐటీ దాడులు

బెంగళూరు, మార్చి 19(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన మేఘనా ఫుడ్స్ సంస్థ బెంగళూరు కార్యాలయాలపై ఐటీ శాఖ అధికారులు మంగళవారం ఉదయం దాడులు నిర్వహించారు. బెంగళూరు కోరమంగలలో ఉన్న కార్యాలయంతో పాటు ఇందిరానగర్, జయనగర్ తదితర ప్రాంతాల్లోని రెస్టారెంట్లపై కూడా ఏకకాలంలో దాడులు జరిగాయి. మేఘనా ఫుడ్స్ సంస్థకు బెంగళూరులో 9 అవుట్‌లెట్లు ఉన్నాయి. 2006 నుంచి ఈ శాఖలను నిర్వహిస్తున్నారు. కంపెనీ సమర్పించిన ఆదాయ పన్నుల రిటర్న్‌లో భారీగా తేడాలు రావడంతో ఈ దాడులు జరిపినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. 10 ప్రాంతాల్లో ఉదయం 5 గంటలకు ప్రారంభమైన దాడులు సాయంత్రం వరకు కొనసాగాయి. కొన్ని కీలక డాక్యుమెంట్లను ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది.

మే నెలలో బీఎస్సీ నర్సింగ్ పరీక్షలు

వరంగల్ మెడికల్, మార్చి 19: బీఎస్సీ నర్సింగ్ మొదటి సెమిస్టర్ పరీక్షలు నూతన నిబంధనలతో మే నెలలో నిర్వహించనున్నట్లు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ పదో తేదీ వరకు 80శాతం హాజరున్న విద్యార్థులు మాత్రమే పరీక్షలు రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. అదే విధంగా ఇంటర్నల్ పరీక్షల్లో కూడా నిబంధనల మేరకు మార్కులు సాధించిన విద్యార్థులనే పరీక్షలకు అనుమతిస్తామన్నారు. వెయ్యి రూపాయల పరీక్ష ఫీజును ఏప్రిల్ 25 నుంచి మే 1వ తేదీలోగా చెల్లించాలని సూచించారు. థియరీ పరీక్షలు మే 15 నుంచి ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.

94 ఏళ్ల వృద్ధురాలికి గుండె కవాటం మార్పిడి



హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 94 సంవత్సరాలు..! సహజంగా ఈ వయసులో రామాకృష్ణా అంటూ కాలం గడిపేయాలనుకుంటారు..! అనారోగ్యం విషయంలో "జరిగేదేదో జరుగుతుంది. ఈ వయసులో సర్జరీలు వద్దు" అని అనుకుంటారు. వయసు పైబడ్డాక సర్జరీలతో ప్రమాదం ఉంటుందనే భయం కూడా అందుక్కారణం కావొచ్చు..! గుండె సర్జరీ అంటే అస్సలు ముందుకు రారు. ఆమె మాత్రం వీటన్నింటినీ పట్టించుకోలేదు. కుటుంబ సభ్యులు కూడా ఆమె నిండునూరేళ్లు ఆరోగ్యంతో తమ కళ్ల ముందుండాలని ఆశించారు. తీవ్ర శ్వాస ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆ వృద్ధురాలికి.. సిటిజన్ ఆస్పత్రి ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ సుధీర్ కోగంటి ట్రాన్స్ క్యాథెటర్ అరోటిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్(గుండె కవాట మార్పిడి-టీఏవీఆర్) ప్రక్రియ ద్వారా విజయవంతంగా గుండె కవాటాన్ని అమర్చారు. జనగామ జిల్లా దేవరుప్పులకు చెందిన దివంగత స్వాతంత్ర్య సమరయోధుడు మల్లారెడ్డి భార్య జానమ్మకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతుండడంతో.. ఆమె కుటుంబ సభ్యులు సిటిజన్ ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్ సుధీర్ కోగంటి ఆమెకు 2డి ఎకో పరీక్షలు చేయించారు. తీవ్రమైన బృహద్ధమని సంబంధిత 'స్టెనోసిస్'తో ఆమె బాధపడుతున్నట్లు గుర్తించారు. ఆమెకు ఓపెన్‌హార్ట్ సర్జరీ చేయడం కంటే.. టీఏవీఆర్ ప్రక్రియ సరైందని నిర్ధారణకు వచ్చారు. గతంలోనూ 106 ఏళ్ల మహిళకు స్టెంట్ వేసిన అనుభవం ఉన్న డాక్టర్ సుధీర్.. జానమ్మ సమస్యను సవాల్‌గా తీసుకున్నారు. ఈ నెల 10న జానమ్మ గుండెకు టీఏవీఆర్ విధానం ద్వారా విజయవంతంగా కవాటాన్ని అమర్చారు. ఇప్పుడు ఆమె తన కుటుంబసభ్యులతో చలాకీగా ఉన్నట్లు డాక్టర్ సుధీర్ కోగంటి చెప్పారు.

గిరిజన వర్సిటీ కల సాకారం

ములుగులో కొలువుదీరిన విద్యాసంస్థ.. రెండు కోర్సులతో తాత్కాలిక క్యాంపస్ ప్రారంభం

» 26 వరకు దరఖాస్తుల స్వీకరణ

» హెచ్‌సీయూకు నిర్వహణ బాధ్యతలు

» గిరిజనులకు 40.5 శాతం రిజర్వేషన్



గిరిజన విశ్వవిద్యాలయం తాత్కాలిక క్యాంపస్ కోసం ఎంపిక చేసిన జాకారంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్

ములుగు, మార్చి 19: తెలంగాణలో జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు కల ఎట్టకేలకు సాకారమైంది. పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ విభజన హామీ నెరవేరింది. ములుగు జిల్లా జాకారంలో తాత్కాలిక క్యాంపస్‌లో యూనివర్సిటీ ప్రారంభమైంది. 2024-25 విద్యా సంవత్సరానికిగాను రెండు కోర్సులతో విశ్వవిద్యాలయం కార్యకలాపాలు మొదలయ్యాయి. ఈ కోర్సుల్లో ప్రవేశానికిగాను ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ కూడా చేపట్టడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. వాస్తవానికి.. 2014 రాష్ట్ర పునర్విభజన చట్టంలో తెలంగాణకు కేటాయించిన గిరిజన యూనివర్సిటీపై తొలి నుంచీ అనేక సందేహాలున్నాయి. వర్సిటీని ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశంపై సందిగ్ధం నెలకొనడంతో.. బీఆర్ఎస్, బీజేపీకి చెందిన పలువురు నేతలు దీనిని తమ ప్రాంతానికి తరలించుకుపోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ములుగు, మహబూబాబాద్, ఆదిలాబాద్, భద్రాచలం నుంచి ఒత్తిడి ఉండగా.. ములుగు పేరును సూత్రప్రాయంగా నిర్ణయించారు. కానీ, వేగంగా మారుతున్న రాజకీయ పరిణామాలతో వర్సిటీని వేరే చోటకు తరలిస్తారనే ప్రచారం జరిగింది. అయితే గతేడాది అక్టోబరు 1న మహబూబ్‌నగర్‌లో జరిగిన బహిరంగ సభలో గిరిజనుల ఆరాధ్య దైవాలు సమ్మక్క, సారక్క పేరిట జాతీయ గిరిజన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని, ఇందుకోసం ములుగు ప్రాంతంలో స్థల సేకరణ కూడా జరిగిందని ప్రధాని ప్రకటించడంతో ఆ అనుమానాలన్నీ పటాపంచలయ్యాయి. ఆ తర్వాత యూనివర్సిటీ ఏర్పాటు ప్రక్రియ ఊపందుకుంది. యూనివర్సిటీల చట్టసవరణ బిల్లులో ట్రైబల్ వర్సిటీని కూడా చేర్చగా.. గతేడాది డిసెంబరు 7న లోక్‌సభలో, డిసెంబరు 13న రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందింది. అదే నెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కూడా దీనికి ఆమోదముద్ర వేశారు.

హెచ్‌సీయూకు నిర్వహణ బాధ్యతలు

జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ)కి మెంటార్‌గా బాధ్యతలు అప్పగించింది. దీంతో జనవరి 16న హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, రిజిస్ట్రార్ దేవేశ్ నిగమ్, డిప్యూటీ రిజిస్ట్రార్ అభిషేక్ కుమార్.. వర్సిటీకి స్థలంతోపాటు తరగతుల నిర్వహణ కోసం తాత్కాలిక క్యాంపస్ ఏర్పాటుకు జాకారం వద్దగల ట్రైబల్ యూత్ ట్రైనింగ్ సెంటర్ భవనాలను పరిశీలించారు. ఆ తర్వాత రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్.. యూనివర్సిటీ, హెచ్‌సీయూ అధికారులతో కలిసి స్థలాన్ని, జాకారం వైటీసీ భవనాలను పరిశీలించారు. వర్సిటీ ఓఎస్డీగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ వంశీని నియమించారు. అనంతరం ఈ నెల 8న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి.. రాష్ట్ర మంత్రి సీతక్కతో కలిసి తాత్కాలిక క్యాంపస్‌ను ప్రారంభించారు. ప్రధాని చేతులమీదుగా భూమిపూజ జరిపిస్తామని చెప్పినా.. ఎన్నికల షెడ్యూలు విడుదల కావడంతో ఈ కార్యక్రమం జరగలేదు. ఎన్నికలు ముగిసి.. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన తర్వాతే వర్సిటీ నిర్మాణ పనులకు పునాదిరాయి పడే అవకాశాలున్నాయి.

రాష్ట్ర విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

"సమ్మక్క, సారక్క సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ పేరిట www.ssctu.ac.in వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేశాం. రాష్ట్ర విద్యార్థులు ఎక్కువ మంది దరఖాస్తు చేసుకొని ప్రవేశం పొందాలి. మే నెలలో కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్ ఉంటుంది. ఫలితాల ఆధారంగా జూలైలో అడ్మిషన్ ప్రక్రియ పూర్తిచేస్తాం. ఆగస్టులో తరగతులు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి" అని ట్రైబల్ వర్సిటీ ఓఎస్డీ వంశీ తెలిపారు.

రెండు కోర్సులతో ప్రారంభం..

సమ్మక్క, సారక్క జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంలో 2024-25 విద్యాసంవత్సరానికిగాను రెండు కోర్సులను ప్రవేశపెట్టారు. నాలుగేళ్ల కాలపరిమితితో బీఏ-ఇంగ్లిష్, బీఏ-సోషల్ సైన్స్ కోర్సులకు అడ్మిషన్ ప్రక్రియ మొదలుపెట్టారు. ప్రతి కోర్సులో 32 సీట్లు ఉండగా వీటిలో ఎనిమిది చొప్పున గిరిజనులకు సూపర్ న్యూమరరీ సీట్లను కేటాయించారు. ఈ నెల 26వ తేదీవరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జరుగుతుంది. కాగా, శాశ్వత క్యాంపస్ ఏర్పాటయ్యాక మరిన్ని కోర్సులను ప్రవేశపెట్టనున్నారు. గిరిజనుల జీవన విధానం, కళలు, సంస్కృతి, మూలికా వైద్యం తదితర అంశాలపై పరిశోధనలు జరిపేలా హెచ్‌సీయూ అధికారులు నివేదిక రూపొందిస్తున్నారు. యూజీసీ నిబంధనల ప్రకారం తొలుత 7.5 శాతం రిజర్వేషన్ ఖరారు చేయడంతో మొదట్లో గిరిజన సంఘాల నుంచి నిరసన వ్యక్తమైంది. దీంతో స్థానిక గిరిజన విద్యార్థులకు అదనంగా 33శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో మొత్తంగా 40.5శాతం రిజర్వేషన్ లభించింది. 7.5శాతం ఆలిండియా ఓపెన్ కేటగిరీ కాగా, 33 శాతం తెలంగాణ పరిధిలో వర్తింపజేయనున్నారు.



జేఎన్‌టీయూలో సీసాల గలగల

» మద్యం మత్తులో అర్ధరాత్రి ఘర్షణ

» పోలీస్ స్టేషన్‌కు 40 మంది విద్యార్థుల తరలింపు

హైదరాబాద్ సిటీ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): సరైన నిఘా లేకపోవడంతో జేఎన్‌టీయూహెచ్ హాస్టళ్లలో ఖరీదైన మద్యం బాటిళ్లు యథేచ్ఛగా చేరుతున్నాయి. రాత్రిళ్లు మత్తులో కొందరు విద్యార్థులు కారిడార్లలో హల్‌చల్ చేస్తున్నారు. ఇతరులకు ఇబ్బంది కలిగి వారించినా వినే పరిస్థితి ఉండడం లేదు. కొన్నిసార్లు దాడులకు దిగుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి మంజీరా హాస్టల్‌లో మద్యం మత్తులో రెండు వర్గాల విద్యార్థులు ఘర్షణకు దిగారు. ఓ వర్గం వారు క్రికెట్ బ్యాట్‌లు, వికెట్లు విరిగేలా అవతలి వారిపై దాడి చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్, యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదని విద్యార్థులు చెబుతున్నారు. 100కు ఫోన్ చేయగా, పోలీసులు వచ్చి 40 మంది విద్యార్థులను బాలానగర్, కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. మళ్లీ గొడవకు దిగితే కేసు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు సమాచారం. ఈ గొడవలపై విచారణ కోసం నలుగురు ప్రొఫెసర్లతో కమిటీ ఏర్పాటు చేశారు. తాగి గొడవలకు పాల్పడిన విద్యార్థులను హాస్టళ్ల నుంచి పంపించివేయాలని నిర్ణయించారు. సెక్యూరిటీని పటిష్ఠం చేయాలని, హాస్టళ్లలోకి వెళ్లేపుడు విద్యార్థుల బ్యాగులను స్కానింగ్ చేసేందుకు యంత్రాలను ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ల కమిటీ సిఫారసు చేసినట్లు తెలిసింది. హాస్టళ్లలో విద్యార్థుల పర్యవేక్షణ చూడాల్సిన అధికారులు సాయంత్రమైతే ఇంటి దారి పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ప్రిన్సిపాల్, రిజిస్ట్రార్, రెక్టార్, డైరెక్టర్ వంటి కీలక అధికారులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా యూనివర్సిటీలో క్వార్టర్స్ ఉన్నా, వీరెవరూ వాటిలో నివసించడం లేదనే ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులు యూనివర్సిటీకి దూరంగా ఉంటుండడంతో కిందిస్థాయి సిబ్బందిని కొందరు విద్యార్థులు లెక్కచేయడం లేదు. దీంతోనే తరచూ ఇబ్బందికరమైన పరిస్థితులు చోటుచేసుకుంటున్నాయి.

రోడ్డు కబ్జాపై జీహెచ్ఎంసీ నోటీసులు

» ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

హైదరాబాద్ సిటీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ ఎదురుగా హైదరాబాద్-ముంబయి పాత రోడ్డును ఆనుకొని డైమండ్ హిల్స్ లేఅవుట్‌లో 33 అడుగుల రోడ్డును కబ్జా చేయడంపై జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. 33 అడుగుల రోడ్డును కబ్జా చేయడంతో పాటు లీజుకివ్వడంపై '33 అడుగుల రోడ్డు.. 35వేల అద్దె!' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతి సోమవారం కథనం ప్రచురించింది. దీనికి స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు డైమండ్‌హిల్స్ లేఅవుట్‌తో పాటు కబ్జాకు గురైన రోడ్డును పరిశీలించారు. 33అడుగుల రోడ్డును 250, 271/ఏ నెంబర్ల ప్లాట్ల యజమాని కబ్జా చేసి బేస్మెంట్, మెట్లను నిర్మించినట్లు, అలాగే బేస్మెంట్‌పై మార్బుల్, గ్రానైట్ ఏర్పాటు చేసినట్లు గుర్తించారు. ఆ ప్లాట్ల యజమానికి జీహెచ్ఎంసీ అధికారులు టీఎస్‌బీపాస్ చట్టం ప్రకారం 402నోటీసులను జారీ చేశారు. కబ్జాను తొలగించకుంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

రజాకార్ సినిమాకు పన్ను మినహాయింపు ఇవ్వండి

» సీఎం రేవంత్‌కు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): 'రజాకార్' సినిమాకు వినోదపన్ను మినహాయింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కోరారు. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఆనాటి వాస్తవాలను నేటి తరానికి తెలియజేసే మంచి ఉద్దేశంతో తీసిన ఈ సినిమాను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

కాగితాల్లోనే విమానాశ్రయాలు!

తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితం

» భూసేకరణ, ఇతర అంశాలలో జాప్యంతో పడని ముందడుగు



వరంగల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రంలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఉడాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఎంపిక చేసిన ఆరు విమానాశ్రయాల పనులలో కదలిక కనిపించడం లేదు. భూసేకరణ, నిధుల కేటాయింపు అంశాల్లో రాష్ట్రంలోని గత ప్రభుత్వం అనుసరించిన వైఖరే ఇందుకు కారణమనే విమర్శలు ఉన్నాయి. దేశంలో అభివృద్ధి చెందుతున్న నగరాలకు రాష్ట్ర, దేశ రాజధానులతో ఎయిర్ కనెక్టివిటీని పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉడాన్ (ఉడే దేశ్‌కీ ఆమ్ నాగరిక్) పథకం తీసుకొచ్చింది. ఈ పథకం కింద వరంగల్ జిల్లా మామునూరు, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, ఆదిలాబాద్ విమానాశ్రాయాలను బ్రౌన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులను ఎంపిక చేసింది. అలాగే, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, మహబూబ్‌నగర్ విమానాశ్రయాలు గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి పలు సాంకేతిక సర్వేలను పూర్తి చేసిన ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ) గత ఏడాది జూలై 7న కేంద్రానికి నివేదికలు ఇచ్చింది. దాని ప్రకారం రెండు దశల్లో పనులు పూర్తి చేయాలని నిర్ణయించారు. కానీ, భూసేకరణ అంశంలో జరిగిన జాప్యం వల్ల ఈ విమానాశ్రయాలు ప్రతిపాదనలకే పరిమితమైపోయాయి. అయితే, కొత్త విమానాశ్రయాల ఏర్పాటుపై ఏఏఐ ఇచ్చిన నివేదిక ప్రభుత్వ పరిశీలనలో ఉందని జనవరిలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రకటించారు.

భూసేకరణే సమస్య !

వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్రయం నిజాం హయాంలో 1930ల్లో ఏర్పాటైంది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో భారత వాయుసేన వినియోగించిన ఈ విమానాశ్రయం 1981లో మూతబడింది. ఉడాన్‌లో బ్రౌన్‌ఫీల్డ్ కేటగిరిలో ఎంపికైన ఈ ఎయిర్‌పోర్టుకు చెందిన 696 ఎకరాల భూమి ఏఏఐ ఆధీనంలో ఉంది. మొత్తం 1200 ఎకరాలు అవసరం కాగా మిగిలిన 504 ఎకరాలు భూసేకరణ చేపట్టాలి. ఇందులో 253 ఎకరాలు కేటాయించేందుకు గత జూలైలో అప్పటి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కానీ, ఇప్పటిదాకా పూర్తిస్థాయిలో భూసేకరణ జరగలేదు. అలాగే, బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టుగా అభివృద్ధి చేయాలనుకున్న ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టును నిజాం కాలంలో సైన్యం రాకపోకలకు, ఇంధన తరలింపునకు వాడేవారు. నక్సల్స్ ప్రాబల్యంతో రాకపోకలు నిలిపివేశారు. ఈ విమానాశ్రయానికి ఆదిలాబాద్ శివారులో 369ఎకరాల భూములున్నాయి. పరిసర ప్రాంతాల్లోని పట్టా, అసైన్డ్ కలిపి మొత్తం 1,592 ఎకరాల భూమిని సేకరించాలని అనుకున్నారు. కానీ, పట్టా భూముల సేకరణపై గత ప్రభుత్వం దృష్టి పెట్టలేదన్న విమర్శలు ఉన్నాయి. జక్రాన్‌పల్లి వద్ద నిర్మించనున్న ఎయిర్‌పోర్టుకు 740 ఎకరాలు అవసరమని గుర్తించారు. ఇక్కడ కూడా భూసేకరణ పూర్తి కాలేదు. పాల్వంచ, మహబూబ్‌నగర్(గ్రీన్‌ఫీల్డ్), బసంత్‌నగర్ (బ్రౌన్‌ఫీల్డ్) ఎయిర్‌పోర్టులకు భూసేకరణ సమస్యతోపాటు సమీపంలో సిమెంట్ ఫ్యాక్టరీ, థర్మల్ పవర్ ప్రాజెక్టు చిమ్నీలు, అడవుల్లో గుట్టలు, ఎత్తైన నిర్మాణాలు ఉండటం ఆటంకంగా మారింది.

మామునూరుకు ఆ నిబంధనే అడ్డంకి?

శంషాబాద్ విమానాశ్రయ నిర్మాణ సమయంలో ఉమ్మడి ఏపీ ప్రభుత్వంతో జీఎంఆర్ సంస్థ చేసుకున్న ఒప్పందం మామునూరు విమానాశ్రయ పునఃప్రారంభానికి ఆటంకంగా మారింది. శంషాబాద్ విమానాశ్రయానికి 150కిమీల పరిధిలో 30ఏళ్ల పాటు మరో వాణిజ్య విమానాశ్రయం ఏర్పాటు చేయరాదనే షరతు ఆ ఒప్పందంలో ఉంది. దీని ప్రకారం 2038 వరకు కొత్త ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయకూడదు. మామునూరు శంషాబాద్‌కు 150 కిమీల పరిధిలో ఉండడం సమస్యగా మారింది. ఈ షరతు నుంచి ఉపశమనం కల్పించాలని గత ప్రభుత్వం కేంద్రాన్ని ఆశ్రయించింది. కానీ, ఇప్పటిదాకా కదలిక లేదు.

మహా'నటి'.. మాళవిక!

» ఆర్పీఎఫ్ ఎస్సైనంటూ ఏడాదిగా టోకరా

» రైల్వే ఆఫీసుల్లో తనిఖీలు చేసిన నకిలీ ఎస్సై

» ఎక్కడికి వెళ్లినా యూనిఫాంలోనే..!

» చివరికి పెళ్లిచూపులకు కూడా డ్రెస్‌తోనే

» పెళ్లి కొడుకు బంధువుల ఆరాతో గుట్టురట్టు



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్/నల్లగొండ/నార్కట్‌పల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నిజాం కాలేజీలో ఎమ్మెస్సీ చదివింది.. ఆర్పీఎఫ్‌లో ఉద్యోగం సాధించాలని ఆశపడింది.. రైల్వేలో ఎస్సై పోస్టు కోసం పరీక్ష రాసింది. కానీ, మెల్లకన్ను ఉండడంతో మెడికల్‌గా అన్‌ఫిట్ అయింది. అయినా ఆమెకు ఎస్సై ఉద్యోగంపై మమకారం తగ్గలేదు. తాను ఆర్పీఎఫ్ ఎస్సైగా ఎంపికయ్యానంటూ కుటుంబ సభ్యులతో పాటు బంధువులు, గ్రామస్థులను నమ్మించింది. ఆర్పీఎఫ్ యూనిఫాం కుట్టించుకొని.. నకిలీ ఎస్సై అవతారం ఎత్తింది. చివరికి నల్లగొండ రైల్వే పోలీసుల చేతికి చిక్కింది. రైల్వే ఎస్పీ సలీమా మంగళవారం సికింద్రాబాద్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ 'కి'లేడీ' గురించి వివరించారు. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండలం దుబ్బాకకు చెందిన జడల యాదయ్య, భాగ్యమ్మ దంపతులు దివ్యాంగులు. వీరికి కుమార్తె మాళవిక, కుమారుడు మల్లేశ్ ఉన్నారు. బతుకుదెరువు కోసం 15 ఏళ్ల కిందట నార్కట్‌పల్లికి వలస వచ్చి ఓ అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. మాళవిక హైదరాబాద్‌లోని నిజాం కళాశాలలో పీజీ పూర్తి చేసింది. ఆర్పీఎఫ్ ఎస్సై ఉద్యోగం కోసం పరీక్ష రాసింది. అయితే వైద్య పరీక్షల్లో ఆమె ఎంపిక కాలేదు. కానీ, తనకు రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఎస్సై ఉద్యోగం వచ్చిందంటూ తల్లిదండ్రులను, స్థానికులను నమ్మించింది. నెలకు రూ.60 వేలు జీతం అని చెప్పింది. నల్లగొండ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో ఆర్పీఎఫ్ పోలీసుల విధులను పరిశీలించింది. ఎల్బీనగర్‌లో ఓ టైలర్ వద్ద ఆర్పీఎఫ్ ఎస్సై డ్రెస్ కుట్టించుకుంది. అప్పటి నుంచి అందరినీ నమ్మించేలా ఆ డ్రెస్‌తోనే తిరుగుతూ ఉండేది. హైదరాబాద్‌లో ప్రైవేట్ జాబ్ చేస్తూ కొంత మొత్తంలో సంపాదిస్తూ ఉండేది. అనుమానం వచ్చిన తండ్రి యాదయ్య మాళవికను నిలదీశాడు. ఒక్క రూపాయి కూడా ఇంట్లో ఇవ్వకపోవడంపై ఆరా తీస్తే గొడవ పడేదని, గుర్తింపు కార్డులు చూపించమని అడిగినా బుకాయించేదని తెలిసింది. ఆలయాల్లో దర్శనానికీ ఎస్సై డ్రెస్‌తోనే వెళ్లేది. ఒక సారి నల్లగొండ రైల్వే ఆఫీస్‌లోకి నేరుగా వెళ్లి ఫైళ్లు తనిఖీ చేసింది. కానీ, ఎవరూ ఆమె నకిలీ అని గుర్తించలేకపోయారు. మహిళా దినోత్సవం సందర్భంగా నార్కట్‌పల్లి గ్రామస్థులు మాళవికను సన్మానించడం గమనార్హం.

పెళ్లి చూపులకూ యూనిఫాంలోనే!

మాళవికను నార్కట్‌పల్లికే చెందిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి ఇచ్చి పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు భావించారు. అయితే పెళ్లి చూపులకు కూడా ఆమె యూనిఫాంలోనే వెళ్లింది. ఈ విషయమై పెళ్లి కొడుకు కుటుంబ సభ్యులు నల్లగొండ ఆర్పీఎఫ్ పోలీసుల నుంచి వివరాలు సేకరించారు. ఇక్కడ అలాంటి వారు ఎవరూ లేరని తెలుసుకొని, పెళ్లి వాయిదా వేసుకున్నారు. మరోవైపు మాళవిక శంకర్‌పల్లి ఆర్పీఎఫ్ స్టేషన్‌కు ఫోన్ చేసి తాను ఎస్సైనని పరిచయం చేసుకుంది. ఫోన్ మాట్లాడిన అక్కడి ఎస్సైకి అనుమానం వచ్చి.. నల్లగొండ జీఆర్పీ స్టేషన్ ఎస్సై పవన్ కుమార్‌కు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం నల్లగొండ స్టేషన్‌లో అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా ఆమెను ఆర్పీఎఫ్ సిబ్బంది అదుపులోకి తీసుకుని విచారించారు. ఆమెను కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు పంపినట్లు ఎస్పీ తెలిపారు.

ఫోన్ వాడుతూ రైలు ఎక్కితే.. జైలుకే

» పట్టాల పరిసరాల్లో సెల్ఫీ దిగినా అదే శిక్ష

» ట్రాక్ పక్కన నడుస్తూ ఫోన్ మాట్లాడొద్దు

» భద్రత దృష్ట్యా అధికారుల నిషేధాజ్ఞలు



హైదరాబాద్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైలు ఎక్కుతున్నపుడు, దిగే సందర్భంలో సెల్‌ఫోన్ వాడుతున్నారా..? రైల్వే ట్రాక్‌ల దగ్గర నడుస్తున్నప్పుడు ఫోన్‌లో మాట్లాడటం లేదా మొబైల్ చూడటం వంటివి చేస్తున్నారా..? అయితే తస్మాత్ జాగ్రత్త.. ఇకపై ఇలాంటివి చేస్తే జైలు శిక్షతో పాటు జరిమానా కూడా తప్పదని రైల్వే అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాదు.. రైల్వే ట్రాక్ కనబడగానే స్మార్ట్‌ఫోన్ బయటికి తీసి సెల్ఫీలు దిగినా.. లొకేషన్ బాగుందని రైలు పట్టాల వెంబడి షార్ట్ ఫిల్మ్‌లు, ప్రీ వెడ్డింగ్ షూట్‌లు, ఇతర ఫొటోగ్రఫీలు తీసినా.. కటకటాల్లోకి వెళ్లాల్సి వస్తుందని చెబుతున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి నిషేధాజ్ఞలను అమలు చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. రైల్వే ట్రాక్‌ల పరిసరాల్లో గుమికూడటం, మరే ఇతర కార్యకలాపాల్లోనూ పాల్గొనడం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. పౌరులు రైల్వే ట్రాక్‌ను దాటకూడదని, కదులుతున్న రైళ్లలో ఎక్కడానికి, దిగడానికి ప్రయత్నించే సందర్భాల్లో ప్రమాదాలకు ఆస్కారం ఉంటుందని హెచ్చరించారు. రైళ్లు ఎక్కేటప్పుడు ప్లాట్‌ఫాంను ఉపయోగించాలని, నిషేధిత ప్రాంతం నుంచి రైలులోకి ప్రవేశించరాదని తెలిపారు. స్టేషన్లలో రైల్వే ట్రాక్‌లను దాటడానికి ప్రయత్నించవద్దని.. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు, సబ్‌వేలు, రోడ్ ఓవర్/అండర్ బ్రిడ్జ్‌లు, రైల్ క్రాసింగ్‌లను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: **K. Srinivas.** Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● బుధవారం 20 మార్చి 2024
diksuchi@andhrajyothy.com



కలినరీ ఆర్ట్స్‌లో బీబీఏ, ఎంబీఏ

కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(ఐసీఐ)- బీబీఏ, ఎంబీఏ ప్రోగ్రాములలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటికి అమర్‌కంటక్‌లోని ఇందిరాగాంధీ నేషనల్ ట్రైబల్ యూనివర్సిటీ సహకారం అందిస్తోంది. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లు ఉన్నాయి. సీయూఈటీ(యూజీ/పీజీ) స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. వయోపరిమితి నిబంధనలు లేవు. ఎంపికైన అభ్యర్థులకు చెఫ్, కిచెన్ మేనేజ్‌మెంట్-కలినరీ స్పెషలిస్ట్‌లుగా రాణించేందుకు అవసరమైన స్కిల్స్ నేర్పిస్తారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోని రెస్టారెంట్లలో ఆహారాన్ని తయారు చేసే పద్ధతులు, వాటి నిల్వ, ప్రమాణాలకు అనుగుణంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. వెజిటేరియన్ ప్రాక్టికల్ ఆప్షన్ కూడా ఉంది.

బీబీఏ (కలినరీ ఆర్ట్స్)

- ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 120 సీట్లు ఉన్నాయి.
- **కోర్సు వివరాలు:** ఈ ప్రోగ్రామ్‌లో 61 మాడ్యూల్స్ ఉంటాయి. వీటికి మొత్తం 152 క్రెడిట్స్ నిర్దేశించారు. క్లాస్ రూం టీచింగ్, ప్రాక్టికల్ టీచింగ్, ఇంటర్న్‌షిప్, వైవావోస్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, సెమిస్టర్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వీరు 2024 సెప్టెంబరు 30 నాటికి మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది.
- **ఎంపిక:** సీయూఈటీ(యూజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఎంబీఏ(కలినరీ ఆర్ట్స్)

- ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. తిరుపతి, నోయిడా క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 30 సీట్లు ఉన్నాయి.
- **కోర్సు వివరాలు:** ఇందులో 24 మాడ్యూల్స్ ఉంటాయి. వీటికి మొత్తం 92 క్రెడిట్స్ నిర్దేశించారు. థియరీ క్లాసెస్, ప్రాక్టికల్ క్లాసెస్, అసైన్‌మెంట్‌లు, ప్రజంటేషన్‌లు, ప్రాజెక్ట్ వర్క్‌లు, మిడ్ టర్మ్ ఎగ్జామ్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఎక్స్‌టర్నల్ ఎగ్జామ్స్, సెమిస్టర్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. దివ్యాంగులు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.
- **ఎంపిక:** సీయూఈటీ(పీజీ) 2024 స్కోర్ లేదా సంస్థ నిర్వహించే ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(పీజీ) 2024 స్కోర్, డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

ఉద్యోగావకాశాలు

ప్రముఖ హోటళ్లు, ఆతిథ్య రంగ సంస్థల్లో చెఫ్‌లుగా రాణించే వీలుంది. ఫ్లయిట్ కిచెన్స్‌లో, ఇండియన్ నేవీ ఆతిథ్య విభాగాల్లో, షిప్పింగ్ - క్రూయిజ్ సంస్థల్లో, రైల్వే కేటరింగ్ సర్వీస్‌లలో, దేశ విదేశాల్లోని ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో కిచెన్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేయవచ్చు. ఐసీఐ సహా హోటల్ మేనేజ్‌మెంట్, ఫుడ్ క్రాఫ్ట్ సంస్థల్లో ఫ్యాకల్టీలుగా చేరవచ్చు. స్టేట్ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు నిర్వహించే హోటళ్లు, గెస్ట్ హౌస్‌లలో కిచెన్ మేనేజ్‌మెంట్ బాధ్యతలు నిర్వహించవచ్చు. స్వయం ఉపాధి కింద సొంతంగా రాణించే అవకాశం ఉంటుంది. ఫుడ్ బ్లాగర్, ఫుడ్ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు. ఫుడ్ బేస్డ్ స్టార్టప్ కంపెనీలలో మేనేజ్‌మెంట్ ట్రెయినీలుగా ఉద్యోగాలు పొందే వీలుంది.

ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ వివరాలు

- ఇందులో 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- బీబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ అంశాల నుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు.
- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నిర్వహించే పరీక్షలో ఫుడ్ ప్రొడక్షన్/మేనేజ్‌మెంట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్/మేనేజ్‌మెంట్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్, ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ అంశాలనుంచి ఒక్కోదానిలో 20 ప్రశ్నలు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- రిజిస్ట్రేషన్ ఫీజు లేదు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 25
- **ఐజీఎన్‌టీయూ-ఐసీఐ జేఈఈ(యూజీ/పీజీ) తేదీ:** మే 26
- **ఫలితాలు విడుదల:** మే 31
- **మొదటి రౌండ్ సీట్ అలాట్‌మెంట్:** జూన్ 3
- **రెండో రౌండ్ సీట్ అలాట్‌మెంట్:** జూన్ 10
- ఫైనల్ రౌండ్ సీట్ అలాట్‌మెంట్: జూన్ 18
- **స్పాట్ అడ్మిషన్స్:** జూన్ 24 నుంచి జూలై 12 వరకు
- **అకడమిక్ సెషన్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.icitirupati.in

ప్రవాళ బిత్తికలు

టీఎస్‌పీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ జాగ్రఫీ

ప్రవాళ బిత్తికలు(*Coral Reefs*) అనేవి సముద్రాలలో ఆయన రేఖా మండలాలలో నివసించే ప్రవాళ కీటకాలు(*Coral Polyps*) లేదా పగడపు పురుగులతో నిర్మితమైనవి. ఈ కీటకాలు సముద్రాలలో ఉండే కాల్షియం కార్బోనేట్‌ను గ్రహించి తమ కర్పరాల(*Shells*)ని నిర్మిస్తాయి.

ప్రవాళ కీటకాలు వివిధ రంగులలో ఉంటాయి. పచ్చ, పసుపు, గులాబి, తెలుపు, ఊదా మొదలైనవి. ఈ కీటకాలు గుంపులు గుంపులుగా, కాలనీలుగా నివసిస్తాయి. ఇలాంటి కాలనీలు పెరుగుతూ ఒక దానితో ఒకటి పెనవేసుకుని ప్రవాళ బిత్తికలుగా, ప్రవాళ ద్వీపాలుగా ఏర్పడతాయి. ప్రవాళ బిత్తికలు, దీవులు కేవలం ప్రవాళ కీటకాలతో ఏర్పడలేదు. ఇతర సముద్రాంతర్గత జీవులు కూడా వీటి నిర్మాణానికి తోడ్పడతాయి. అందులో ముఖ్యమైనవి సున్నపు ఆల్గే(Calcareous algae) ఫోరమినిఫెరా (Foraminifera), ఎఖైనోడర్మ్(Ech-ino-derms) మొదలైనవి.

ప్రవాళ బిత్తికల పెరుగుదలకు కారణాలు

సాధారణంగా ప్రవాళ కీటకాలు ఆయన రేఖా మండల సముద్రపు నీటిలో విస్తారంగా నివసిస్తాయి. వీటి పెరుగుదలకు కొన్ని అనుకూల పరిస్థితులు అవసరం.

- ముఖ్యంగా ప్రవాళ కీటకాల పెరుగుదలకు ఉష్ణోగ్రత 20 డిగ్రీల సెల్సియస్ ఉండాలి. అధిక శీతల, అధిక ఉష్ణోగ్రతలలో ఈ కీటకాల పెరుగుదల కుంటుపడుతుంది.
- ఈ ప్రాణులకు అత్యవసరమైన సూర్యరశ్మి, ప్రాణ వాయువు(ఆక్సిజన్) 55 మీటర్ల లోతు వరకు మాత్రమే పుష్కలంగా ఉంటుంది. అందువల్ల వీటి పెరుగుదల 55 మీటర్ల లోతు వరకే పరిమితమై ఉంటుంది.
- ఉష్ణమండల ప్రాంత సముద్ర జలాలైన 30 డిగ్రీల ఉత్తర అక్షాంశం, 30 డిగ్రీల దక్షిణ అక్షాంశాల మధ్య అధికంగా పెరుగుతాయి.
- స్వచ్ఛమైన ఉప్పునీరు పగడపు దిబ్బల పెరుగుదలకు అనుకూలంగా ఉంటుంది. అయితే మంచినీరు, అధిక లవణీయత రెండూ ప్రవాళ కీటకాల పెరుగుదలకు హానికరం.
- సాధారణంగా ప్రవాళ బిత్తికలు ఆయన రేఖా ప్రాంతాలలో(Tropical regions) ఖండాల తూర్పు తీర ప్రాంతంలోనే కనిపిస్తాయి. ఖండాల పశ్చిమ తీర ప్రాంతాలలో చల్లని నీరు పైకి ఉబికి శీతల ప్రవాహాలుగా ప్రవహిస్తున్నందున ఉష్ణోగ్రత తగ్గి వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- స్వచ్ఛమైన ఉప్పునీరు ప్రవాళ కీటకాలు నివసించడానికి అవసరం. నదులు సముద్రాలలో కలిసేచోట ఒండ్రుమట్టితో నీరు బురదగా (Turbid waters) ఉండటం వల్ల నది ముఖద్వారాల వద్ద ప్రవాళ బిత్తికలు ఏర్పడవు.
- వీటి ముఖ్య ఆహారం కాల్షియం కార్బోనేట్. ఇది కొరవడిన ప్రాంతాలలో వీటి పెరుగుదల కృశించి పోతుంది. కాబట్టి ఇవి ఇతర సూక్ష్మ సముద్ర జీవరాశుల నుంచి గ్రహించి తమ కర్పరాలను నిర్మిస్తాయి. ప్రవాళ కీటకాలు తమ గూళ్లు(Reef) ఉన్న చోటు నుంచి కదలవు. తమని తాకుతూ దాటివెళ్లే నీటి నుంచే ఆహారాన్ని గ్రహిస్తాయి. కాబట్టి నీటి చలనం అవసరం. మితవేగ ప్రవాహాలు ఉన్న ప్రాంతాలలో ఇవి పెరుగుతాయి. నిలకడగా ఉన్న నీరు వీటి పెరుగుదలకు ప్రతికూలం.
- మంచి నీటి ప్రాంతాలలో ఈ కీటకాలు నివసించవు. అధిక వర్షపాతం, నదీజలాల ప్రవేశం మొదలైనవి వీటి పెరుగుదలకు ప్రతి బంధకాలు.



ప్రవాళ కీటకాలు 55 మీటర్ల కంటే ఎక్కువ లోతులో నివసించలేవు. అనేక బిత్తికలు సముద్రాలలో సుదూరంగా ఏర్పడి ఉంటాయి. ఇవి ఏర్పడటానికి అక్కడి సముద్రాంతర్గత ఉపరితలాలందు రెడ్జ్‌లు గాని, ఉబ్బెత్తు శిఖరాలు గాని ఉన్న వాటిపై ఇతర జీవరాశులు నివసించి 55 మీటర్ల లోతు వరకు వ్యాప్తి చెందినప్పుడు, ఆపై ప్రవాళ కీటకాలు సమూహ నివాసమేర్పరచుకుంటాయి. ఈ కీటకాల పెరుగుదల సముద్ర ఉపరితలం వరకే వ్యాప్తి చెందుతుంది. ఉపరితలంపైన పెరిగిన బిత్తికలలోని కీటకాలు మరణించి వీటి కర్పరాలు బిత్తికలో కలుస్తాయి.

తీరం వైపున ఉన్న కీటకాలకు ఆహార లేమి వల్ల ఇవి క్షీణించి లాగూన్లు ఏర్పడటానికి కారణమవుతున్నాయి. బిత్తికి నిర్మాణం ఒక ద్వీపం చుట్టూ ఏర్పడినట్లయితే మధ్యలో చక్రాకార లాగూన్ ఏర్పడుతుంది. దీన్ని అటోల్ అంటారు.

బిత్తికల రకాలు: ప్రవాళ బిత్తికల ఆకారం, నిర్మాణం, ఉనికిని బట్టి మూడు రకాలుగా పేర్కొనవచ్చు. అవి తీరాంచల బిత్తిక(Fringing Reef), అవరోధక బిత్తిక(Barrier Reef), అటోల్(Atoll)

తీరాంచల బిత్తిక: ఇవి ఖండ తీరానికోగాని, ద్వీపానికోగాని అంటుకొని తీరపు అంచున మాత్రమే ఏర్పడతాయి. వీటి ఉపరితలం గరకుగాను, ఎగుడు దిగుడుగాను ఉంటుంది. దీని వెలుపలి అంచు సముద్రంలోనికి వాలుగా ఉంటుంది. సముద్రమట్టం వరకు పెరిగిన ప్రవాళ కీటకాలకు తీరం వైపు ఆహార సమృద్ధి లేనందువల్ల క్రమంగా క్షీణించి లాగూన్‌లు ఏర్పడతాయి. వెలుపలి అంచున ఉన్న కీటకాలకు సముద్ర జలాల నుంచి సమృద్ధి ఆహారం లభించడం వల్ల బాగా, ఏపుగా పెరుగుతాయి. తీర ప్రాంతపు వైపున ఉన్న కీటకాలు నదీజలాల సమ్మేళనం వల్ల బురద నీటి ప్రవేశం వల్ల క్షీణించి లాగూన్ ఏర్పడటానికి కారణమవుతాయి. ఈ విధంగా ద్వీపాన్ని గాని, తీరాన్ని గాని అంటుకొని తీరంవైపు లాగూన్ గల ప్రవాళ బిత్తిక సముదాయాన్ని తీరాంచల బిత్తికలు అని పేర్కొంటారు. ఉదాహరణకు.. లక్ష దీవులు, కార్ నికోబార్ దీవులు. ఫ్లోరిడా తీరంలో, న్యూహేబ్రిడీస్ దీవులలో ఉన్నవి చెప్పుకోదగ్గవి.

అవరోధ బిత్తికలు: అతి పెద్దదైన, విస్తారమైన బిత్తికలలో ఇవి ముఖ్యమైనవి. తీరానికి దూరంగా ఏర్పడి లోతు విస్తీర్ణంలో తీరాంచల బిత్తికల కంటే అధికంగా ఉంటాయి. వెలుపలి వైపు ఇవి సముద్రంలోనికి ఎక్కువగా వాలు కలిగి ఉంటాయి. లాగూన్ వెడల్పు అధికంగా ఉండి, తీరం నుంచి సుమారు 10 నుంచి 180 కి.మీ. వరకు ఉంటుంది. 'ఆస్ట్రేలియా గ్రేట్ బారియర్ రీఫ్' దీనికి మంచి ఉదాహరణ. ఈ బిత్తిక ఆస్ట్రేలియా ఖండపు తూర్పున క్వీన్లాండ్ తీరాన 1900 కి.మీ. పొడవు, 160 కి.మీ. వెడల్పున వ్యాపించి ఉంది. ఇది ఉత్తరాన తీరం నుంచి 128 కి.మీ. దూరం వరకు, దక్షిణాన 11 కి.మీ. దూరం వరకు విస్తరించి లాగూన్‌తో కూడి ఉంది. తీరానికి బిత్తికకు మధ్య సముద్రం ప్రశాంతంగా ఎక్కువ అలలు లేకుండా జలక్రీడలకు అనువుగా ఉంటుంది.

అటోల్: అటోల్ బిత్తికలో చక్రాకారంలో గాని, గుర్రపు నాళపు ఆకారంలో గాని ఉండి మధ్యలో లాగూన్ కలిగి ఉంటుంది. కొన్నింటిలో ఈ లాగూన్ మధ్య చిన్న ద్వీపం ఏర్పడుతుంది. చక్రాకారంగా ఉన్న బిత్తిక చుట్టూ కొన్ని చోట్ల ఖాళీలు ఏర్పడి, వాటికి వెలుపలి సముద్రంతో సంబంధం ఉంటుంది. నిర్దిష్టంగా ఏర్పడిన అటోల్‌కు చెందిన లాగూన్ మధ్యన ద్వీపం ఉండదు. అటోల్లు అధికం పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడ్డాయి. ఉదా:- తూర్పుఫిజీ అటోల్, పశ్చిమ కారోలినలోని ట్రుక్ అటోల్ మొదలైనవి. మాల్దీవ్ ద్వీపాలలో కూడా అనేక దీవులు అటోల్ ఆకారంలో ఉన్నవే.

భారతదేశం - పగడపు దిబ్బల విస్తరణ: భారతదేశంలోని పగడపు దిబ్బలు గల్ఫ్ ఆఫ్ కచ్(గుజరాత్), గల్ఫ్ ఆఫ్ మన్నార్(తమిళనాడు), పాక్ అఖాతం, అండమాన్ అండ్ నికోబార్, లక్షద్వీప్ దీవులతో సహా చాలా ప్రాంతాల్లో కనిపిస్తాయి. వాయువ్య ప్రాంతంలోని గల్ఫ్ ఆఫ్ కచ్ ప్రపంచంలో అత్యంత ఉత్తరంగా ఉన్న పగడపు దిబ్బలుగా పేర్కొంటారు. పగడపు దిబ్బల చిన్న చిన్న ముక్కలు రత్నగిరి(మహారాష్ట్ర), మాల్వాన్(మహారాష్ట్ర), రెడి(దక్షిణ బొంబాయి)లో, మంగళూరు(కర్ణాటక)కు పశ్చిమాన ఉన్న గవేషాని బ్యాంకు వద్ద కూడా కనిపిస్తాయి.



వి.వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

లిటిల్స్



తెలివైన కుందేలు

ఒక అడవిలో ఓ కుందేలు ఉండేది. అది ఒంటరిది. స్నేహితుడు ఎవరైనా దొరికితే బావుండు అని అనుకునేది. ఎందుకో తెలీదు కానీ.. ఆ కుందేలుకు చిన్న గొర్రెపిల్లలంటే ఇష్టం. వాటితో స్నేహం చేయాలనుకునేది. అవేమో అడవిలో కనపడేవి కావు. గొర్రెలను కాపరి కాస్తుంటాడు. అది కూడా చిన్న గొర్రెపిల్లలు బయటకు రావు.


ఒక రోజు కుందేలు గడ్డి తినటాకి రోడ్డు పక్కన ఉండే పొదల దగ్గరకు వెళ్లింది. ఓ గొర్రెపిల్లను తీసుకుని ఓ వ్యక్తి దారిలో వస్తున్నాడు. ఆ వ్యక్తి సంతలో కొని ఆ గొర్రెపిల్లను తెస్తున్నాడు. ఆ గొర్రెపిల్ల అందంగా ఉంది. ఆ అమాయక గొర్రెపిల్లతో స్నేహం చేయాలనుకుంది కుందేలు. ఎలాగైనా ఆ గొర్రెపిల్లను ఆ వ్యక్తి బారిన నుంచి విడిపించటానికి సిద్ధమైంది. ఎదురుగా వెళ్తే తనను కూడా పట్టుకుంటాడని అనుకుంది. కొంచెం ఆలోచించింది.

పొదల మాటున ఉండే ఇంటిలో ఓ అందమైన షూలను చూసింది. వాటిలో కుడి షూ తీసుకొచ్చి రోడ్డుమీద జారవిడిచింది. ఆ వ్యక్తి ఆ షూ చూసి ఆశ్చర్యపోయాడు. ఎంత బావుందో.. అయితే ఒక్కటే షూ ఉంది అనుకున్నాడు. రెండో షూ కూడా అక్కడే ఉంటుందని మొదటి షూను అక్కడే ఉంచి వెదకసాగాడు. ఎట్టకేలకు ఓ పొదలచాటున రెండో షూ కనపడింది. మొదటి షూ చూస్తే కనపడలేదు. ఏదో తీసుకెళ్లిందని అనుమానించాడు. అయినా కూడా ఆ షూను దక్కించుకోవాలనే కల ఆయనది. దీంతో మాత్రం ఆలోచించకుండా ముందుకు వెళ్లాడు. ఈ చంకలో ఈ గొర్రెపిల్ల ఒకటి అని గొణుక్కుంటూ.. ఆ గొర్రెపిల్లను ఓ చెట్టు కింద ఉంచాడు. చేతిలో ఉండే షూ అక్కడే వదిలేసి.. రెండో షూ కోసం వెళ్లిపోయాడు ఆ చుట్టు పక్కల ప్రాంతంలోకి.




వెంటనే ఆ గొర్రెపిల్ల దగ్గరకు పోయింది కుందేలు. తను శాకాహారినని చెప్పింది. ఆ గొర్రెపిల్ల భయపడింది. ఆ తర్వాత అందమైన కుందేలు మాటలను నమ్మింది. కుందేలు వెంట వెళ్లిపోయింది. ఇంతలో ఆ వ్యక్తి వెతగ్గా.. రెండో షూ దొరికింది. ఇక సంతోషంతో షూ తీసుకుని.. చెట్టు దగ్గరకు వచ్చాడు. తీరా చూస్తే ఆ గొర్రెపిల్ల కనపడలేదు. ఆ షూ కూడా కనపడలేదు. రెండూ పోయెనే అని విలవిల్లాడాడు.


సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



ఏవి ఎన్ని?



డైలీ సుడోకు - 259

	6		4	3			8	
	8	7						2
2	4				8			1
	7							
4		1	8		9	2		6
							9	
8			3				6	5
6						4	7	
	9			4	6		2	

సుడోకు - 258 సమాధానం

9	2	5	7	3	4	6	1	8
3	6	1	8	5	9	2	7	4
7	8	4	2	6	1	3	9	5
5	1	2	4	7	6	8	3	9
4	7	6	9	8	3	1	5	2
8	9	3	1	2	5	4	6	7
6	4	7	3	9	2	5	8	1
1	5	8	6	4	7	9	2	3
2	3	9	5	1	8	7	4	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.